
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ముగిసిన జిహెచ్‌ఎంసి పాలకమండలి పదవీకాలం

ప్రత్యేక అధికారి పాలనలోకి గ్రేటర్ హైదరాబాద్ మహా నగరం 04

సంపుటి 09, సంచిక: 74 | బుధవారం | 11-02-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# నేడే పుర పోరు

- రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు
- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 41,773 మంది సిబ్బంది, 1,379 మంది రిటర్నింగ్ అధికారులు...
- 8,203 పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల పటిష్ట బందోబస్తు
- 1,302 అంత్యంత సమస్యాత్మకమైనవి : డిజిపి శివధర్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు జరగనున్న పోలింగ్‌ను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం 41,773 మంది పోలింగ్ సిబ్బంది, 1,379 మంది రిటర్నింగ్ అధికారులను నియమించారు. పోలింగ్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ కోసం మొత్తం 8,191 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో పాటు డిజిటల్ నిఘా వ్యవస్థలను కూడా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు రూ. 2,67,49,019 విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా అన్ని పోలింగ్ ప్రాంతాల్లో బిఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు. అలాగే 4,150 మందిని ముందస్తుగా బైండోవర్ చేయగా, 1,183 లైసెన్సలను ఆయుధాలను డిపాజిట్ చేయించుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారం ఫిబ్రవరి 9న సాయంత్రం 5 గంటలతో ముగిసిందని, ఆ తరువాత అన్ని రకాల ప్రచార కార్యక్రమాలు నిషేధమని కమిషన్ స్పష్టం చేసింది. ఓటర్లు తమ ఎపిక్ నెంబర్ ద్వారా 'టీ పోల్' ఆన్‌డ్రాయిడ్ యాప్ నుంచి ఓటర్ స్లిప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు, పోలింగ్ కేంద్ర వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 92400214 56ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి ఓటరు భయం లేకుండా, బాధ్యతాయుతంగా తరువాయి 2లో

**మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 11.30 లకు కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల( బాలురు) లో ఓటు వేయనున్నారు. అనంతరం సిఎం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.**

**రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం ప్రత్యేక సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు జరుగుతున్న 116మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో విద్యాసంస్థలకు సెలవు ఇచ్చింది. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులందరికీ 'స్పెషల్ క్యాజువల్ లీవ్' (ప్రత్యేక సాధారణ సెలవు) మంజూరు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.**




## ఓటుకు నోటు కేసు రికార్డులు ఎఫ్‌ఎస్‌ఎల్‌లో లేవు

- ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన నివేదికలు కూడా ఫార్వర్డింగ్ అథారిటీకి ఇప్పటికే పంపించాం
- కొన్ని కేసుల డేటా దెబ్బతిన్నదన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
- అగ్ని ప్రమాదంపై విచారణ కొనసాగుతున్నది
- డిజిపి బి.శివధర్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్‌ఎస్‌ఎల్)లో ఇటీవల చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టేందుకు కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సిఎఫ్‌ఎస్‌ఎల్)తో పాటు నాగపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ ఇంజినీరింగ్‌కు చెందిన నిపుణుల బృందం హైదరాబాద్‌కు చేరుకుంది.ఈ నిపుణులు స్థానిక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపడుతున్నట్లు తెలంగాణ డిజిపి బి.శివధర్ రెడ్డి తెలిపారు. విచారణ కొనసాగుతోంది. కొన్ని రోజుల్లో అగ్ని ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం తెలుస్తుంది అని ఆయన వెల్లడించారు.అగ్ని ప్రమాదంలో కేసులకు సంబంధించిన డేటా నష్టం జరిగిందన్న ప్రచారాన్ని డిజిపి ఖండించారు. కొన్ని కేసుల డేటా తరువాయి 2లో

# ఓం బిర్లాను తొలగించాలి



లోక్‌సభ స్పీకర్‌పై విపక్ష సభ్యులు అవిశ్వాస తీర్మానం

- 120 మంది ఎంపిల సంతకాలతో లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసును అందజేసిన ప్రతిపక్ష ఎంపిలు
- సభా వ్యవహారాలను కొనసాగించడంలో స్పీకర్ పక్షపాత వైఖరి చూపుతున్నారని ఆరోపణ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి ఓం బిర్లాను తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు మంగళవారం నోటీసు సమర్పించాయి. ఆయన సభా వ్యవహారాలను నిర్వహించడంలో స్పష్టంగా పక్షపాతంతో వ్యవహరించారని, ఆయన నిర్వహిస్తున్న రాజ్యాంగ పదవిని దుర్వినియోగం చేశారని ఆరోపించాయి. బిర్లాను లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి తొలగించేలా తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష పార్టీలు నోటీసు ఇచ్చాయి. కాంగ్రెస్ సభ్యులపై స్పీకర్ కొన్ని తప్పుడు ఆరోపణలు చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, చీఫ్ విప్ కె సురేష్, విప్ మొహమ్మద్ జావేద్ రాజ్యాంగంలోని ఆర్టికల్ '94 సి' కింద కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకెతో సహా అనేక ప్రతిపక్ష పార్టీల తరఫున లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసును సమర్పించారు. కాంగ్రెస్, డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, వామపక్ష పార్టీలు, ఆర్‌జెడి సహా ప్రతిపక్షానికి చెందిన దాదాపు 120 మంది ఎంపిలు ఈ నోటీసుపై సంతకం చేశారని వర్గాలు తెలిపాయి. శివసేన యుబిటి, ఎన్‌సిపి(ఎస్‌పి) కూడా నోటీసుపై సంతకం చేశాయి. అయితే టిఎంసి నోటీసుపై సంతకం చేయలేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా నోటీసుపై సంతకం చేయలేదని వర్గాలు తెలిపాయి. లోక్‌సభ కార్యకలాపాలను స్పష్టంగా పక్షపాతంతో నిర్వహిస్తున్నందున, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) నిబంధనల ప్రకారం, ఓం బిర్లాను స్పీకర్ పదవి నుండి తొలగించాలని తాము ఒక తీర్మానాన్ని నోటీసు ఇస్తున్నాము అని ప్రతిపక్షాలు నోటీసులో పేర్కొన్నట్లు వర్గాలు తెలిపాయి. అనేక సందర్భాల్లో ప్రతిపక్ష పార్టీల నాయకులను మాట్లాడటానికి అనుమతించలేదు, ఇది పార్లమెంటులో వారి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని నోటీసులో ప్రతిపక్ష సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 2న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై తన ప్రసంగాన్ని పూర్తి చేయడానికి అనుమతించలేదని కూడా నోటీసులో ఉదహరించారు. ఇది ఒక వివిక్త ఉదాహరణ కాదు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి దాదాపు ఎల్లప్పుడూ అనుమతించరు అని అన్నారు. అదే విధంగా 3వ తేదీన ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిలను మొత్తం బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని, వారి ప్రజాస్వామ్య హక్కులను వినియోగించినందుకు మాత్రమే వారికి తరువాయి 2లో



## రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్

- ఆధారాలు సేకరించే పనిలో ఉన్నాం
- బాధ్యులపై ఉక్కుపాదం మోపుతాం
- మంత్రి పొంగులేటి హెచ్చరిక
- సిపిఐ మిత్రపక్షమేనని స్పష్టీకరణ

ప్రజాపక్షం/ ఖమ్మం

రాష్ట్రంలో ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని ఇందుకు బాధ్యులైన వారిపై ఉక్కుపాదం మోపక తప్పదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఆధారాలను సేకరించే పనిలో ఉన్నామని ఎక్కడెక్కడ పరికరాలు అమర్చారో ఆరా తీస్తున్నామని ఆయన తెలిపారు. ఖమ్మంలో మంగళవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన ఫోన్ ట్యాపింగ్‌నే ఇప్పుడు కూడా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని ఇందుకు కారకులైన వారిని వదిలిపెట్టబోమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరువాయి 2లో



12న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా

# కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

- నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి
- డ్రాఫ్ట్ సీడ్ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- సమ్మెలో దాదాపు 30 కోట్ల మంది పాల్గొంటారని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలనీ కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్, బర్కత్‌పుర చౌరస్తా నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను ఎఐటియుసి జాతీయ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్ ప్రారంభించి, అనంతరం మాట్లాడుతూ నిరంకుశ మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయడం, డ్రాఫ్ట్ సీడ్ బిల్లు, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవడం, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ కోసం ట్రేడ్ యూనియన్లు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సంఘటిత, ప్రైవేట్ రంగ సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాలు, అసంఘటిత కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వరంగ ఉద్యోగులు దేశ వ్యాప్తంగా దాదాపు 30 కోట్ల మంది సమ్మెలో పాల్గొంటారని, కార్మికులు, రైతులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఏం. నరసింహ, రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, నేతలు బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, సిఐటియు నేతలు కుమార స్వామి, నరేష్, అజయ్ బాబు, ఐఎఫ్‌టియు నేతలు అనురాధ, అరుణ, శివబాబు, టియుసిఐ నేతలు ఎస్‌ఎల్ పద్మ, ప్రదీప్,హెచ్‌ఎంఎస్ నేత అంజాద్ ఖాన్, ఎఐయుటిసి నేత భరత్ తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల మిస్సింగ్' వెనక

# దేశవ్యాప్త నెట్‌వర్క్ ఉందా?

నిర్ధారించాలని కేంద్రాన్ని కోరిన 'సుప్రీం'




**న్యూఢిల్లీ :** 'దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పిల్లలు తప్పిపోయిన సంఘటనల వెనక ఏదైనా నెట్‌వర్క్ ఉందా ? లేదా రాష్ట్ర నిర్దిష్ట సమూహం ఉందా?' అనే విషయాన్ని నిర్ధారించాలి అని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. ఈ సంఘటనల వెనక ఏదైనా నమూనా ఉందా లేదా తప్పిపోయిన సంఘటనలు యాదృచ్ఛికంగానే జరిగాయా? అని నిర్ధారించాల్సిన అవసరాన్ని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నొక్కిచెప్పింది.అన్ని రాష్ట్రాల నుండి డేటాను క్రోడీకరించాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు మాత్రమే తప్పిపోయిన పిల్లల డేటాను ప్రాసిక్యూషన్‌కు ఇచ్చారని, ఇంకా 12 రాష్ట్రాలు తమ డేటాను ఇవ్వలేదని ధర్మాసనానికి వివరించారు. కేంద్రం ప్రభుత్వం పూర్తి డేటాను పొందిన తర్వాతనే విశ్లేషణ చేయవచ్చని ఆమె సమర్పించారు. ఈ తప్పిపోయిన సంఘటనలు ఎలా జరిగాయనే విషయాన్ని తామూ తెలుసుకోవాలనుకుంటున్నామని ఐశ్వర్యా భాటి ధర్మాసనానికి విన్నవించారు. రక్షించబడిన పిల్లలను ఇంటర్వ్యూ చేసి ఆ సంఘటనలకు ఎవరు బాధ్యులనే విషయాన్ని తరువాయి 12లో



## రాష్ట్రపతి పరిశీలనలో బిసి కోటా బిల్లులు

- 42% పెంపు సంబంధించి రెండు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి
- ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నకు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన కేంద్ర సామాజిక న్యాయ శాఖమంత్రి బి.ఎల్.వర్మ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో వెనకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచే ప్రతిపాదనకు సంబంధించి రెండు బిల్లులు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ తెలిపారు. లోక్‌సభలో మంగళవారం మల్కాజిగిరి లోక్‌సభ నియోజవర్గం తరువాయి 2లో



## అసోం సిఎం వ్యాఖ్యలపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన సిపిఐ

నిష్పాక్షిక దర్యాప్తునకు 'సిట్' ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పదే పదే చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలపై భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తనపై తక్షణ న్యాయపరమైన జోక్యాన్ని కోరుతూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా ద్వారా సుప్రీం కోర్టులో కేసు దాఖలు చేసినట్లు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. న్యాయపరంగా కఠిన తరువాయి 12లో

# వసూలైంది రూ.1,33,208 కోట్లు... ఇచ్చింది రూ.51,725 కోట్లు...

- పార్లమెంట్ సాక్షిగా స్వయంగా కేంద్ర మంత్రే ప్రకటించారు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడి
- పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి వసూలైతే దక్షిణాదికి సగటున 30 పైసలను ఇస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణ రాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వానికి 2024–25 సంవత్సరానికి గాను రూ.1,33,208 కోట్ల పన్నులు వసూలైతే, కేంద్రం నుండి తెలంగాణకు పన్నుల రూపంలో రూ.27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో రూ.7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల రూపంలో రూ. 16,762 కోట్లు మొత్తంగా రూ.51,725 కోట్లు మాత్రమే విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా స్వయంగా కేంద్ర మంత్రినే ప్రకటించారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నులరూపంలో కేంద్రానికి



రూపాయి వసూలవుతే, తిరిగి దక్షిణాది రాష్ట్రాలకు సగటున 30 పైసలను ఇస్తున్నారని, కాని బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం ప్రతి ఒక రూపాయికి రూ.4ల చొప్పున తరువాయి 2లో

# ట్రంప్ ఆర్థిక యుద్ధం క్యూబాలో చమురు సంక్షోభం

స్తంభించిన విమానాలు, బస్సులు, విద్యాలయాలు




**హవానా:** చమురు రవాణాపై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా క్యూబా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. ట్రంప్ వైఖరి ఇదేవిధంగా కొనసాగితే రాబోయే రోజుల్లో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి. క్యూబాపై ట్రంప్ ఆర్థిక ఆంక్షల యుద్ధాన్ని ఉద్ధృతం చేయడంతో దేశంలో వాహనాలు నిలిచిపోయాయి. రోడ్లన్నీ వాహనాల శబ్దం లేకుండా నిశ్శబ్దంగా ఉన్నాయి. విమానాల రాకపోకలను నిలిపివేశారు. చమురు సంక్షోభాన్ని తట్టుకునేందుకు, ఇంధనం ఆదా చేసేందుకు అనేక విద్యాలయాలను మూసివేశారు. క్యూ బాలో చమురు సంక్షోభం తలెత్తడంతో ఎయిర్ కెనడా కూడా ఆ దేశానికి విమానాలు నడపకుండా నిలిపివేసింది.దేశంలోకి చమురు వచ్చే అవకాశాలు లేకపోవడంతో అత్యవసరాలను తీర్చుకోవడంకోసం క్యూబా ప్రభుత్వం ఎమర్జెన్సీ చర్యలు తీసుకుంది. ఇంధనాన్ని ఆదా చేయడంకోసం విశ్వవిద్యాలయాలు సహా విద్యాలయాలను మూతవేశారు. గతనెల వరకూ వెనిజు లా తరువాయి 12లో



## తమ్ముడిపై విచారణకు బ్రిటన్ రాజు సమ్మతి

**లండన్:** జెఫ్రీ ఎప్‌స్టీన్ స్నేహపట్ల ఆ మురికి అంటించుకున్న తన సోదరుడు, బ్రిటన్ రాజకుటుంబీకుడు, స్వయానా తన సోదరుడు ఆండ్రూ (66)పై దర్యాప్తు జరిపించేందుకు బ్రిటన్ రాజు ఛార్లెస్–3 సమ్మతించారు. ఈ విధంగా వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్ అవినీతికి సాక్ష్యాలుగా ఉన్న పత్రాలు, వీడియోలు, ఫోటోలపై ఆయన మొదటిసారి నోరు విప్పి స్పందించినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు తెలిపాయి. 'మిస్టర్ మౌంట్ బాటన్ విండ్సార్ ప్రవర్తనపై వెలుగులోకి వస్తున్న విషయాలపై రాజు తన తీవ్ర ఆందోళనను, మాటలు, అసాధారణ చర్యలద్వారా స్పందించారు, నిర్దిష్ట వాదనలను మౌంట్ బాటన్ విండ్సార్ పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, థేమ్స్‌వ్యాలీ పోలీసులు గనుక ఒకవేళ ఆయనను సంప్రదించినట్లయితే వారికి సహకరించేందుకు తాము అంగీకారంతో సిద్ధంగా ఉన్నాం' అని ప్యాలెస్ రాజు ప్రకటించినట్లు ఆయన అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు. అధికార నివాసం, అధికార కార్యాలలో మౌంట్ బాటన్ విండ్సార్ అనుమానిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని రాచరిక వ్యతిరేక సమూహం రిపబ్లిక్‌కు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేయడానికి ఆధారాలున్నాయా?అని థేమ్స్‌వ్యాలీ పోలీసులు అంచనాలువేస్తున్నారు. బ్రిటన్ మాజీ రాణి క్వీన్ ఎలిజబెత్ రెండో కుమారుడైన మాజీ ప్రిన్స్ ఆండ్రూ (ఆండ్రూ ఆల్బర్ట్ క్రిస్టియన్ ఎడ్వర్డ్ మౌంట్‌బాటెన్–విండ్సార్) వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో దీర్ఘకాల గాఢానుబంధం కొనసాగించారు. బ్రిటన్ సంపన్నుల్లో పెద్దమనిషిగా చెలామణి అయిన మహిళ ఘిస్లేన్ మాక్స్‌వెల్, ఎప్‌స్టీన్ ఇద్దరూ ఆండ్రూ లైంగిక అవసరాలు తీర్చేందుకు మహిళలను సరఫరా చేశారన్న నిందలు ఎదుర్కొంటున్నారు. సింగపూర్, వియత్నాం, హాంకాంగ్‌లలో పెట్టుబడుల అవకాశాలపై పర్యటించి ఆ వివరాలు రహస్యంగా దాచి ఉంచారు. వారిద్దరు నడిపిన ఈ–మెయిల్స్, రాజప్రాసాదానికి రావాల్సిందిగా ఎప్‌స్టీన్‌కు ఆండ్రూ పంపిన ఆహ్వానాలు, చివరకు తన భార్య, ఇద్దరు కుమార్తెల ఫోటోలను కూడా ఎప్‌స్టీన్‌కు పంపించిన గత చరిత్ర అంతా ఈనెలారంభంలో అమెరికా జస్టిస్ విభాగం విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్, వీడియోలు, చిత్రాల ద్వారా బహిర్గతమైంది. దీంతో ఆండ్రూ రాజప్రాసాదం వదిలి సాంద్రింఘామ్‌లోని ప్రైవేటు ఎస్టేట్‌కు నివాసాన్ని మార్చుకున్నారు. మరోవైపు ఈ కేసులో నిందితురాలు మాక్స్‌వెల్ కూడా అమెరికా హౌస్ కమిటీ ఎదుట సాక్ష్యం చెప్పేందుకు తిరస్కరిస్తున్నారు.

# వెస్ట్‌బ్యాంక్ దురాక్రమణపై ప్రపంచవ్యాప్త నిరసన

**జెరూసలెం:** వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాన్ని ఆక్రమించి కలిపేసుకోవాలని, విస్తరించాలన్న ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ప్రపంచ దేశాలన్నీ ముక్తకంఠంతో ప్రతిఘటించాయి. ఎనిమిది ముస్లిం దేశాలు ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకించాయి. యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి సహా అనేక ప్రపంచదేశాలు ఇజ్రాయెల్ కొత్త ప్రణాళికను విమర్శించాయి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ ఆక్రమణలు చట్టవిరుద్ధమని, అక్కడి వెనక్కుతగ్గి వెళ్ళిపోవాలని బ్రిటన్ డిమాండ్ చేసింది. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి అని హెబ్రాన్ డిప్యూటీ మేయర్ అస్మా షరబతి హెచ్చరిక చేశారు. పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయెల్ తన పట్టును పెంచుకోవడంకోసం మరింతగా విస్తరించేందుకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ వరుసగా అనేక చర్యలకు ఆమోదం తెలియజేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో భూముల రిజిస్ట్రేషన్లు, ఆస్తుల సేకరణకు సంబంధించిన నిబంధనలలో సెక్యూరిటీ క్యాబినెట్ ఆదివారంనాటి సమావేశంలో నాటకీయమైన మార్పులకు తీసుకువచ్చింది. ఈ మార్పులవల్ల దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌కు ఉన్న ఆటంకాలు తొలగిపోయాయి. 1967లో జరిగిన యుద్ధంలో గాజా, వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలెం ప్రాంతాలను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఐతే పాలస్తీనియన్లు ఈ మూడు ప్రాంతాలను కలిపి భవిష్యత్ దేశంగా ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నారు. పాలస్తీనా అథారిటీ ఈ చర్యను ఖండించింది. తక్షణం ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్‌చేసింది. ఇజ్రాయెల్‌తో అరబ్, ముస్లిం దేశాలు సంబంధాలను రద్దు చేసుకోవాలని పాలస్తీనా అథారిటీ కోరింది. ఈ పరిణామాలపై ట్రంప్ స్పందిస్తూ, వెస్ట్‌బ్యాంక్ దురాక్రమణకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాను మద్దతు ఇవ్వబోనన్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో స్థిరత్వం నెలకుంటే ఇజ్రాయెల్ కూడా స్థిరంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో శాంతి సాధన లక్ష్యం నెరవేరుతుందని వైట్‌హౌస్ యంత్రాంగం ఒక ప్రకటనలో తెలియజేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో జెరూసలెం తన పాలనాపరమైన అధికార నియంత్రణను విస్తరించడం ద్వారా ఓస్లో ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందని పేర్కొంది. బెత్లెహామ్‌లో, హెబ్రాన్‌లో ఉన్న రెండు ప్రధానమైన తమ ప్రదేశాలను కూడా తన అధీనంలోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ యంత్రాంగం నిర్ణయించింది. దీనికి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఈ పరిస్థితులమధ్య ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ అమెరికా వెళ్ళారు. ట్రంప్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఇరాన్‌తో అణు చర్యలు జరిపే అవకాశం ఉంది.



**ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు మృతి**
**రఫాలో మెరుగుపడిన రవాణా**

గాజా పశ్చిమ నగరం షిఫాలో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో ముగ్గురు మరణించారు. షిఫా ఆసుపత్రివర్గాలు ఇచ్చాన సమాచారం ప్రకారం, గడచిన అక్టోబరులో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత కూడా గాజాలో యుద్ధం కొనసాగుతోంది. కాల్పుల ఉల్లంఘనకు పాల్పడి దాడులు చేయడంతో తాము స్పందించామని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. రఫాలోని లక్ష్యలను దెబ్బతీసినట్లు తెలిపింది. ట్రంప్ 20 సూత్రాల ప్రణాళిక ప్రకారం, నేటికి నాలుగు నెలలుగా గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉంది. వెస్ట్‌బ్యాంక్‌లో పరిణామాలపట్ల ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తన అధికార పరిధి విస్తరిస్తూ సెక్యూరిటీ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్రంగా వ్యతిరేకించారు. కాగా గాజా నుండి ఈజిప్టు వెళ్ళేందుకు ఉన్న ప్రధానమైన రఫా క్రాసింగ్‌ను తెరచిన కొద్దిరోజుల తర్వాత ఈనాటికి రవాణా కార్యకలాపాల పరిస్థితి మెరుగుపడింది. సోమవారం 88 మంది రోగులు గాజా నుండి ఈజిప్టుకు చికిత్సల నిమిత్తం వెళ్ళారు. దాదాపు 20,000 మంది పాలస్తీనియన్లు మెరుగైన వైద్యచికిత్సకోసం ఈజిప్టు వెళ్ళేందుకు ఎదురుచూస్తున్నారు.

## వైదొలగిన మరో సహాయకుడు
## రాజీనామాకు తిరస్కరించిన స్టార్‌మర్



**లండన్:** ఎప్‌స్టీన్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని దేశంలో ప్రతిపక్షాల నుండి తీవ్ర విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొంటున్న బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్, ఇప్పటికే ఇద్దరు ముఖ్యసహాయకులను కోల్పోయారు. క్యాబినెట్ కార్యదర్శి క్రిస్‌వర్మల్డ్ కూడా రాజీనామా చేసే వాతావరణం కనిపిస్తున్న తరుణంలో, స్టార్‌మర్ తన పదవికి రాజీనామా చేసేందుకు తిరస్కరించారు. ఒక సరికొత్త బృందాన్ని ప్రభుత్వం నడిపించడంకోసం తాను సిద్ధం చేసుకుంటానని ఉద్ఘాటించారు. చుట్టుముడుతున్న వివాదంపై ఆయన మంత్రివర్గ సహచరులు గడచిన 24 గంటలుగా మౌనం వహించడంతో స్టార్‌మర్ మంగళవారం వారిని సమావేశపరిచారు. తన మంత్రివర్గాన్ని రద్దుచేయకూడదని నిర్ణయించుకున్నారు. స్టార్‌మర్ రాజీనామా చేయాలని స్కాటిష్ లేబర్ నాయకుడు అనాస్ సర్వర్ డిమాండ్ చేసిన తర్వాతీ సమావేశం జరిగింది. ''మనం విశ్వాసంతో ముందకు వెళదాం, దేశంలో మార్పు తెచ్చేందుకు కృషిని కొనసాగిద్దాం, ప్రభుత్వ విధులకు, ప్రజాసేవకు ఐక్యంగా కట్టుబడి ఉందాం'' అని మంత్రివర్గ సభ్యులతో ఆయన అన్నారు. లేబర్‌పార్టీకి ఎంతో సురక్షితమైన, సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న గోర్టన్–డెంటన్ స్థానానికి ఈనెల 26న ఉప ఎన్నిక జరుగుతున్న తరుణంలో స్టార్‌మర్ ఈ వివాదం ఎదుర్కొంటున్నారు. మాండెల్సన్‌ను అమెరికాలో దౌత్యవేత్తగా నియమించాలని సలహా ఇచ్చిన కీవ్ స్టార్‌మర్ సిబ్బంది ప్రధానాధిపతి మోర్గాన్ మెక్స్వీనా ఆదివారం తన పదవికి రాజీనామా తర్వాత తాజాగా టెన్ డౌనింగ్ స్ట్రీట్ కమ్యూనికేషన్స్ విభాగం ప్రధానాధిపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టిమ్ అల్లెన్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ''ప్రధానమంత్రి స్టార్‌మర్ ఒక కొత్త బృందాన్ని తయారు చేసుకోవడానికి వీలుగా నేను వైదొలగుతున్నాను, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను'' అని లిఖితపూర్వకంగా టిమ్ అల్లెన్ పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రభుత్వంలో ఆయనకు ప్రధాన సలహాదారుగా టిమ్ అల్లెన్ పనిచేశారు. మెక్ స్వీనీ టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌ను వదలి వెళ్ళిపోవడంతో అక్కడి కార్యకలాపాలన్నీ స్తంభించాయి. కానీ వింధ్యా అలెక్సన్, జిల్ కత్‌బెర్ట్‌స్టన్‌లు ఆ బాధ్యతలు తీసుకున్నారు. స్టార్‌మర్ ప్రభుత్వంలో ఇద్దరు ముఖ్యులు వరుగా రాజీనామాలు చేయడంతో బ్రిటన్ ప్రభుత్వంలో సంక్షోభం మరింత ముదిరింది. ఐతే ప్రతిపక్షాలు కోరినవిధంగా రాజీనామా చేసేందుకు కీవ్ స్టార్‌మర్ తిరస్కరించారు. మాండల్సెన్ పదే పదే అబద్ధాలు వల్లెవేసి తనను తప్పుదోవ పట్టించారని, తన్న అబద్ధాలతో నమ్మించి మోసం చేశారని స్టార్‌మర్ వాదిస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం ప్రధానమంత్రి ఆయనను, తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార నివాసం టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో సిబ్బందితో స్టార్‌మర్ మాట్లాడుతూ, మంచికోసం మనం ముందుకు వెళ్ళాలని, మంచి చేయడానికి రాజకీయాలు ఒక బలమైన శక్తిగా ఉంటాయని మనం నిరూపించాలని అన్నారు.

## అమెరికా–బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం

**ఢాకా:** అమెరికా–బంగ్లాదేశ్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 15 సంవత్సరాలలో బంగ్లాదేశ్ 18.5 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను, ఇంధన ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. అమెరికాకు ప్రయోజనం కలిగే రీతిలో ఈ ఒప్పందం జరిగింది. 3.5 బిలియన్ డాలర్లు విలువైన వ్యవసాయ ఉత్పత్తులను, మరో 15 బిలియన్ డాలర్లు విలువైన ఇంధన ఉత్పత్తులను ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది.అదేవిధంగా అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులకు తన మార్కెట్‌లను బంగ్లాదేశ్ అందుబాటులో ఉంచాలి. ఒకవేళ బంగ్లాదేశ్ గనుక అమెరికా నుండి 14 బోయింగ్ జెట్స్‌ను కొనుగోలు చేస్తే ఈ వాణిజ్యం విలువ మరింతగా పెరుగుతుంది.35,000 కోట్ల టాకాలు విలువైన 14 బోయింగ్‌లను కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు యూనస్ తాత్కాలిక ప్రభుత్వం గతవారం ప్రకటించింది.

## బ్రిటన్ ప్రధానిగా ముస్లిం మహిళకు అవకాశం?



**లండన్:** ఒకవేళ కీర్‌స్టార్‌మర్ తన పదవికి రాజీనామా చేస్తే ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు తీసుకోవడానికి ఎవరున్నారనే విషయంపై ఊహాగానాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లేబర్‌పార్టీకి చెందిన హోంమంత్రి షబనా మహ్మద్ పేరు వినిపిస్తోంది. 45 ఏళ్ళు వయసుగల షబనా మహ్మద్ మితవాతపక్షంలో ఉన్నారు. న్యాయవాది, రాజకీయనాయకురాలు. స్టార్‌మర్ గనుక రాజీనామా చేస్తే ఎక్కువగా ప్రధానమంత్రి పదవికి ఆమెకే అవకాశాలు ఉన్నాయని అంచనాలు చక్కెర్లు కొడుతున్నాయి. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న మిర్‌పూర్ పట్టణ మూలాలుగల షబనా మహ్మద్ బర్మింగ్‌హామ్‌లో జన్మించారు. మంత్రి పదవి చేపట్టాక ఆమె ప్రధానంగా బ్రిటన్ సరిహద్దు భద్రతా వ్యవహారాలు చూస్తున్నారు. 2002 ఆక్స్‌ఫర్డ్ లింకన్ కాలేజీలో ఆమె డిగ్రీ పూర్తిచేశారు. హిందుస్థాన్ పత్రిక ఈ వార్త ప్రచురించింది.2010లో ఆమె మొదటి ముస్లిం ఎంపీగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఆమె పాలస్తీనియన్లకే పూర్తి మద్దతు ఇస్తున్నారు.

## ఎఫ్ఎస్ఎల్‌లో లేవు

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం. అలాంటిదేమీ జరగలేదు అని స్పష్టం చేశారు. 'నోట్ ఫర్ ఓట్' కేసు విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలు, సాక్ష్యాలు 2021లోనే కోర్టుకు పంపించామని, ఆ కేసుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు ఒక్క శాతం కూడా ఎఫ్ఎస్ఎల్‌లో లేవని డిజిపి స్పష్టం చేశారు. అలాగే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన నివేదికలు కూడా ఫార్వార్డింగ్ అథారిటీకి ఇప్పటికే పంపించామని చెప్పారు. ఎఫ్ఎస్ఎల్ సర్వర్లలో ఉన్న డేటాను తిరిగి పొందేందుకు నిపుణులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అఖండ విజయం సాధిస్తుందని 80 శాతం స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిక స్థానాలు గెలవబోతుందనే విషయాన్ని తెలుసుకుని బిఆర్ఎస్ అక్రోశం వెల్లగక్కుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని నెలకు రూ.6,300 కోట్లు వడ్డీలకే చెల్లిస్తున్నామని ఆయన అన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పేరుతో మొండి గోడలు దర్శనమిచ్చాయని ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ సిపిఐ మా మిత్రపక్షమేనని ఆయన సమాధానం ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరి మధ్య పోటీ కేవలం స్నేహపూర్వక పోటీ మాత్రమేనన్నారు.

## తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిమానా విధిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. ఇక 4వ తేదీన బిజెపికి చెందిన ఒక ఎంపి ఇద్దరు మాజీ ప్రధానులపై పూర్తిగా అభ్యంతరకరమైన, వ్యక్తిగతీకరించిన దాడులు చేయడానికి అనుమతించారని, సంప్రదాయాలు, సముచిత నియమాలను ఉల్లంఘించినందుకు ఒక్కసారి కూడా మందలించలేదని నిషికాంత్ దూబే వ్యాఖ్యలను ప్రతిపక్ష సభ్యులు నోటీసులో ప్రస్తావించారు. తాము విజ్ఞప్తి చేసినప్పటికీ ఈ ఎంపిపై ఎటువంటి చర్య తీసుకోలేదని గుర్తుచేశారు. చాలా మంది కాంగ్రెస్ సభ్యులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి ఏదో ఊహించని చర్య చేపట్టే అవకాశం ఉందని తనకు కచ్చితమైన సమాచారం ఉందని, దాని ఫలితంగా రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి సభకు రావద్దని ఆయనను అభ్యర్థించారని బిర్లా చేసిన వ్యాఖ్యలను కూడా నోటీసులో ప్రతిపుపక్షం ప్రస్తావించింది. ఈ అంశంలో కాంగ్రెస్ సభ్యులపై తప్పుడు ఆరోపణలు చేశారని, ఇది అవమానకరమైన విషయమని, విధాన నియమాలు, పార్లమెంటరీ మర్యాద నియమాలకు సంరక్షకుడిగా ఉండాల్సిన స్పీకర్, అటువంటి ప్రకటనలు చేయడానికి సభలో అడుగుపెట్టారని, ఇది ఈ రాజ్యాంగ పదవి దుర్వినియోగానికి నిదర్శనం అని నోటీసులో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్‌ను వ్యక్తిగతంగా గౌరవిస్తున్నప్పటికీ, పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యులు చట్టబద్ధమైన ప్రజా ఆందోళన అంశాలను లేవనెత్తకుండా ఆయన నిరంతరం అడ్డుకున్న తీరు తమకు బాధ కలిగించిందన్నారు. కాగా, మంగళవారం ఉదయం మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో జరిగిన ఫ్లోర్ లీడర్ల సమావేశంలో ప్రతిపక్షం నోటీసు సమర్పించాలనే నిర్ణయం తీసుకుంది. ప్రతిపక్షం ఇచ్చిన నోటీసును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బిర్లా లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను ఆదేశించారని, నిబంధనల ప్రకారం దీనిని పరిశీలించి ప్రాసెస్ చేస్తామని వర్గాలు తెలిపాయి.

# తెలుగు మృత భాష కాదు.. అమృత భాష

### పిల్లలకు బాల్యం నుంచే తెలుగు భాషపై మక్కువ కల్పించాలి
### ఒయు తెలుగు లిటరరీ కాంగ్రెస్‌కు హాజరైన విదేశీ తెలుగు ప్రతినిధులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు మృతభాష కాదని, అమృత భాష అని వివిధ దేశాల నుంచి హాజరైన తెలుగు ప్రతినిధులు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండవ రోజు ఆర్ట్స్ కళాశాలలలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రూమ్ నెంబర్ 121లో మంగళవారం పద్మ విభూషణ్ సంజీవ నరసింహా అధ్యక్షతన ' దేశ విదేశాలలో తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి మార్గదర్శనం' అనే అంశంపై చర్చను నిర్వహించగా, రూమ్ నెంబర్ 133లో 'సోషల్ మీడియా లైక్స్, షేర్స్, వైరల్ సాహిత్యం' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హాంకాంగ్‌లో తెలుగు ఫెస్టివల్ ను నిర్వహించడంతో పాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యం లను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా అమెరికాలో తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని, పద్యాలు, లలిత గీతాలు, నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింపచేశామని, ప్రస్తుతం 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరించారు. ప్రతి శనివారం రెండు గంటలపాటు ఆస్ట్రేలియాలో తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీలో సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు. పిల్లలకు బాల్యం నుంచే తెలుగు భాష పై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 'తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి, తెలుగు లిటరరీ కాంగ్రెస్ డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.కాసిం, జయ పీసపాటి, గూడూరు శ్రీనివాస్, గణేష్ తొట్టిపూడి, ఆచార్య వై రెడ్డి శ్యామల, డాక్టర్ ఝాన్సీ ఉడుము, సిరికొండ నరసింహ రాజు, రెహమానుద్దీన్ షేక్, దాసరి కరుణ, రాజీ కన్నా, చరణ్ పరిమి, అమృత రాజ్, సాత్వికలు, వంశీ, శివ శంకర్, ఉదయ్, రాము వేర్ల వెంకటనారాయణ, విమల, దండ వెంకట రాములు, బాలు అగ్నివేష్, హతి రామ్, ధరణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలలకు నిమ్స్‌లో చిత్రలేఖనం పోటీలు

### పాల్గొన్న ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుధా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం (ఐసిసిడి) సందర్భంగా నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బాలలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సుధారెడ్డి పాల్గొని, మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు మానసిక ధైర్యాన్ని పెంచడంతో పాటు, వారి ఆత్మవిశ్వాసాన్ని బలపరుస్తాయని అన్నారు. క్యాన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులకు ధైర్యం, ఆనందం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప తెలిపారు. బాలలకు ప్రత్యేక పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి, ప్రొఫెసర్ డా.



సదాశివుడు గుండేటి, విభాగ అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులు, నర్సులు , సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి కోటా బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయా?, వాటి ప్రస్తుత స్థితి ఏమిటి? అని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ సమాధానమిస్తూ వెనుకబడిన తరగతుల (బిసి) రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచే ప్రతిపాదనకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు అందినట్లు చెప్పారు. ఈ బిల్లులు భారత రాష్ట్రపతి పరిశీలన, ఆమోదం కోసం కేంద్రానికి పంపించారని, ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్నారు. రాష్ట్రపతి ఆమోదం లభిస్తే, తెలంగాణ రాష్ట్రంలో విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచేందుకు చట్టపరమైన మార్గం సుగమం అవుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి ప్రకటనతో బిసి రిజర్వేషన్‌ల అంశం మరోసారి జాతీయ స్థాయిలో చర్చకు వచ్చినట్లైంది.

## నేడే 'పుర పోరు'

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకుని స్థానిక పాలనను బలోపేతం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నేడు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే వేతనంతో కూడిన సెలవు ప్రకటించింది. పాఠశాలలకు కూడా సెలవు ఇచ్చారు.

**మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత**

రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డిజిపి శివధర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మున్సిపల్ ఎన్నికల భద్రతపై తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు డిజిపి మహేష్‌భగవత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. హైదరాబాద్ మినహా అన్ని పోలీస్ కమిషనరేట్లు, జిల్లాల్లో జనవరి 27 నుంచే ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ఇప్పటివరకు 1,183 లైసెన్సు ఆయుధాలు జమ చేయించామని, 4,318మందిని బైండోవర్ చేశామని డిజిపి వెల్లడించారు. అలాగే 398 నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బిడబ్ల్యూ) అమలు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాల మధ్య, జిల్లాలోపల మొత్తం 55 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల సందర్భంగా అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఇప్పటివరకు రూ.3.09 కోట్ల విలువైన నగదు, మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై 142 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిలో 1,302 హైపర్ సెన్సిటివ్, 1,926 సెన్సిటివ్, 4,975 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఇతర శాఖల నుంచి 3,000 మంది అదనపు బలగాలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల లోపల 100 శాతం వెబ్‌కాస్టింగ్‌తో పాటు హైపర్ సెన్సిటివ్ కేంద్రాల బయట కూడా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు డిజిపి వెల్లడించారు. ప్రజలు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డిజిపి శివధర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం డిజిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్‌కెమెరాల తీరును పరిశీలించారు.

# ఇచ్చింది రూ.51,725 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమాతుల్యతను పెంచడంతో పాటు ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని తుమ్మల హెచ్చరించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షిణాది రాష్ట్రాలు నేటి కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదని, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ విమర్శించారు. 2018 19 నుంచి 2022 23 సంవత్సరానికి ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అని, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేయడం ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధయన్నారు. ఎక్కువ పన్నులను చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందన్నారు.

**జిఎస్‌టితో తెలంగాణకు రూ. 8వేల కోట్ల నష్టం ..**

జిఎస్‌టి సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వివరించారు. 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాల వారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కోత పెట్టడంతో తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితంగా బలమైన రాష్ట్రాలను బలహీనపర్చి ఆయా రాష్ట్రాలు ఆర్థికంగా ఆధారపడేలా చేయాలన్నదే కేంద్ర ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

**కేంద్ర మంత్రుల పతనానికి నాంది....**

తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో కాలంలో ఏనాడూ ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తీసుకొచ్చామని, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందన్నట్టుగా మాట్లాడటం వారి పతనానికి నాంది అని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ నిమ్మితం తెలంగాణ రాష్ట్రం ప్రతిపాదించిన ఏ ఒక్కటి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా కోసం కేంద్రంతో పోరాడేందుకు తమతో కలిసి రావాలని మంత్రి తుమ్మల బిజెపి ఎంపిలను,నాయకులను కోరారు.




## సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీకి
# రూ.25వేలు విరాళం

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సిఆర్ ఫౌండేషన్‌లోని సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీకి తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.25 వేలు విరాళం చెక్కును అందించారు. కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్, నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రంలో ఉన్న సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీని తెలంగాణ స్టేట్ యూనియన్ బ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రధానకార్యదర్శి సమద్ ఖాన్, కె. రవీంద్ర బాబు (ఆస్ట్రేలియా)లు సందర్శించారు. పరిశోధన కేంద్రం, లైబ్రరీ కార్యకలాపాల గురించి పరిశోధన కేంద్రం కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి. విజయలక్ష్మి, కన్వీనర్ కంభంపాటి అజయ్ కుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి జి. రాజగోపాల్ రెడ్డి, కె. జ్యోత్స్నలు వారికి వివరించారు. లైబ్రరీకి మరిన్ని పుస్తకాలు అవసరమని, అందుకు వీలుగా తెలంగాణ స్టేట్ ఎంప్లాయిస్ యూనియన్ రూ.25 వేల చెక్కును అంజేశారని, అదే విధంగా ప్రముఖ అభ్యుదయ రచయిత ఏటుకూరి ప్రసాద్ కూడా పుస్తకాల కోసం రూ.40 వేలు విరాళంగా అందించారని విజయలక్ష్మి తెలిపారు. విరాళం అందజేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.

## రూ.1511 కోట్ల విలువైన
# ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్



### ఆక్రమణలపై నగరం నలువైపులా ఉక్కుపాదం
### ఒకే రోజు నాలుగు భారీ ఆపరేషన్లు
### చెరువులు, పార్కులను కాపాడిన హైడ్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో ఆక్రమణలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) తీవ్రంగా కొరడా ఝులిపించింది. చెరువులు, పార్కులు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంది. మంగళవారం ఒక్కరోజే నగరం నలువైపులా నాలుగు చోట్ల భారీ ఆపరేషన్లు నిర్వహించి ఆక్రమణలను తొలగించిన హైడ్రా, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ.1511 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రెండు ప్రాంతాల్లో మొత్తం 12 ఎకరాల చెరువు భూమిని (కొండాపూర్ జంగం కుంట 4 ఎకరాలు, అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాలు) రక్షించగా, మరో రెండు చోట్ల కలిపి 1100 చదరపు గజాల మేర పార్కు స్థలాలను కాపాడింది.

**కొండాపూర్‌లో జంగం కుంటను కాపాడిన హైడ్రా**

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం, మదీనాగూడ రోడ్ మార్గంలోని కొండాపూర్‌లో ఉన్న జంగం కుంట (4 ఎకరాలు) ఆక్రమణలకు గురవ్వగా, హైడ్రా వెంటనే చర్యలు చేపట్టింది. చెరువును పూడ్చి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నించిన కబ్జాదారులపై ఉక్కుపాదం మోపింది. రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా సంయుక్త తనిఖీలు నిర్వహించి, ఇది జంగం కుంటేనని నిర్ధారించింది. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఈ భూమి విలువ సుమారు రూ.700 కోట్లుగా అంచనగా ఉందని అధికారులు చెప్పారు.


**అల్వాల్ కొత్త చెరువులో 8 ఎకరాల ఆక్రమణల తొలగింపు**

మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో జరిగిన 8 ఎకరాల ఆక్రమణలను హైడ్రా పూర్తిగా తొలగించింది. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలు, తాత్కాలిక షెడ్ల కారణంగా చెరువు తీవ్రంగా కలుషితమవుతోందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా అధికారులు ఆక్రమణలు నిర్ధారించి, ఎఫ్‌టిఎల్ పరిధిలో అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లు, షట్టర్లను తొలగించారు.

**నగరంలో రెండు పార్కులను రక్షించిన హైడ్రా**

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం, సాహెబ్ నగర్ కలాన్ పరిధిలోని జక్కిడినగర్ కాలనీలో 650 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. 1982లో లేఅవుట్‌లో పార్కుగా కేటాయించిన భూమిని తరువాత ప్లాట్లుగా విక్రయించారని స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు చేపట్టింది. అక్రమంగా నిర్మించిన ప్రహరీ, షెడ్లను తొలగించి ఫెన్సింగ్ వేసి, పార్కు స్థలమని సూచించే బోర్డులు ఏర్పాటు చేసింది. అలాగే మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్, రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో జిహెచ్‌ఎంసికి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన 450 చదరపు గజాల పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి విముక్తం చేసింది. అక్కడ నిర్మించిన ప్రహరీ, రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

# వన్యప్రాణి అక్రమ వ్యాపారం భగ్నం
### పులి దంతాలు, గోర్లు స్వాధీనం – ఇద్దరు అరెస్టు



ప్రజాపక్షం/హైదరాబాద్: అక్రమ వన్యప్రాణి వ్యాపారంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) హైదరాబాద్ జోన్ అధికారులు ఉక్కుపాదం మోపారు. నాంపల్లి ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో పులి కేనైన్ దంతాలు 2, పులి గోర్లు 7ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.డిఆర్ఐ అధికారులు కొనుగోలుదారులుగా నటిస్తూ నిందితులను సంప్రదించారు. నాంపల్లి లోని హోటల్ ఏషియన్ ఇంటర్నేషనల్, గది నెం. 305లో లావాదేవీలు జరగనున్నాయన్న సమాచారంతో అక్కడికి చేరుకుని నిందితులను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వన్యప్రాణి అవశేషాలు మరియు నిందితులను తదుపరి చర్యల నిమిత్తం హైదరాబాద్ సెంట్రల్ ఫారెస్ట్ రేంజ్ అధికారికి అప్పగించారు. విచారణలో నిందితులు ఈ వన్యప్రాణి అవశేషాలను కేరళ రాష్ట్రానికి చెందిన జకరియా అనే వ్యక్తి నుంచి పొందినట్లు ఒప్పుకున్నారు. అతడు ఇద్దరు నిందితులకు సన్నిహిత మిత్రుడని తెలిపారు. సోమవారం జిల్లా అటవీ అధికారి నిందితులను విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరు పరచగా, 15 రోజుల న్యాయ రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం కేరళ అటవీ శాఖకు పంపించగా, వన్యప్రాణి అవశేషాల మూలాన్ని గుర్తించేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# అరేపల్లి పరిసరాల్లో పులి కదలికలు
### థర్మల్ డ్రోన్‌లతో 24 గంటల నిఘా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అరేపల్లి గ్రామం పరిసరాల్లో సంచరిస్తున్న పులి కదలికలను తెలంగాణ అటవీ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పులికి కూడా హాని జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పులి కదలికలను గమనించేందుకు థర్మల్ ఇమేజింగ్ డ్రోన్‌లను వినియోగంలోకి తీసుకుని 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్‌ల ద్వారా రియల్ టైమ్‌లో సమాచారం అందుకుంటూ, అవసరమైన చోట వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇదే సమయంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తూ, అటవీ శాఖ సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని గ్రామస్థులకు సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకూడదని, పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. పరిస్థితిని సమర్థంగా నిర్వహించేందుకు పట్రోలింగ్ బృందాలను రంగంలోకి దించడంతో పాటు, పుణే నుంచి వచ్చిన నిపుణుల రెస్క్యూ బృందం కూడా అప్రమత్తంగా ఉంది. పులి సహజంగా అటవీ ప్రాంతం వైపు వెళ్లేలా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అటవీ శాఖ వెల్లడించింది.

# బ్రాడ్‌బ్యాండ్ సేవలతో చివరి గ్రామం అనుసంధానం
### సిఎస్ రామకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బ్రాడ్‌బ్యాండ్ సేవలతో చివరి గ్రామాన్ని కూడా అనుసంధానించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణతెలిపారు. సిఎస్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో 8వ రాష్ట్ర బ్రాడ్‌బ్యాండ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో బ్రాడ్‌బ్యాండ్, టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధి పురోగతిని సమీక్షించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడానికి 15 రోజుల్లో జిల్లా కలెక్టర్లు జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎంఎయుడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

**227 ఆవాసాల్లో రోడ్డు నిర్మాణం**

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన(పిఎంజిఎస్‌వై) నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటిలేని 227 ఆవాసాల్లో రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు తెలిపారు. ఇందుకు సంబంధించి 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పిఎంజిఎస్‌వై 4వ దశ పనుల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ పిఎంజిఎస్‌వై పథకం నాలుగవ దశ భాగంగా రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాల్సిందిగా సూచించారు. 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందనిపంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డిపిఆర్ లను పూర్తి చేస్తామని సిఎస్‌కు వివరించారు.



## నకిలీని అరికట్టాలంటే
# మేలైన విత్తనాల ఉత్పత్తి పెంచాలి
### వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ విత్తనాలను అరికట్టాలంటే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని మేలైన విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతులకు సరఫరా చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి సూచించారు. విత్తనోత్పత్తిని పెంచాలని,అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విత్తనోత్పత్తి క్షేత్రాలపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాలో 8 చోట్ల సీడ్ పార్మ్‌లు ఉన్నాయని, 1629 ఎకరాల్లో ఉన్న సీడ్ ఫార్మ్‌లో వివిధ రకాల విత్తనోత్పత్తి చేస్తున్నట్లు అధికారులు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా వరి, పెసర, జనుము, కందులు విత్తనోత్పత్తి చేస్తున్నామని కమిషన్‌కు వివరించారు.ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ విత్తనోత్పత్తి క్షేత్రాల భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులను ఏర్పాటు చేసి, ఆ చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా భూ సమస్యలు ఉంటే ఆ సమస్యలను వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి దృష్టికి, ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయశాఖకు చెందిన భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ తో పాటు వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ నర్సింగరావు, జాయింట్ డైరెక్టర్ సుచరిత, డిడిఎ నాగమల్లీశ్వరీ, ఎడిఎ ఉషారాణి, సీడ్ ఫార్మ్ కు చెందిన అగ్రికల్చర్ అధికారులు వైద్యనాథ్, సక్రియ నాయక్, ఇంద్రసేన్, అనిల్ కుమార్, వాసు పాల్గొన్నారు.

## 80 శాతం కృష్ణా నీటిని
# ఎపి వాడుకుంటే కేంద్రం ఏంచేస్తుంది?
### తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైన ఎందుకు మాట్లాడటం లేదు?
### కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను నిలదీసిన హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నీటి పారుదల శాఖ కెఆర్‌ఎంబికి రాసిన లేఖ ప్రకారం ఎపి ప్రభుత్వం 664 టిఎంసిల కృష్ణా నీటిని ( 80 శాతం) వాడుకుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నారని బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సం జయ్ మాజీ సిఎం కెసిఆర్‌పైన పడి ఏడవడం తప్ప, నీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం పైన ఎందుకు మాట్లాడడం లేదని, కెఆర్‌ఎంబిని ఎందుకు నిలదీయడం లేదని ఆయన నిలదీశారు. హైద రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మదుసూదనాచారి, ఎంఎల్‌సి దాసోజుశ్రవణ్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ తక్షణమే స్పందించి ఎపి నీటి తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలం నీటిని ఆపి పెట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీస్తే తాము చూస్తూ ఊరుకోబోమని, త్వరలో కెఆర్‌ఎంబి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై కేంద్ర మంత్రిని కలుస్తామని, రాజ్యసభ్యలో కూడా ప్రస్తావిస్తామన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీటిని తరలిస్తుంటే ప్రభుత్వం కండ్లు మూసుకున్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. వేసవి నేపథ్యంలో పంటలకు, పారిశ్రామిక అవసరాలకు నీటి అవసరాలు ఉంటాయని, ఆ అవసరాలను పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఎపి రోజు1.5 టిఎ ంసిల నీటిని తీసుకుపోతుంటే తెలంగాణ పంటలు ఏం కావాలని ప్ర శ్నించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏమిటని, రాష్ట్రంలో సర్కారు నడుపుతున్నారా? లేదా సర్కస్ నడుపుతున్నరా? అని హరీవ్ రావు మండిపడ్డారు. జనవరి 28వ తేదీ నాటికి తాత్కాలిక ఒప్పందం 66:34 నిష్పతిని కూడా దాటి ఇప్పటికే 664 టిఎంసిలను ఎపి వాడుకున్నదని, వెంటనే బోర్డు మీటింగ్‌ను ఏర్పాటు చేసి, ఎపి పాల్పడుతున్న నీటి దోపిడిని ఆపాలని తెలంగాణ నీటిపారుదల శాఖ లేఖ రాసిందని హరీశ్‌రావు వివరించారు.

ఇఎన్‌సి రిటైర్డ్ అయిన వారం రోజుల వరకు ఆ పోస్టులో ఇతరులను నియమించలేదన్నారు. ఇండ్లెంట్లు, బోర్డు అనుమతులు లేవని, ఎపి ఇష్టా రాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతుందని ఆరోపించారు. ఈ ఏడాది కృష్ణా నీటి వాడకం 20 శాతం కూడా దాటలేదని, ముఖ్యమంత్రి వైఫ్యల్యానికి ఇదే నిదర్శన మన్నారు. 664 టిఎంసిలను ఎపి ప్రభుత్వం తీసుకుపోయిందని తెలంగాణ ఇఎన్‌సి చెబుతుంటే, కెఆర్‌ఎంబి మాత్రం 555 టిఎంసిలే తీసుకుపోయిందని ప్రస్తావించిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ చేతిలోనే కెఆర్ ఎంబి ఉన్నదని, తెలంగాణకు అన్యాయం జరిగినప్పటికీ బిజెపి మౌనంగా ఉందన్నారు. ఎపి ప్రభుత్వం అడ్డగోలుగా నీటిని తరలిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని, బిజెపి, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతును పిసుకుతారా? అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# సమ్మెకు టిజెఎస్ మద్దతు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను, చట్టాలను బలహీన పరుస్తూ, కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.కోదండరామ్ అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. కార్మికుల హక్కు లు, ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఈ లేబర్ కోడ్లను తీసుకొచ్చినట్టుగా భావిస్తున్నామని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటంలో తెలంగాణ జన సమితి క్రియాశీలకంగా పాల్గొంటుందన్నారు. దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కీలక రంగాల్లో కార్పొరేట్ ఆధిపత్యాన్ని పెంచే విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ జన సమితి తమ అనుబంధ సంఘాలతో కలిసి నిరంతరం పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.



## జాతీయ సార్వత్రిక సమ్మెకు
# ఆటో, మోటార్ డ్రైవర్స్ యూనియన్ మద్దతు
### తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ వెంకటేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా, దేశ వ్యతిరేక విధానాల అమలును రద్దు చేయాలని, కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మెకు ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జెఎసి పూర్తి మద్దతు తెలుపుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ ఈ సమ్మెలో పాల్గొని రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల నడ్డి విరిచి, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేందుకు, కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు నూతన మోటారు వాహన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. నూతన మోటారు వాహన చట్టం విధానాల ద్వారా చిన్న పాటి ప్రమాదాలకు కూడా డ్రైవర్లకు విధించే శిక్షను అనేక రెట్లు పెంచుతుందని, ఈఎంవి చట్టంలోని లొసుగులను ఆధారంగా చేసుకొని ఆర్టిఎ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వేదిస్తారని, కాబట్టి నూతన వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి కో కన్వీనర్లు పి. యాదగిరి (టిఎన్‌టియుసి), సత్తి రెడ్డి (టిఎడిఎస్), అమానుల్లా ఖాన్ (ఐఎల్‌డబ్ల్యుఎఫ్), ఏం.ఎ. సలీమ్ (తెలంగాణ జాగృతి), ఎఐటియుసి ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, నరసింహ, శ్రీనివాస్, కొంరెల్లి బాబు, ఏం. కృష్ణ, తిరుమలేశా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అభ్యర్థి ఆత్మహత్యను నిరసిస్తూ
# డిజిపి కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ ఎన్నికల వేళ చోటుచేసుకున్న బిజెపి అభ్యర్థి మృతి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. మక్తల్ 6వ వార్డు బిజెపి అభ్యర్థి మహదేవప్ప మృతిపై ఆ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఇది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ నాయకులు చేసిన హత్యేనంటూ ఆరోపిస్తూ బిజెపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు న్యాయం చేయాలంటూ డిజిపి కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన బిజెపి కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య జరిగిన పెనుగులాటలో ఖైరతాబాద్ డిసిపి శిల్పవల్లి ఒక్కసారిగా కిందపడిపోయారు. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఆందోళనకారులను నిలువరించేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని బిజెపి స్పష్టం చేసింది. పలువురు బిజెపి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండా కార్తీక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్, బిజెపి నేతలు రవినాయక్, గణేష్ కుండే, గంధ మల్ల ఆనంద్ గౌడ్, ఉమామహేంద్రలతో పాటు వందకుపైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. తోపులాటలో నలుగురికి గాయాలయ్యాయి.

**ఫిర్యాదు మేరకు కేసు నమోదు: డిజిపి**

బిజెపి అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని డిజిపి శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏమైనా అనుమానాలు ఉంటే, కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి కలిసాయి!
### కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు సర్దుబాట్లు చేసుకున్నాయని కల్వకుంట్ల కవిత ఆరోపణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి కలిశాయని, కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు సర్దుబాట్లు చేసుకున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఒవైసి బ్రదర్స్ పొద్దు తిరుగుడు పువ్వులని, వారు అధికారం ఎక్కడుంటే అక్కడే ఉంటారని ఎద్దేవా చేశారు. గుంపుమేస్త్రీ, గుంటనక్క స్నేహం కారణంగా సిద్ధిపేట్‌కు మాత్రమే పనుల మంజూరు జరుగుతున్నాయని, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ఏ ప్రభుత్వంలోనైనా ఆ గుంటనక్కకే పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ ఓవైసి బ్రదర్స్ అధికారం చుట్టు తిరిగే సన్ ఫ్లవర్స్ లాంటివారని, తెలంగాణ ఉద్యమ సమయంలో వారు రాయల తెలంగాణ అని తెలంగాణను వ్యతిరేకించారన్నారు. ఓల్డ్ సిటీలో అసలు అభివృద్ధే లేదని, ఒవైసి సోదరులు ఓల్డ్ సిటీలో ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తున్నప్పటికీ సిఎం పట్టించుకోవడం లేదని, లేబర్ కోడ్, ఉపాధి హామీ అంశాలపై సిఎం స్పందించాలన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు తాము సంపూర్ణమద్దతునిస్తున్నామని ప్రకటించారు. ఈ నెల 12న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిస్తే, పెద్ద బూతల వర్షం ముగిసినట్టుగా అనిపించిందని,ఈ ఎన్నికల ప్రచారంలో ఎక్కడ కూడా ప్రజల సమస్యలపైన మాట్లాడలేదని ఆరోపించారు. రోడ్లపైన, డ్రైనేజీలు చెత్తతో గుట్టలు గుట్టలుగా పేరుకపోయాయని , వీటిని ఎంఎల్‌ఎలు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యక్తులు పరస్పరం తిట్టడానికే మున్సిపల్ ఎన్నికలు పరిమితమయ్యాయన్నారు. సింహం గుర్తుపైన పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను గెలిపించాలని కవిత విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రెవెన్యూ డిష్‌షిట్ రూ 9 వేల కోట్లుగా ఉందని, సంపద సృష్టి లేదని, అప్పులు మాత్రం 122 శాతం ఎక్కువగా ఉన్నదని, రానున్న బడ్జెట్‌లో బిసి,ఎస్‌సి,ఎస్‌టిలకు నిధులను కేటాయించాలని, 1.89 లక్షల ఉద్యోగాల భర్తీకి బడ్జెట్ లో ప్రొవిజన్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: శంషాబాద్ సర్కిల్-18

టెండర్ నోటీసు

Tender Notice NIT No. 02/EEC-18/SHBD/GHMC/2025-26, తేది: 10.02.2026

**పని పేరు:** 02 పనుల కొరకు, జిహెచ్‌ఎంసి, ఎస్‌హెచ్‌బిడి, శంషాబాద్ సర్కిల్-18, శంషాబాద్ వార్డులోని శంషాబాద్ జోనల్ ఆఫీస్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ ఏరియాలో గదుల నిర్మాణం........ జిహెచ్‌ఎంసి, శంషాబాద్ జోన్ లోని శంషాబాద్ జోనల్ ఆఫీస్ కార్యాలయ నిర్వహణ మరియు మరమ్మతులు. **అంచనా విలువ :** రూ.53.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 18.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్, సర్కిల్-18, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 15183-PP/CL/ADVT/1/2025-26, Date: 10-02-2026

# అభివృద్ధికి నిదర్శనం ప్రజా ప్రభుత్వం



## ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. ప్రజా ప్రభుత్వంలో మేము జవాబుదారీతనంతో పనిచేస్తున్నాం

### ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారికి వసతులు కల్పించడంలో అభివృద్ధికి నిదర్శంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఐటీ, ఇండస్ట్రియల్ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. మంగళవారం ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ, సరూర్ నగర్ కట్ట బిడ్జి, హస్తినాపురంలో ఎల్‌బి నగర్ సర్కిల్ కార్యాలయం భవనం, వనస్థలిపురంలో ఎఫ్‌సిఐ కాలనీలో పలు అభివృద్ధి పనులకు దాదాపు 45 కోట్ల వ్యయంతో టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి, బొగ్గరపు దయానంద్, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కాలనీ మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మేము జవాబుదారితనంతో పనిచేస్తున్నాం, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో బాధ్యతతో పనిచేస్తున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ హాయంలో కార్పొరేటర్లకు అరాకొర నిధులు కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు ఏళ్లల్లో 760 కోట్ల నిధులు ఇవ్వడం జరిగిందని, అభివృద్ధికి నిదర్శంగా నిలిచామని పేర్కొన్నారు. మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ 5 ఏళ్ల పాలనలో ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో కేవలం ఉప్పల్, ఎల్‌బి నగర్‌కు రూ. 400 కోట్లు నిధులతో మాత్రమే అభివృద్ధి చేపట్టగా... కాంగ్రెస్ పార్టీ రెండేళ్ల పాలనలో రూ. 760 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసిన ఘనత తమదన్నారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి ధ్యేయంగా ముందుకెళ్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, లక్ష్మి ప్రసన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఇశ్వరమ్మ, వేముల గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందకు వెళుతోందని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా, ఉప్పల్ సర్కిళ్లలో పర్యటించిన ఆయన జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయ లక్ష్మి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిలతో కల్సి రూ.115.85 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని రంగాలకు, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నారన్నారు. దీంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో అన్ని నియోజకవర్గాల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తూ పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు రజిత పరమేశ్వరరెడ్డి, స్వర్ణరాజ్ శివమణి, బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి తదితర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య జరిగిన స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకొంది. కాప్రా డివిజన్‌లో... సాయిబాబానగర్‌లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సమాధి స్థలాలు, ఎల్లారెడ్డిగూడ సమాధి స్థలం, వంపుగూడ సమాధి స్థలం, అమ్ముగూడ సమాధి స్థలాల్లో మౌలిక పౌర సదుపాయాల కల్పన కార్యక్రమాలు. రూ. 17.80 కోట్ల వ్యయంతో గెలీలియో నగర్ లో క్రీడా మైదానం అభివృద్ధి, వల్వార్‌నగర్, కందిగూడ, ఫుట్‌బాల్ గ్రౌండ్, వివిధ ప్రాంతాల్లో రోడ్లు, వర్షపు నీటి తరలింపు పైపు లైన్ల పనులకు శంకుస్థాపనలు జరిగాయి.

# ప్రత్యేకాధికారి పాలనలో గ్రేటర్ హైదరాబాద్

### ముగిసిన జిహెచ్‌ఎంసి పాలకమండలి పదవీకాలం







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పాలకమండలి పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దీంతో నగర పాలక సంస్థ వ్యవహారాలు ఇకపై ప్రత్యేకాధికారి (స్పెషల్ ఆఫీసర్) ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. కొత్త పాలకమండలి ఎన్నికయ్యే వరకు ఈ ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతుంది. జిహెచ్‌ఎంసిని మూడు కార్పొరేషన్‌లుగా చేయనున్నట్టు జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో, మున్సిపల్ ఎన్నికలు సమీప భవిష్యత్తులో జరగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం పాలక మండలి గడువు ముగిసిన ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఆగస్టు నెలాఖరు వరకు గడువు ఉంది.

**బిజెపికి వరంగా మారిన వరదలు..**

డిసెంబర్ 2020లో జరిగిన జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో ప్రస్తుత పాలకమండలి ఎన్నికైంది. ఆ ఎన్నికలు అక్టోబర్ 2020లో సంభవించిన వరదలు నగరాన్ని ముంచేత్తాయి. అప్పట్లో అధికార పార్టీపై నెలకొన్న అసంతృప్తి కారణంగా బిజెపి సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. బిజెపి మొత్తం 48 సీట్లు గెలుచుకోగా, గత పాలకమండలితో పోలిస్తే 44 సీట్లు అధికంగా సాధించింది. అదే సమయంలో అధికార బిఆర్‌ఎస్ 43 సీట్లు కోల్పోయింది. అయితే, ఈ ఐదేళ్ల పాలనలో జిహెచ్‌ఎంసి కౌన్సిల్ పౌర సమస్యలపై చర్చలకు చాలా తక్కువ సమయమే కేటాయించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసరంగా చర్చించాల్సిన అనేక కీలక అంశాలు సభలో ప్రస్తావనకు రాకుండానే మిగిలిపోయాయి. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన పలువురు సమావేశాలు ప్రతిపక్షాల ఆందోళనలు, పరస్పర ఆరోపణలు, స్వల్ప అంశాలపై గొడవల కారణంగా అర్ధాంతరంగా వాయిదా పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఒక సందర్భంలో ప్రజాప్రతినిధుల నుంచి అవమానానికి గురయ్యామంటూ అధికారులు వాకౌట్ చేయడంతో సభ వాయిదా పడటం తీవ్ర చర్చనీయాంశమైంది.

**అంద్రస్‌లేని వార్డు కమిటీలు, ఏరియా సభలు..**

స్థానిక స్వయంపాలన సంస్థగా ఉన్నప్పటికీ, కొద్దిమందిని మినహాయిస్తే ఎక్కువ మంది కార్పొరేటర్లు ప్రజల తరఫున మాట్లాడటం కంటే తమ తమ రాజకీయ పార్టీలకు, నాయకులకు మద్దతుగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. నగర శివారు స్థానిక మున్సిపల్ సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలన్న నిర్ణయంపై కూడా కౌన్సిల్ ప్రశ్నించలేకపోయింది. ఈ నిర్ణయంలో మేయర్‌ను సైతం సంప్రదించలేదన్న విమర్శలు వ్యక్తం అయ్యాయి. స్థానిక స్వయంపాలన స్ఫూర్తికి ప్రతీకలైన వార్డు కమిటీలు, ఏరియా సభలు ఐదేళ్ల కాలంలో ఎక్కడా ఏర్పాటు కాలేదు. ప్రతి వార్డులో కార్పొరేటర్ అధ్యక్షతన ఏర్పాటు చేయాల్సిన వార్డు కమిటీలు స్థానిక సమస్యలను గుర్తించి కౌన్సిల్ ముందు ఉంచాల్సి ఉండగా, ఈ వ్యవస్థను పూర్తిగా విస్మరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ అంశాన్ని కౌన్సిల్ సభ్యులు సభలో లేవనెత్తకపోవడం గమనార్హం.

**కో-ఆప్షన్ సభ్యులు లేకుండానే..**

సాధారణంగా పాలకమండలి ఎన్నికైన అనంతరం సభలో ఐదు మంది నామినేటెడ్ సభ్యులను ఎన్నుకుంటారు. వీరిని కోఆప్షన్ సభ్యులుగా పరిగణిస్తారు. ఎప్పుడు లేనివిధంగా ఈ దఫా కోఆప్షన్ సభ్యులను ఎన్నుకోలేదు. సాధారణంగా అధికార పార్టీకి చెందిన సభ్యులను సభలో ఎన్నుకుంటారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ అంశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చెపట్టాక కూడా కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను సైతం పట్టించుకోలేదు. దీంతో ఈసారి కోఆప్షన్ సభ్యులు లేకుండానే పాలకమండలి పాలన ముగిసింది.

**అన్ని రంగాల్లో చిరస్మరణీయ ముద్ర : మేయర్, డిప్యూటి మేయర్**

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి నేతృత్వంలోని పాలకమండలి మౌలిక వసతుల అభివృద్ధి, వరద నివారణ చర్యలు, సామాజిక, మహిళా సాధికారత, జీవ వైవిధ్య సంరక్షణ వంటి రంగాల్లో 'చిరస్మరణీయ ముద్ర' వేసిందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో జిహెచ్‌ఎంసి పేర్కొంది. గత ఐదేళ్లలో మొత్తం 23,287 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ఇందుకు రూ.5,117 కోట్లు వ్యయం చేసినట్టు జిహెచ్‌ఎంసి వెల్లడించింది. వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, జంక్షన్ అభివృద్ధి పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, విస్తృత స్థాయి అటవీ అభివృద్ధి, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు తదితరాలను పాలకమండలి ప్రధాన విజయాలుగా పేర్కొంది. మొత్తంగా, జిహెచ్‌ఎంసి పాలకమండలి ఐదేళ్ల పాలనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ, ఇకపై ప్రత్యేకాధికారి పాలన నగర పాలనను ఏ మేరకు ముందుకు తీసుకెళ్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## అక్రిడిటేషన్ జిఒపై స్టేకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ విధానాన్ని నిర్ణయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ అమలును నిలిపివేస్తూ స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ జిఎడి ముఖ్యకార్యదర్శి, సమాచార శాఖ కమిషనర్, మీడియా అకాడమి చైర్మన్లకు ఉత్తర్వులు జారీ చేసింది. అక్రిడిటేషన్ పొందే అర్హతలను నిర్ణయిస్తూ ప్రభుత్వ జిఒ 22ను కొట్టేయాలంటూ హైటెక్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ పిటిషన్ వేసింది. తీర్పు ఇచ్చేలోగా జిఒ అమలును నిలిపివేయాలని పిటిషనర్ లాయర్ వాదనను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ తిరస్కరించింది. కేబుల్ ఛానల్స్, డిజిటల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల నిబంధనల జిఒ తీవ్ర నష్టం కలిగిస్తోంది. వివక్షపూరితంగా ఉంది. రాజ్యాంగ కల్పించిన హక్కులను భంగం కలిగిస్తోంది. ఇప్పటికే అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. కాబట్టి జిఒ అమలును నిలిపివేస్తూ స్టే ఆదేశాలు ఇవ్వాలి.. అని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ప్రభుత్వ వాదనలు విన్నాకే స్టే అభ్యర్థనపై నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. విచారణను మార్చి 12కు వాయిదా వేసింది.

## బార్ కౌన్సిల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు గత నెల 30 జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం మొదలైంది. ఉదయం లెక్కింపు ప్రారంభించగా సాయంత్రానికి 500 ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. బాక్స్–1లో 262, బాక్స్–2లో 236.. మొత్తం 498 ఓట్లు ఉండగా వాటిలో 294 ఓట్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయి. మిగిలిన సుమారు 40 శాతం అంటే 204 ఓట్లు చెల్లలేదు. 23 మంది సభ్యుల పదవుల్లో ఐదుగురు మహిళలు ఉంటారు. పోటీ పడిన లాయర్లు 203 మందిలో 55 మంది మహిళా న్యాయవాదులు ఉన్నారు.

## కౌంటర్ వేయకపోతే జరిమానా చెల్లించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు మరోసారి నోటీసులు ఇచ్చింది. ఈసారి 2 వారాల్లో కౌంటర్ దాఖలు చేయకపోతే రూ.5 వేలను స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఏకే సింగ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశాలిచ్చింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ణయించాలని, చెరువుల రక్షణకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పలు పిటిషన్లల్లో ప్రభుత్వం కౌంటర్ వేశాక పిటిషనర్లు రిప్లై కౌంటర్లు దాఖలు చేయాలంది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. మల్కం చెరువు, కింది కుంట,అమీన్‌పూర్ చెరువు, చిన్నచెరువు ఇతర చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలపై కౌంటర్లు వేసేందుకు సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో హైకోర్టు పైవిధంగా ఆదేశాలను జారీ చేసింది.

## బంగ్లాదేశ్, రోహింగ్యాలను తరలించండి

### హైకోర్టులో పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉన్న రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను తరలింపునకు పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జస్టిస్ ఈవీ వేణుగోపాల్ మంగళవారం ఆదేశాలను జారీ చేశారు. ఆదేశించింది. విచారణను మార్చి 3కి వాయిదా వేశారు. కరుణసాగర్ వేసిన పిటిషన్‌లో వాళ్లంతా ఓటర్, రేషన్, ఆధార్ కార్డులు కూడా పొందారని, దేశ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. బాలాపూర్‌లో 7 వేల మందికి పైగా ఉన్నట్లుగా ప్రభుత్వమే కోర్టుకు చెప్పిందన్నారు. విచారణ మార్చి 3కి వాయిదా పడింది.

## ట్రాఫికింగ్‌పై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యభిచార కూపంలో ఉన్న వాళ్లు పట్టుబడిన వాళ్లను హోమ్స్‌కు తరలింపు విషయంలో పాటించాల్సిన గైడ్‌లైన్స్ రూపొందించాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ప్రజ్వల అనే స్వచ్ఛంద సంస్థ సూచనలను కూడా పరిశీలించాలంది. అక్రమ లైంగిక కార్యకలాపాల్లో పట్టుబడిన బాధితుల తరలింపులో పాటించే విధానాలను ప్రజ్వల సంస్థ ప్రశ్నిస్తూ వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. బాధితులను, నిర్వాహకులను ఒక హోంలో ఉంచడం అన్యాయమని పిటిషనర్ వాదన.

## మంత్రి పొన్నంపై ఎన్నికల కమిషనర్‌కు బిజెపి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బిజెపి లీగల్ సెల్ పేర్కొంది. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రెస్ మీట్ నిర్వహించి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, బిజెపిని ఓడించాలని బహిరంగంగా విజ్ఞప్తి చేశారని ఆరోపించింది. మంత్రి చర్యలు తెలంగాణ మున్సిపాలిటీల చట్టం సెక్షన్ 209(1)(బి) కిందకు వస్తాయని, అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేయడం చట్టవిరుద్ధమని బిజెపి లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ గోకుల్ రామారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగానికి సంబంధించిన వీడియో దృశ్యాలను (పెన్ డ్రైవ్ రూపంలో) ఎన్నికల కమిషన్‌కు ఆధారాలుగా సమర్పించారు. ఈ ఉల్లంఘనపై తక్షణమే విచారణ జరిపి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## కాంగ్రెస్ వేధింపుల వల్లే బిజెపి అభ్యర్థి ఆత్మహత్య

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు రాంచందర్ రావు ఫిర్యాదు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు బిజెపి అభ్యర్థి ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ నాయకుల బెదిరింపులే కారణమని ఆరోపిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి ఫిర్యాదు చేశారు. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ మక్తల్‌లో బిజెపి అభ్యర్థి మహాదేవప్పను ఒక రాష్ట్ర మంత్రి, స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్రంగా బెదిరించారన్నారు. ఎన్నికల్లో గెలిచినా బతకనివ్వబోమంటూ హెచ్చరించడంతో, భయపడి ఆయన ఆత్మహత్య చేసుకున్నారని రామచందర్ రావు ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. మహాదేవప్ప కుమార్తె షాక్‌లో ఉన్న సమయంలో, పోలీసులు తమకు కావాల్సిన సమాచారాన్ని ఒక తెల్లకాగితంపై ఆమెతో బలవంతంగా రాయించుకుని, కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని మార్చి, సెక్షన్ 194 బిఎన్‌ఎస్‌ఎస్ కింద కేసు నమోదు చేసి నిజాన్ని అణచివేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. రామగుండం వార్డు నెంబర్ .1లో బిజెపి అభ్యర్థిని బలవంతంగా ఉపసంహరించుకునేలా చేశారని, మంచిర్యాలలోనూ బిజెపి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఎస్ఈసి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు తదితరులు ఉన్నారు.



కెఎల్‌బి నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్, బాలుర 'కయొరుగి' విభాగంలో స్వర్ణం, స్పీడ్ పంచ్ విభాగంలో రజత పతకం కైవసం చేసుకున్న నందిగామ శ్రీప్రణవ్. చిత్రంలో అభ్యాస అకాడెమీ కోచ్ సుభాశ్ అల్లం తదితరులు ఉన్నారు.

## నర్సింగ్‌రావు మరణం కార్మికవర్గానికి తీరని లోటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు, ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన పి.నర్సింగ్ రావు రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ ఫిబ్రవరి 9న అర్ధరాత్రి ఆసుపత్రిలో మరణించాడని తెలిసి, ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, నర్సింగ్ రావు మరణానికి సంతాపం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతిని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యునిగా, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీసు బేరర్‌గా చురుకైన పాత్ర పోషిస్తూ, మున్సిపల్ ఉద్యోగులకు, ఎంతో సేవాభావంతో పనిచేశారని, ఎఐటియుసి అన్ని కార్యక్రమాలలో ప్రధాన పాత్ర పోషించడాని, నిజామాబాద్ జిల్లాలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల నిర్మాణంలో అగ్రభాగాన నిలిచాడని ఆయన కొనియాడారు. నర్సింగ్‌రావు నిజమాబాద్ మున్సిపల్‌లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తర్వాత రాష్ట్ర మున్సిపల్ శాఖ వారు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా కాలయాపన చేయడంతో మనస్థాపానికి గురై రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రాణాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతూ మానసిక వేదనతో వేదనకు గురయ్యాడని తెలిపారు. నర్సింగ్‌రావు లాగా మున్సిపల్ కార్యాలయాలలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన వారందరికి బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు.



## సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొనండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆటో, వ్యాన్లు డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని, మంగళవారం అబిడ్స్ స్కూల్ వద్ద ఆటో జెఎసి నాయకులు బి.వెంకటేశం ఎ.సత్తిరెడ్డి, ఎంఎ.సలీం, దయానంద్, బిక్షపతి తదితర సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ నోటీసు సం. DRM/Works/BZA/06/2026 తేది: 09.02.2026 PUB/1911

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున, క్రింద సంతకం చేసిన వ్యక్తి మధ్యాహ్నం 03-00 గంటల వరకు మరియు ప్రతిదానిపై పేర్కొన్న తేదీ వరకు ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తాడు.

క్ర.సం.: 01 టెండర్ నం.: E-05-బ్రిడ్జెస్- BZA-2026 పని పేరు: BZA-OGL విభాగం:- Br.No: 612 Up (10x10.28) @ KM కోసం రీగిర్డరింగ్ పని ద్వారా వంతెనల పునరుద్ధరణ ప్రతిపాదిత: BPP-SPF స్టేషన్ల మధ్య 350/13-03. టెండర్ విలువ (రూ.): 4,72,53,623/- EMD (రూ.): 3,86,300/- పూర్తయిన కాలం: 14 (పద్నాలుగు నెలలు) ముగింపు తేదీ: 06.03.2026

క్ర.సం.: 02 టెండర్ నం.: E-06-వంతెనలు-BZA-2026 పని పేరు: BZA విభాగం: ADEN/Br/S/BZA అధికార పరిధిలోని SSE/Br/NLR/BZA విభాగంలో GDR-BZA విభాగంలో SKM-TNR స్టేషన్ల మధ్య Km. 267/21-25 వద్ద Br.No. 530 UP (3x18.29m) మరియు Km. 267/22-26 వద్ద 530 DN (3x18.29m) వద్ద Br.No. 530 UP (3x18.29m) కాలం చెల్లినవాటి స్థానంలో కొత్త కాంపోజిట్ గర్డర్లతో గిర్డర్లను ఏర్పాటు చేయడం టెండర్ విలువ (రూ.): 5,76,49,916/- EMD (రూ.): 4,38,300/- పూర్తయిన వ్యవధి: 14 (పద్నాలుగు నెలలు) ముగింపు తేదీ: 06.03.2026.

క్ర.సం.: 03 టెండర్ నం.: E-07-వంతెనలు-BZA-2026 పని పేరు: BZA-OGL విభాగం-OGL-KRV స్టేషన్ల మధ్య Km.291/31-35 వద్ద Br.No.586 UP (7x12.19) మరియు K.m. 295/21-29 వద్ద 589 UP (13x12.19) కోసం రీగిర్డరింగ్ ద్వారా వంతెనల పునరుద్ధరణ ప్రతిపాదిత. టెండర్ విలువ (రూ.): 7,22,44,259/- EMD (రూ.): 5,11,200/- పూర్తయిన వ్యవధి: 14 (పద్నాలుగు నెలలు) ముగింపు తేదీ: 06.03.2026

1. టెండర్ నిబంధనలు / పూర్తిగా పని పేరు వివరాలు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైన వివరాలు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2. టెండర్ గడువు తేదీకి ముందు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌ను సందర్శించి ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / సవరణలను గమనించాలని భావి టెండరుదారులకు సూచించబడింది.
3. టెండర్ నోటీసు విజయవాడ డివిజన్లోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), S.C. రైల్వే, విజయవాడ మరియు ADEN సబ్-డివిజనల్ కార్యాలయాలలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడుతుంది, దీనిని చూడవచ్చు.
4. ఎటువంటి కారణం చూపకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ

ఇ-టెండర్ నోటీసు నెం.03-2026 తేదీ: 09-02-2026 PUB/1912

భారత రాష్ట్రపతి తరపున మరియు ఆయన తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఇంజనీర్/కోఆర్డినేషన్ / గుంతకల్ ఈ క్రింది పనులకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

ముగింపు తేదీ & సమయం: 09/03/2026 మధ్యాహ్నం 03:00 గంటలకు

క్ర.సం.: 01 టెండర్ నెం.: ఇంజనీరింగ్-GTL-సెంట్రల్-2021 పని వివరణ: SW I: గుంతకల్ డివిజన్ ధోన్ బలాస్ట్‌లెస్ ట్రాక్ (రోడ్ నెం.1) వేయడానికి ప్రతిపాదించబడింది. SW II: గుంతకల్ డివిజన్ - ధోన్ బలాస్ట్‌లెస్ ట్రాక్ (రోడ్ నెం.4) వేయడానికి ప్రతిపాదించబడింది. SW III: గుంతకల్ డివిజన్ ధోన్ GTL (రోడ్ నెం.5) వద్ద బలాస్ట్‌లెస్ ట్రాక్ వేయడానికి ప్రతిపాదించబడింది (రూ.)లో ప్రకటించిన విలువ: 16,44,85,179.49 పైసలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.): 9,72,400.00 పైసలు

క్ర.సం.: 02 టెండర్ నెం: Engg-GTL- నార్త్-2022 పని వివరణ: GY- WD & BAY-GTL విభాగం (UP/DN):- ADEN/నార్త్ పరిధిలోని AD & RC సబ్ డివిజన్ల కింద మైక్రో ఫ్లో మెటల్ స్ప్రే పౌడర్ బ్రాండ్ నేమ్ CP- 3032 ద్వారా వీల్ బర్న్స్ / స్కాబ్స్ రీకండిషనింగ్ మరియు కప్ వెల్డెడ్ జాయింట్ల రీకండిషనింగ్ ప్రతిపాదించబడింది. (రూ.)లో ప్రకటించబడిన విలువ: 67,54,565.66 పైసలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.): 1,35,100.00 పైసలు

క్ర.సం.: 03 టెండర్ నెం: Engg-GTL-సౌత్-2023 పని వివరణ: 2025- 26 సంవత్సరంలో సీనియర్ డెన్/సౌత్/జీటిఎల్ పరిధిలోని రోడ్ అండర్ బ్రిడ్జిలలో ప్రతిపాదిత డీవాటరింగ్. (రూ.)లో ప్రకటించబడిన విలువ: 89,68,180.00 పైసలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ.)లో: 1,79,400.00 పైసలు.

క్ర.సం.: 04 టెండర్ నెం: Engg-GTL-Coord-2024 పని వివరణ: SW I: గుంతకల్: అరవింద్ నగర్‌లోని సిబ్బంది క్వార్టర్ నంబర్ 374 నుండి 416 వరకు కాంపౌండ్ వాల్స్ మరియు కోర్ట్ యార్డ్ ఫ్లోరింగ్ మరియు లోపల & వెలుపల ప్లాస్టరింగ్, సేఫ్టీ గ్రిల్స్ మొదలైన మరమ్మతులు. SW II: గుంతకల్: గుంతకల్లోని రైల్వే హాస్పిటల్లో ద్విచక్ర వాహన పార్కింగ్కు మరమ్మతులు. SW III: గుంతకల్: GTL- సౌత్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్, ఓపెన్ డ్రైనేజీ మరియు ఇంటి కనెక్షన్లు వంటి exg. డ్రైనేజీల వ్యవస్థకు మరమ్మతులు. SW IV: గుంతకల్: అరవింద్ నగర్‌లో లోపల & వెలుపల ప్లాస్టరింగ్, AC పైకప్పును మార్చడం, అరవింద్ నగర్‌లో టాయిలెట్లను రీమోల్డింగ్ చేయడం, శానిటరీ ఫిట్టింగ్‌లు మొదలైన పనులు చేయడం. ADEN/SW/GTL సబ్-డివిజన్‌లో. (రూ.)లో ప్రకటించబడిన విలువ: 2,96,30,786.84 పైసలు, ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రూ)లో: 2,98,200.00 పైసలు.

ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్/ గుంతకల్

టెండర్ నోటీసు నం. 16 నుండి 17 వరకు DRM_W_HYB_26 తేదీ: 09/02/2026 PUB/1916

భారత రాష్ట్రపతి తరపున, డివిజనల్ రైల్వే మేనేజర్ / వర్క్స్, హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ 06/03/2026 సాయంత్రం 3 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం.: 16_DRM_W_HYB_26 పని పేరు: హైదరాబాద్ డివిజన్ SC-MUE విభాగంలోని వివిధ స్టేషన్లలో PF ఉపరితలానికి మరమ్మతులు సుమారు విలువ (రూ.): 61,09,671 EMD (రూ.): 1,22,200

టెండర్ నం.: 17_DRM_W_HYB_26 పని పేరు: SC-MUE (SC- BKU విభాగం): ADEN/MED సబ్ డివిజన్ విభాగం కింద యార్డుల మెరుగుదల మరియు అప్‌గ్రేడేషన్ పనులు సుమారు విలువ (రూ.): 5,96,37,106 EMD (రూ.): 4,48,200

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి

డివిజనల్ రైల్వే మేనేజర్/ వర్క్స్/హైదరాబాద్

A2422

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

# అధికార, విపక్షాల మధ్య తొలగిన ప్రతిష్టంభన

### లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభం



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు మంగళవారం మధ్యాహ్నం తెరపడింది. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని వివిధ అంశాలపై మాట్లాడేందుకు అనుమతించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో గత నాలుగైదు రోజులుగా సభ కార్యకలాపాలు కొనసాగలేదు. కాగా, మంగళవారం మధ్యాహ్నానికి రెండుమార్లు సభ వాయిదా పడిన తరువాత తిరిగి 2 గంటలకు ప్రారంభం కాగానే స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ టెన్నేటి కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్‌ను చర్చను ప్రారంభించమని కోరారు. తిరువనంతపురం ఎంపి చర్చ ప్రారంభించారు. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్‌గా తొలగించాలని ప్రతిపక్ష పార్టీలు ఒక తీర్మానాన్ని తీసుకురావాలని నోటీసు సమర్పించిన వెంటనే ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈనెల 2వ తేదీ నుంచి లోక్‌సభలో అల్లకల్లోల దృశ్యాలు, పదేపదే అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ఏడుగురు కాంగ్రెస్ సభ్యులు, ఒక సిపిఐ(ఎం) సభ్యుడు మిగిలిన బడ్జెట్ సమావేశాల వరకు సస్పెన్షన్‌కు గురయ్యారు. అయితే అసహ్యకరమైన దృశ్యాలు తలెత్తాయని భావించిన బిర్లా, గత వారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానం ఇవ్వాల్సి ఉండగా ప్రధాని నరేంద్ర మోదీ సభకు హాజరు కావద్దని అభ్యర్థించారు. కాంగ్రెస్ సభ్యులు అసహ్యకరమైన దృశ్యాలను సృష్టించగలరని బిర్లా చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన మరింత తీవ్రతరం అయింది. ఇదిలా ఉండగా, మంగళవారం ఉదయం సభ సమావేశం కాగనే ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ తమను మాట్లాడనీయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)కి చెందిన ఇక్రా చౌదరి ప్రశ్న అడిగారు, కానీ సంబంధిత మంత్రి సమాధానం గందరగోళంలో కొట్టుకుపోయింది. కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభలో గందరగోళం నెలకొంది. ఎస్‌పి, తృణమూల్ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష ఎంపిలు తమ సీట్ల వద్ద నిలబడి నిరసన తెలిపారు. స్పీకర్ స్థానంలో ఉన్న మోహన్ మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. అయితే సాధారణంగా, ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా సభ కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తారు. మొదటి వాయిదా తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే, ప్రతిపక్షాల నినాదాల మధ్య మంత్రులు, సభ్యులు పత్రాలు మరియు స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రవేశపెట్టారు. కార్యక్రమాలకు అధ్యక్షత వహిస్తున్న పి.సి. మోహన్, ప్రతిపక్ష సభ్యులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు, కానీ ఫలించలేదు. ఇతర ప్రతిపక్ష ఎంపిలు మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, బడ్జెట్ పై చర్చను ప్రారంభించడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజియు అన్నారు. కేంద్ర బడ్జెట్ పై చర్చ ప్రారంభమయ్యే ముందు కొన్ని అంశాలను లేవనెత్తాలని కోరుతూ ప్రతిపక్ష సభ్యులు నిరసనలు తీవ్రతరం చేయడంతో మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

# ఆ పుస్తకం అందుబాటులోనే ఉంది

- నరవణే డిసెంబర్ 2023 సోషల్ మీడియా పోస్ట్‌ను ఉటంకిస్తూ
- రాహుల్‌గాంధీ వ్యాఖ్య
- మీడియా ముందు చదివి వినిపించిన ప్రతిపక్షనేత



**న్యూఢిల్లీ :** ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణే 'జ్ఞాపకాల పుస్తకం' అందుబాటులో ఉందని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. నరవణే డిసెంబర్ 2023 సోషల్ మీడియా పోస్ట్‌ను ఉటంకిస్తూ ఈ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని ప్రచురణకర్త పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చేసిన ప్రకటనను ఖండించారు. పెంగ్విన్ గురించి మాజీ ఆర్మీ చీఫ్ మాటను తాను నమ్ముతున్నాన న్నారు. మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'హలో ఫ్రెండ్స్. నా పుస్తకం ఇప్పుడు అందుబాటులో ఉంది. లింక్‌ను అనుసరించండి. సంతోషంగా చదవండి. జై హింద్' అని నరవణే సోషల్ మీడియా పోస్ట్‌ను చదివారు. 'ఇప్పుడు ఇద్దరూ నిజం చెబుతున్నారని అనుకోవడం సాధ్యం కాదు. నరవణె కానీ, పెంగ్విన్ ఇండియా కానీ ఇద్దరిలో ఒకరు అబద్ధం చెప్పి ఉండాలి. పెంగ్విన్ సంస్థ పుస్తకం ప్రచురించలేదంటోంది. కానీ ఆ పుస్తకం అమెజాన్‌లో అందుబాటులో ఉంది. 2023లో నరవణే నా పుస్తకం కొనండి అని ట్వీట్ చేశారు. నేను పెంగ్విన్ కంటే నరవణె మాటలనే నమ్ముతా. ఆయన పుస్తకంలో ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి అసౌకర్యంగా ఉండే అంశాలు ఉండవచ్చని అనుకుంటున్నా. పెంగ్విన్ కానీ, మాజీ ఆర్మీ చీఫ్ కానీ ఇద్దరి ఎవరు నిజం చెబుతున్నారనే విషయాన్ని ప్రజలే నిర్ణయించుకోవాలి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసన సందర్భంగా పార్లమెంటు మకర్ ద్వారం వద్ద 'నరేంద్ర లొంగుబాటు' అని రాసి ఉన్న పోస్టర్‌ను చూపిస్తూ, ఇది జరిగిందని, దీని కారణంగా ఇండో–యుఎస్ వాణిజ్య ఒప్పందం జరిగిందని గాంధీ అన్నారు. పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా (పిఆర్‌హెచ్‌ఐ) మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే జ్ఞాపకాల పుస్తకం ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీకి ప్రత్యేక ప్రచురణ హక్కులను కలిగి ఉందని పేర్కొంది. అనధికార కాపీలు చెలామణిలో ఉన్నాయనే నివేదికల నేపథ్యంలో ఆ పుస్తకం ఇంకా ప్రచురించబడలేదని స్పష్టం చేసింది. డిజిటల్, ఇతర ఫార్మాట్లలో మాన్యుస్క్రిప్ట్ అక్రమ ప్రసరణపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత ఈ స్పష్టత వచ్చింది. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో, పుస్తకం ఏ కాపీలు ప్రింట్ లేదా డిజిటల్ రూపంలో ప్రజలకు విడుదల చేయలేదని ప్రచురణ సంస్థ స్పష్టం చేసింది.

# జాతీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు

- ఇండో-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ :** ఇండోఅమెరికా మధ్యంతర జాతీయ వాణిజ్య ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక వాణిజ్య ప్రయోజనాలను త్యాగం చేస్తున్నదని, మోదీ ప్రభుత్వ ద్రోహాన్ని అది బట్టబయలు చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని కాంగ్రెస్ చీఫ్ 'ట్రాప్డ్ సరెండర్' గా ఆరోపిస్తూ మంగళవారం తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందం ఫైన్ ప్రింట్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ జాతీయ ప్రయోజనాలను ఏవిధంగా తాకట్టు పెడుతున్నారనే విషయాన్ని బహిర్గతం చేస్తున్నదని ఆయన విమర్శించారు. ట్రాప్ డీల్ నిజం ఇప్పుడిప్పుడే బయటపడుతున్నదని, ఈ ఒప్పందానికి నాలుగు కీలక అభ్యంతరాలను మోదీ జత చేశారు. రష్యా చమురు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అంశాన్ని ఉటంకిస్తూ మోదీ మాట్లాడారు. ఇండోయుఎస్ ఉమ్మడి ప్రకటన రష్యన్ చమురుపై ఏమీ చెప్పలేదని మాకు చెప్పారు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ చేశారు. ఇప్పుడు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా 'రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలు చేయడానికి భారతదేశం నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసింది'. భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించింది. ఎందుకు? అని ఖర్గే ప్రశ్నించారు. ప్రత్యక్ష లేదా పరోక్ష చమురు దిగుమతి కోసం భారతదేశాన్ని అమెరికా పర్యవేక్షణలో ఉంచే కార్యనిర్వాహక ఆదేశాన్ని కాంగ్రెస్ ఇప్పటికే బయటపెట్టిందని చెప్పారు. 'భారతదేశ రైతులను వెన్నుపోటు పొడవడమే ఈ చర్య' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా ఒక ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా విదేశీ వస్తువులకు పూర్తిగా తెరిచిఉంచిందని ఆయన ధ్వజమెత్తారు. 'భారతదేశానికి ఎర్ర జొన్నల దిగుమతుల ప్రయోజనం గురించి ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావించబడింది. కానీ పశుగ్రాసానికి సంబంధించిన ఆ ప్రయోజనం ఇప్పుడు 2026 ఫిబ్రవరి 9నాటి వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో చాలా రహస్యంగా అదృశ్యం అయ్యింది' అని ఖర్గే తెలిపారు. కేంద్రప్రభుత్వం గోమాత, పాడి ఆవులను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. భారతీయ పశువులు జన్యుపరంగా మార్పుచేయబడిన అమెరికన్ ఫీడ్‌ను తీసుకుంటే , అది మన పశువుల జాతిని, పాలను మారుస్తుందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, బిజెపి చేస్తున్న ఈ కుతంత్రాల మూలంగా 2 కోట్ల మంది పాడి రైతులు దాని పర్యవసానాలను అనుభవిస్తారని మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇండో అమెరికా మధ్యంతర జాతీయ ఒప్పందం దుస్తుల రంగాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. తిరుపూర్, సూరత్ వంటి వస్త్ర కేంద్రాలు 18శాతం పన్నులతో సంకెళ్లతో బందీ చేయగా, బంగ్లాదేశ్ సున్నాశాతం వేగంతో పెరుగుతోందన్నారు. భారతీయ పత్తి, గార్మెంట్స్ రంగాలకు రెండింతల నిరాశను ఈ ఒప్పందం మిగులుస్తోందన్నారు.

### రాబోయే వారాల్లో భారత్–అమెరికా

# మధ్యంతర ఒప్పందం ఖరారు



**న్యూయార్క్/వాషింగ్టన్:** రాబోయే వారాల్లో భారత్–అమెరికా దేశాలు తాత్కాలిక (మధ్యంతర) వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేస్తాయని వైట్‌హౌస్ మంగళవారం ప్రకటించింది. ఇరు దేశాలకూ పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేసే ఉద్దేశంతో త్వరలో ఈ మధ్యంతర ఒప్పందాన్ని ఖరారు చేస్తారు. సేవలు, పెట్టుబడి, శ్రమ, ప్రభుత్వ సేకరణలు వంటివి సహా ఇంకా మిగిలి ఉన్న సమస్యలను కూడా పరిష్కరించుకునేందుకు రెండు దేశాలు సంప్రదింపులను కొనసాగిస్తాయి. తాత్కాలిక ఒప్పందంపై ఒక సంయుక్త ప్రకటన చేసిన కొద్దిరోజులకు భారత్–అమెరికా మధ్య చరిత్రాత్మకమైన మధ్యంతర ఒప్పంద ప్రకటన గురించి వైట్‌హౌస్ ఒక వాస్తవ పత్రాన్ని విడుదల చేసింది. ఈ పత్రంలో ఇటీవలి ఒప్పందానికి సంబంధించిన కీలకమైన నిబంధనలను వెల్లడించింది. అమెరికాకు చెందిన అన్ని పారిశ్రామిక వస్తువులతోపాటు ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై విస్తారమైన స్థాయిలో టారిఫ్‌లను తొలగించడం లేదా తగ్గించేందుకు భారత్ చర్యలు తీసుకుంటుందని ఈ పత్రం వెల్లడించింది. అమెరికాలో ఉత్పత్తయిన డ్రై ఫ్రూట్స్, శుద్ధిచేసిన పండ్లు, కొన్ని ధాన్యాలు, సోయాబీన్ ఆయిల్, వైన్, స్పిరిట్, ఇతర అదనపు ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉందని వైట్‌హౌస్ పత్రం తెలియజేసింది. అదే విధంగా 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులను కూడా భారత్ కొనుగోలు చేస్తుందని, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు, ఇతర ఉత్పత్తులు ఈ జాబితాలో ఉంటాయని తెలిపింది. అమెరికా ప్రజల ప్రయోజనాలు ముందుకు తీసుకువెళ్ళేందుకు, జాతీయ, ఆర్థిక భద్రత నిమిత్తం ఇతర మార్కెట్‌లను అందుబాటులోకి తెచ్చే చర్యల్లో భాగంగా అమెరికా ఎగుమతులను ట్రంప్ పెంపొందిస్తున్నారని ప్రకటన పేర్కొంది. "ప్రపంచంలో ఏ ఇతర పెద్ద ఆర్థికవ్యవస్థ కూడా విధించనంత ఎక్కువగా భారతదేశం అమెరికాపై అత్యధిక సుంకాలను విధించింది, సగటున ఈ సుంకాలు వ్యవసాయ వస్తువులపై 100 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి, కొన్ని ఆటోలపై కూడా. తన దేశీయ ఉత్పత్తులకు రక్షణలకోసం ఆటంకాలు లేకుండా అత్యధికమైన సుంకాలు విధించిన చరిత్ర కూడా భారత్‌కు ఉంది, ఈ దిశగా అనేక అమెరికా ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి కాకుండా నిషేధించిన చరిత్ర భారత్‌కు ఉంది" అని ఈ పత్రం తెలియజేసింది. ఇటీవల ఖరారు చేసిన మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన మౌలిక నిబంధల వ్యవస్థను రాబోయే వారాల్లో రెండు దేశాలు నిక్కచ్చిగా అమలు చేస్తాయి. పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిచేయడంకోసం ఈ ఒప్పందాన్ని ఖరారు చేస్తాయి" అని తెలియజేసింది. భారత్ వంటి కీలకమైన వాణిజ్య భాగస్వామితో పరస్పర ప్రయోజనకరమైన, సమతుల్యమైన వాణిజ్యాన్ని కొనసాగించేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నారని ఈ ప్రకటన తెలియజేస్తోంది. బిటిఎకు ఆటంకంగా ఉన్న ఇతర సుంకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్చలు కొనసాగుతాయని తెలిపింది. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన ద్వైపాక్షిక వాణిజ్యంలో టారిఫ్‌లు లేని ఆటంకాలను భారత్ పరిష్కరిస్తుందని కూడా పత్రం తెలిపింది. రష్యా నుండి తదుపరి చమురు కొనుగోళ్ళను గణనీయంగా తగ్గించుకున్నందువల్ల భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను కూడా ట్రంప్ రద్దుచేసేందుకు ట్రంప్ అంగీకరించారని పత్రం పేర్కొంది. గడచిన శుక్రవారం ట్రంప్ భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. 140 కోట్లమంది జనాభాగల భారతదేశంలో అమెరికా ఉత్పత్తులకు మార్కెట్ ద్వారా తెరచుకున్నాయని ఆనాడు చెప్పారు. మోదీ–ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత ట్రంప్ ఈ ప్రకటన చేశారు.

# మణిపూర్‌లో మళ్లీ హింస

### ఇంఫాల్‌లో ఐదు రోజులు ఇంటర్నెట్ సేవలు బంద్



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్‌లో టంగుఖుల్ నాగా కమ్యూనిటీ సభ్యుడిపై దాడి జరిగిందనే ఆరోపణలపై మంగళవారం ఉదయం మరోసారి హింసాత్మక ఘటనలు జరిగాయి. ఈ ఘటనతో జిల్లాలో ఐదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు పోలీసులు తెలిపారు. ఉఖ్రుల్, కామ్‌జోంగ్ జిల్లాల్లో రెండు టంగుఖుల్ నాగా సంస్థలు కుకీల కదలికను పరిమితం చేసిన మరుసటి రోజున లిటన్ సరీఖోంగ్ ప్రాంతంలో తాజా కాల్పులు, దహనం వంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. సాయుధులైన కొందరు దండుగులు పాడుబడిన ఇళ్లకు నిప్పంటించి లిటన్ సరీఖోంగ్‌పై అనేక రౌండ్ల కాల్పులు జరిగాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో భద్రతా దళాలు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయని పోలీసు అధికారి తెలిపారు. నివారణ, ముందు జాగ్రత్త చర్యగా ఉఖ్రుల్ జిల్లా రెవెన్యూ పరిధిలో బ్రాడ్‌బ్యాండ్ విపిఎన్, వ్యాస్ట్ ద్వారా సేవలు సహా ఇంటర్నెట్‌ను ఐదు రోజుల పాటు నిలిపివేయాలని మణిపూర్ ప్రభుత్వం మంగళవారం ఆదేశించిందని ఆయన చెప్పారు. తమ నివాసాలను వదిలి పారిపోయిన స్థానికులు, ఈ ప్రాంతంలో కాల్పులు ఆపడంలో విఫలమైనందుకు భద్రతా దళాలను ఎదుర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌లో కొండ ప్రాంతాన్ని దట్టమైన పొగ చుట్టుముట్టినట్లు కనిపిస్తోంది. వందలాది మంది కుకి, టంగుఖుల్ నాగా గ్రామస్తులు, ఎక్కువగా మహిళలు, పిల్లలు, వృద్ధులు, గత రెండు రోజులుగా లిటన్ సరీఖోంగ్, పొరుగున ఉన్న కుకి గ్రామాల నుండి కాంగ్‌పోక్పి, ఉఖ్రుల్ జిల్లాల్లోని సురక్షిత ప్రదేశాలకు పారిపోతున్నారని మరొక అధికారి తెలిపారు. 'కుకి మెజారిటీ కాంగ్‌పోక్పి జిల్లాలోని మోట్‌బంగ్, సైకుల్‌లోని కొన్ని ప్రాంతాలలో అనేక మంది గ్రామస్తులు ఆశ్రయం పొందారు అని ఆయన చెప్పారు. మణిపూర్ మంత్రి గోవిందాస్ కొంథౌజామ్ సోమవారం కనీసం 21 ఇళ్ళు కాలిపోయాయని, పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని చెప్పారు. పరిస్థితిని నియంత్రించడానికి ఆ ప్రాంతంలో అదనపు భద్రతా దళాలను మోహరించామని కూడా ఆయన చెప్పారు. కాగా, లిటన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లామ్లై చింగ్‌ఫీ కుకి గ్రామంలో తమ ట్రక్కులు చెడిపోవడంతో చిక్కుకుపోయిన ఇద్దరు డ్రైవర్లను సోమవారం రక్షించినట్లు మరొక పోలీసు అధికారి తెలిపారు.

### నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ

# పూర్వ వైభవం కోల్పోయింది

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శ



**న్యూఢిల్లీ:** నెహ్రూ నిర్మించిన పార్లమెంటరీ వ్యవస్థ ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని కోల్పోయి, వెలవెలబోతోందని కాంగ్రెస్ విమర్శించింది. 1954లో అప్పటి స్పీకర్ తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా, ప్రతిపక్షాలకు ఎక్కువ సమయం కేటాయించాలని ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన ఉదంతాన్ని కాంగ్రెస్ గుర్తు చేసింది. చర్చలు చేయడం, ప్రతిపక్షాలు చెప్పింది వినడం, సయోధ్య కుదర్చడం మొదలైన వాటి ద్వారా నెహ్రూ నిర్మించిన పార్లమెంట్ వ్యవస్థ, ప్రస్తుతం తన పూర్వ వైభవాన్ని కోల్పోయిందని, మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. గత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ పెట్టారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని, ఇతర ప్రతిపక్ష నేతలను కానీ మాట్లాడనివ్వకుండా స్పీకర్ అడ్డుకున్నారని విపక్షాలు ఆరోపించాయి. అలాగే స్పీకర్ ఓం బిర్లా, మాజీ ప్రధానులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపిలను విడిచిపెట్టి, 8 మంది ఇండియా కూటమి ఎంపిలను సస్పెండ్ చేశారని నిరసన వ్యక్తం చేశాయి. ఇప్పుడు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 1954 డిసెంబర్ 18 నాటి లోక్‌సభ చర్చల వివరాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ఆనాటి స్పీకర్ జివి మౌలాంకర్ తొలగింపు తీర్మానంపై ఎలా చర్చ జరిగిందో ఆయన వివరించారు. ఆనాటి చర్చలకు సంబంధించిన ఓ స్క్రీన్‌షాట్‌లను కూడా ఆయన జతచేశారు. '1954లో ఆనాటి లోక్‌సభ స్పీకర్ జివి మౌలాంకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీనిపై చర్చ కోసం డిప్యూటీ స్పీకర్ 2 గంటల సమయం కేటాయించారు. అప్పుడు ఆనాడి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జోక్యం చేసుకుని, 'అధ్యక్షా, ఈ ప్రత్యేక సమయంలో ప్రభుత్వం కంటే ప్రతిపక్షానికే ఎక్కువ సమయం ఇవ్వాలని నేను కోరుతున్నాను. మావైపు ఉన్న గౌరవ సభ్యులు చర్చల కోసం ఎక్కువ సమయం తీసుకోకూడదని నేను ఆశిస్తున్నాను. మేము చెప్పాల్సింది చెబుతాం కానీ, ప్రతిపక్షాలకే ఎక్కువ సమయం దక్కాలి' అని సభను కోరారు. అప్పట్లో లోక్‌సభలో మొత్తం 489 స్థానాలు ఉండగా, అందులో కాంగ్రెస్ పార్టీకి 364 సీట్లు ఉండేవి. ఆనాడు కనీసం గుర్తించబడిన ప్రతిపక్ష నాయకుడు కూడా లేరు. కానీ నాటి ప్రధాని నెహ్రూ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించే, ప్రజాస్వామ్య దృక్పథం ఉండేది. నెహ్రూ స్వయంగా సభలో కూర్చొని, ప్రసంగిస్తూ, ఇతరులు చెప్పేది వింటూ, అందరినీ కలుపుకునిపోతూ నిర్మించిన ఆ పార్లమెంట్, నేడు తన అసలు స్వరూపాన్ని కోల్పోయి, వెలవెలబోతోంది' అని జైరామ్ రమేశ్ పోస్టు చేశారు.

# ఆలయ ఉత్సవంలో తొక్కిసలాట..



### మహిళ మృతి, పలువురికి గాయాలు


**గ్వాలియర్:** మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లా దాబ్రా పట్టణంలో మంగళవారంనాడు విషాద ఘటన చోటుచేసుకుంది. నవగ్రహ ఆలయం ప్రారంభోత్సవానికి బయలుదేరిన కలశ యాత్రలో ఒక్కసారిగా తొక్కిసలాట చోటుచేసుకుని 70 ఏళ్ల మహిళ ప్రాణాలు కోల్పోయింది. మరో ఏడుగురు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఒక మైనర్ బాలిక ఉంది. గాయపడిన నలుగురిని చికిత్స కొసం గ్వాలియర్‌కు తరలించగా, మరో ముగ్గురికి దాబ్రాలో చికిత్స అందిస్తున్నారు. కలశ యాత్రలో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం దాబ్రా స్టేడియం వద్దకు పెద్దఎత్తున మహిళలు చేరుకున్నారని, కలశాల పంపిణీ జరుగుతుండగా తోపులాట చోటుచేసుకుందని గ్వాలియర్ కలెక్టర్ రుచిక చౌహాన్ తెలిపారు. ఈ ఘటనలో 70 ఏళ్ల మహిళ మృతిచెందినట్టు చెప్పారు. పరిస్థితిని వెంటనే అదుపులోకి తెచ్చామని, కలశ యాత్ర ముందుగు సాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. పెద్దఎత్తున మహిళలు తోసుకురావడంతో పరిస్థితి అదుపుతప్పినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటన అనంతరం కలశయాత్ర ముందుగా నిర్దేశించిన మార్గాల్లో బయలుదేరి నవగ్రహ ఆలాయనికి చేరుకున్నట్టు జిల్లా యంత్రాంగం తెలిపింది.

# కశ్మీర్‌లో రాగల 24 గంటల్లో వర్షం

### వాతావరణ శాఖ అంచనా


**శ్రీనగర్:** లోయలో మేఘావృతమైన పరిసితుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతో మంగళవారం కశ్మీర్‌లో ఎత్తైన ప్రాంతాలలో తాజాగా హిమపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్ రిసార్ట్‌లో వందలాది మంది పర్యాటకులు తెల్లవారుజామున మంచు కురుస్తుండటంతో ఆనందంగా ఆశ్చర్యపోయారు. రాబోయే 24 గంటల్లో తేలికపాటి నుండి మితమైన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడంతో లోయలోని మిగిలిన ప్రాంతాలలో మేఘావృతమైన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, సోమవారం రాత్రి శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 3.3 డిగ్రీల సెల్సియస్ నమోదైందని, ఇది కాలానుగుణ సగటు కంటే 3.1 డిగ్రీలు ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. ప్రసిద్ధ స్కీ రిసార్ట్ అయిన గుల్మార్గ్ కశ్మీర్లో అత్యంత శీతలమైన ప్రదేశంగా ఉందని, కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 3.4 డిగ్రీల సెల్సియస్ అని వారు తెలిపారు. ఇతర ప్రదేశాలలో, ఖాజిగుండ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత 2.6 డిగ్రీలు, కోకెర్నాగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 1.3 డిగ్రీల సెల్సియస్‌గా, కుప్వారాలో కనిష్ట ఉష్ణోగ్రత సున్నా డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఎన్‌సిపి అధినేత పవార్‌కు అస్వస్థత



**పుణె:** ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత 'శరద్ పవార్' ఛాతి ఇన్ఫెక్షన్ సమస్యతో పుణేలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగాఉన్నట్లు, తను కోలుకుంటున్నట్లు మంగళవారం ఆస్పత్రి వైద్యులు తెలిపారు.రాజ్యసభ సభ్యుడు 'శరద్ పవార్' పుణే జిల్లా బారామతి పట్టణంలోని తన నివాసంలో సోమవారం దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులతో బాధపడుతూ రూబీహాల్ క్లినిక్ ఆస్పత్రిలో చేరారు. ఫిజిషియన్, ఆస్పత్రి ట్రస్టీ డాక్టర్ సిమన్ గ్రాంట్ మాట్లాడుతూ..శరద్ పవార్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారని..ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని తెలిపారు. తను స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని..ముందు జాగ్రత్తగా పరిశీలనలో ఉంచామమని, చికిత్స కొనసాగుతుందన్నారు. శరద్ పవార్ ఆస్పత్రిలో చేరారన్న విషయం తెలియగానే పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆస్పత్రి దగ్గరకు భారీగా తరలివచ్చారు.అజిత్ పవార్ భార్య, డిప్యూటీ సిఎం సునేత్ర పవార్ తన కొడుకు పార్థ్ తో కలిసి సోమవారం ఆస్పత్రిని సందర్శించి, శరద్ పవార్ ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. తను త్వరగా కోలుకోవాలని కోరారు.

# మథురలో ఒకే కుటుంబంలో ఐదుగురు ఆత్మహత్య



**మథుర :** మథుర జిల్లా ఖప్పర్పూర్ గ్రామంలో ఒక దంపతులు, వారి మైనర్ పిల్లలు ఇంటి లోపల చనిపోయారని పోలీసులు తెలిపారు, ఇది సామూహిక ఆత్మహత్య అని అనుమానిస్తున్నారు. మృతుల వద్ద నుంచి ఒక ఆత్మహత్య లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కుటుంబ పెద్ద తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన వీడియోతో పాటు గోడపై రాసిన సందేశం కూడా లభ్యమైందని అధికారులు చెప్పారు. మథుర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్లోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, మృతులను మనీష్ కుమార్ (35) వృత్తిరీత్యా రైతు, అతని భార్య (సుమారు 32 సంవత్సరాలు), వారి ఇద్దరు కుమార్తెలు హనీ (8), ప్రియాంశి (5), కుమారుడు ప్రతీక్ (3)గా గుర్తించారు.వారంతా తమ ఇంటిలోని ఒక గదిలో మృతులుగా లభ్యమయ్యారు, అని ఆయన తెలిపారు. ఈ ఘటన గురించి మనీష్ కుమార్ సోదరుడి ద్వారా సమాచారం అందింది. ఉదయం పిల్లలు బయటికి రావడం గమనించని సోదరుడు గోడ దాటి ఇంట్లోకి వెళ్లి తలుపు విరగదీసి చూడగా, కుటుంబ సభ్యులందరూ మృతులుగా కనిపించారని చెప్పారు. అతనితో పాటు కొంతమంది గ్రామస్తులు కూడా ఉన్నారు. మనీష్ కుమార్ రాసిన ఆత్మహత్య లేఖలో, తాను , తన భార్య స్వంతదంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, తమ మరణాలకు ఎవ్వరూ బాధ్యులు కాదని పేర్కొన్నట్లు తెలిపారు. తనను వేధిస్తున్న కొన్ని సమస్యల గురించి ఇతరులతో పంచుకోలేకపోయానని ఆ లేఖలో ఉంది.ఈ ఘటనను దురదృష్టకరమని పేర్కొన్న మథుర జిల్లా కలెక్టర్ చంద్ర ప్రకాశ్ సింగ్, సంఘటనకు ముందు మనీష్ తన మొబైల్లో వీడియో రికార్డు చేశాడని చెప్పారు. ఆ వీడియోలో తాను స్వంతంగానే ఈ నిర్ణయం తీసుకుంటున్నానని మనీష్ చెప్పినట్లు వెల్లడించారు. ఇటీవల తాను ఒక స్థలాన్ని రూ.12 లక్షలకు విక్రయించి, ఆ మొత్తాన్ని కొనుగోలుదారుడి నుంచి స్వీకరించానని కూడా వీడియోలో పేర్కొన్నరు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించాలని, ఘటనను అన్ని కోణాల్లో విచారించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

# వెనిజులా ప్రతిపక్షనేత కిడ్నాప్

**కారకస్:**వెనిజులాలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ గవర్నర్ జుయాన్ పాబ్లో గ్వానియా రాజకీయ ఖైదీగా జైలు నుండి విడుదలైన తర్వాత ఆకస్మికంగా కిడ్నాప్‌కు గురయ్యారు. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ బహుమతి గ్రహీత–2025 మచాడో దీనిపై ఎక్స్ వేదికగా స్పందిస్తూ, సివిల్ దుస్తులలో నాలుగు వాహనాలలో వచ్చిన వ్యక్తులు భారీగా ఆయుధాలు ధరించి హింసాత్మక పద్ధతిలో కిడ్నాప్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. తనకు అత్యంత సన్నిహితులలో ఒకరైన గ్వానియా జైలు నుండి విడుదలైన కొద్ది గంటలకే కిడ్నాప్‌కు గురయ్యారని, తక్షణం ఆయన ఆచూకీ కనిపెట్టాలని కోరారు. తనపై నిర్బంధాలు అమలులో ఉన్నాగానీ, దేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు. వెనిజులాలో పరిస్థితులు మారిపోయాయని, దేశాన్ని మార్చుకుందామని గ్వానియా చెప్పిన తర్వాత ఆయన కిడ్నాప్‌కు గురయ్యారు.ఆయనకోసం తీవ్ర గాలింపు కొనసాగుతోంది. గడచిన ఆదివారం వెనిజులా తాత్కాలిక ప్రభుత్వం జైలు నుండి 18 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. తర్వాత కొద్ది గంటలకే గ్వానియా కిడ్నాప్ జరిగింది. ప్రతిపక్ష నాయకురాలు మచాడో అటార్నీ పెర్కిన్ రోచా, ఇతర స్థానిక రాజకీయ నాయకులు విడుదలైనవారిలో ఉన్నారు. దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అధికారంలోకి వచ్చాక 383 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేశారు.

# స్పీకర్ పాత్ర ఏమిటి?

పార్లమెంటు దిగువ సభలో స్పీకర్ పాత్ర ఏమిటో రాజ్యాంగం సూచించింది. కానీ, ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో స్పీకర్ ప్రాధాన్యత మరోసారి తెరపైకి వచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సమష్టిగా నోటీసు ఇవ్వడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. భారత ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలకే పరిమితం కాని వ్యవస్థ. అది సంస్థలు, సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలు, వాటిని ఆచరించే వ్యక్తుల నైతిక బాధ్యతలపై ఆధారపడి ఉంటుంది. ఉభయ సభల్లో అత్యంత కీలకమైన లోక్‌సభలో, అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ మధ్య సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుంది. అయితే, స్పీకర్ ఆ బాధ్యతను విస్మరించి, ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించినప్పుడు, సభలో ఘర్షణలు అనివార్యమవుతాయి. ఇప్పుడీ లోక్‌సభ సమావేశాల్లో దృశ్యాలు ఈ వాస్తవాన్ని కళ్లకు కడుతున్నవి. ప్రతిపక్ష నేతలకు మాట్లాడే అవకాశం నిరాకరించడం, సభా నియమాలను ఎంచుకున్నవారికి మాత్రమే వర్తింపజేయడం, విపక్ష సభ్యులను తరచుగా సస్పెండ్ చేయడం వంటి ఆరోపణలు స్పీకర్‌పై ఉన్నాయి. అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇవ్వడంతో, స్పీకర్ నైతిక, రాజకీయ బాధ్యతలపై మరోసారి చర్చ మొదలైంది.

భారత రాజ్యాంగం స్పీకర్ ను ఒక 'తటస్థ అధికారి' అని స్పష్టంగా పేర్కొనకపోయినా, ఆ పదవికి సంబంధించిన సంప్రదాయాలు, పార్లమెంటరీ ఆచారాలు, బ్రిటిష్ పార్లమెంటరీ వ్యవస్థ నుంచి మనం వారసత్వంగా పొందిన విలువలన్నీ, ఆ పదవిలోని వ్యక్తిని పక్షపాతంలేని న్యాయాధిపతిగానే ఆవిష్కరిస్తాయి. సభలో ఎవరు మాట్లాడాలి? ఎంతసేపు మాట్లాడాలి? ఏ అంశం చర్చకు రావాలి? వేటిని తిరస్కరించాలి? వంటివి స్పీకర్ నిర్ణయాలే. అందువల్ల స్పీకర్ నిర్ణయాలు న్యాయంగా, సమతుల్యంగా, పారదర్శకంగా ఉండాలి. రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చిన అధికారాలు విస్తృతమైనవే. కానీ, ఆ అధికారాలకు 'స్వీయ నియంత్రణ' కీలకం. ఇక్కడే సమస్య మొదలైంది. స్పీకర్ స్వీయ నియంత్రణ, విచక్షణ కోల్పోయారన్నది ప్రతిపక్ష పార్టీల ఆరోపణ. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్రను తగ్గించి చూపడం, లేదా అణిచివేయడం అంటే ప్రజల గొంతును నొక్కివేయడమే. ప్రతిపక్షం ఎప్పుడూ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంది. తప్పులను ఎత్తిచూపుతుంది. ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదిస్తుంది. ఈ ప్రక్రియకు వేదిక కల్పించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంటుంది. కానీ, ఒకవేళ స్పీకర్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తే, ప్రతిపక్షం నిరాశకు గురవుతుంది, సభ సజావుగా సాగదు. లోక్‌సభ ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ఓం బిర్లాపై ఉన్న ప్రధాన ఆరోపణ. దీనిని ఆషామాషీగా తీసుకోవడానికి వీల్లేదు. ఇది రాజకీయ అసంతృప్తితోపాటు రాజ్యాంగ సమస్యను ప్రస్తావిస్తుంది. ప్రతిపక్ష నేతకు సభలో ప్రత్యేక స్థానం ఉంది. ఆయనను మాట్లాడనివ్వకపోవడం అంటే, ప్రజల ఒక పెద్ద వర్గానికి ప్రాతినిధ్యం లేకుండా చేయడమే. సభలో క్రమశిక్షణను కాపాడటం స్పీకర్ బాధ్యతే. కానీ, అదే క్రమశిక్షణ పేరుతో విపక్ష సభ్యులను వరుసగా సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికి హానికరం.

ఇటీవలి బడ్జెట్ సమావేశాల్లో పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష ఎంపిలు సస్పెన్షన్‌కు గురైన తీరు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. విపక్ష గొంతును మూసివేయడానికి సస్పెన్షన్ల అస్త్రాన్ని ప్రయోగించడం ప్రమాదకరం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94 (సి) కింద స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు. ఇందుకు అవసరమైన 14 రోజుల గడువును, కనీసం 100 మంది సభ్యుల మద్దతు వంటి లాంఛనాలను ప్రతిపక్ష పార్టీలు పూర్తి చేశాయి. ఈ తీర్మానాన్ని లోక్‌సభలో చర్చకు, ఓటింగ్‌కు అనుమతిస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతున్నది. ప్రతిపక్షం లేవనెత్తుతున్న ప్రశ్నలు చిన్నవి కావు. స్పీకర్ తటస్థత కోల్పోయారా? సభలో సమాన న్యాయం జరుగుతోందా? ప్రతిపక్షానికి తగిన గౌరవం దక్కుతోందా? ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని కలవరపరుస్తున్న ప్రశ్నలు. స్పీకర్ పదవిని చేపట్టిన క్షణం నుంచి, తన పార్టీ అనుబంధాన్ని నైతికంగా పక్కన పెట్టాలి. పార్టీ సభ్యత్వం వదిలేయమని రాజ్యాంగం చెప్పకపోయినా, పార్లమెంటరీ సంప్రదాయం తటస్థుడిగా ఉండమని ఆశిస్తుంది. సభలో ప్రతి సభ్యుడు సమానమనే భావనను స్పీకర్ ఆచరణలో చూపించాలి. అలాంటి స్పీకర్ ప్రభుత్వానికి ప్రతినిధిగా మారి, అనుకూలంగా మాత్రమే నిర్ణయాలు తీసుకుంటే, సభపై నమ్మకం క్షీణిస్తుంది. ప్రజలు పార్లమెంటును ఒక అర్థరహిత వేదికగా చూస్తారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. భారత ప్రజాస్వామ్యం ఇప్పటికే అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సంస్థల స్వతంత్రత, మీడియా స్వేచ్ఛ, న్యాయ వ్యవస్థపై ఒత్తిళ్లు వంటి అంశాలు చర్చలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో, ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్లమెంటు చివరి ఆశాకిరణంగా ఉండాలి. ఆ పార్లమెంటును సజావుగా, న్యాయంగా నడిపించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉంది. మరోలా చెప్పాలంటే, స్పీకర్ పదవి వ్యక్తికి మించినది. అది ఒక సంస్థ. ఆ సంస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటే, ప్రజాస్వామ్య పునాది కదిలిపోతుంది. అందువల్ల స్పీకర్ తన ప్రవర్తనను పునఃసమీక్షించుకోవాలి. ప్రభుత్వానికి న్యాయంగా ఉండటం ఒక విషయం... ప్రతిపక్షాన్ని అణచివేయడం మరో విషయం. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం స్పీకర్ ముందున్న రాజ్యాంగ కర్తవ్యం. ఓం బిర్లాపై ప్రతిపక్షం తీసుకొస్తున్న తొలగింపు తీర్మానం ఆమోదం పొందుతుందా? లేదా? అనేది లోక్‌సభలో బలాబలాలకు సంబంధించిన విషయం. కానీ, ప్రజాస్వామ్యంలో స్పీకర్ పాత్ర, అనుసరించాల్సిన తటస్థ విధానం, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు వంటి పలు అంశాలపై కీలక చర్చకు దారితీసింది.

స్పీకర్ తాను రాజ్యాంగానికి విధేయుడిగా, ప్రజాస్వామ్యానికి కాపలాదారుడిగా వ్యవహరిస్తే, సభలో ఘర్షణలు తగ్గుతాయి. లేకపోతే, ఈ వివాదం కేవలం ఒక వ్యక్తిపై కాదు, ఒక వ్యవస్థపై నిందగా మిగిలిపోతుంది. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం కీలక ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టాల్సిన అవసరం ఉంది.



## విమాన ప్రమాదం వెనుక విద్రోహం

**అజిత్ పవార్ విమాన దుర్ఘటన కేవలం ప్రమాదం అని మేము నమ్మడం లేదు. విద్రోహానికి పాల్పడినట్లు అనుమానించేందుకు అవకాశం ఉంది. అసలు పైలట్లు - సాహిల్ మదన్, యష్ - ట్రాఫిక్ కారణంగా ఆలస్యం అయ్యారని తెలిసింది. అప్పుడు సుమిత్ కపూర్, శాంభవి పాఠక్ విమానాశ్రయానికి ఎలా చేరుకున్నారు? కపూర్ కంటే పాఠక్‌కు లియర్ జెట్‌లో విమానాన్ని నడిపే అనుభవం ఎక్కువగా ఉంది. క్లిష్టమైన రన్‌వే 11ని ఆయన ఎందుకు డిమాండ్ చేశారు. ఎదురుగా ఏముందో కనిపించనప్పుడు ఆయన ఎందుకు ల్యాండ్ చేయడానికి ప్రయత్నించారు? విమానంలో అక్రమ అదనపు ఇంధన ట్యాంకులు ఉన్నాయో లేదో ధృవీకరించడానికి మునుపటి లియర్ జెట్ ల్యాండింగ్‌ల సిసిటివి ఫుటేజ్‌లను చూడాలి. విఎస్‌ఆర్ కంపెనీ (విమానయాన కంపెనీ) అధికారులపై నేరపూరిత హత్య కేసు నమోదు చేయాలి**

–ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంఎల్‌ఏ రోహిత్ పవార్



# బాల్యంపై సోషల్ మీడియా సర్జికల్ స్ట్రైక్!

నేటి ఆధునిక యుగంలో సాంకేతికత మానవ జీవన గమనాన్ని మార్చేసింది. కానీ, అదే సాంకేతికత నేడు మన భావి భారత పౌరులైన పిల్లల పాలిట యముడిగా మారుతోంది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన గుండెలను పిండేసే సంఘటనే దీనికి నిదర్శనం. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా సీరియల్స్‌కు బానిసలైన ముగ్గురు మైనర్ సోదరీమణులు, తల్లిదండ్రులతో ఏర్పడిన చిన్నపాటి ఘర్షణకే తమ నివాస భవనం తొమ్మిదో అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకోవడం సభ్య సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇది కేవలం ఒక విషాద వార్త మాత్రమే కాదు; సోషల్ మీడియా కంపెనీలు తమ బ్యాంక్ బ్యాలెన్స్‌లను పెంచుకోవడానికి అమాయక పిల్లల ప్రాణాలను ఏ విధంగా బలిపీఠం ఎక్కిస్తున్నాయో చెప్పడానికి ఒక భయానక హెచ్చరిక.

**అల్గారిథమ్స్ కుట్ర.. వ్యసనంలో చిక్కుకున్న మెదడు**

సోషల్ మీడియా దిగ్గజాలు పిల్లల భద్రత కంటే వారిని నిరంతరం తమ ప్లాట్‌ఫారమ్‌లకు అతుక్కుపోయేలా చేసే 'అడిక్టివ్ అల్గారిథమ్స్' (Addictive Algorithms)కే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ అల్గారిథమ్స్ పిల్లల్లో విపరీతమైన ఆందోళన (Anxiety), తమ శరీరాకృతిపై అసంతృప్తి, సామాజిక జీవితం పట్ల అసహ్యం మరియు ఆత్మహత్య ఆలోచనలను పెంపొందిస్తున్నాయి. కౌమార దశలో మెదడు నిర్మాణం, విధుల్లో వేగంగా మార్పులు వచ్చే క్రమంలో, ఈ డిజిటల్ వ్యసనం మద్యం, పొగాకు కంటే ప్రమాదకరమైన రీతిలో వారిని బానిసలుగా మార్చుకుంటోంది.

పిల్లల ఆట, చదువు, నిద్ర వంటి కనీస అవసరాలను కూడా ఈ డిజిటల్ మహమ్మారి ఆక్రమిస్తోంది. దీనివల్ల పిల్లలు వాస్తవిక ప్రపంచానికి దూరమై, డిజిటల్ మాయాజాలంలో చిక్కుకుపోతున్నారు. మెదడులోని 'రివార్డ్ పాత్‌వేలను' ప్రేరేపించే ఈ అల్గారిథమ్స్ పిల్లలను మానసిక రోగులుగా మారుస్తున్నాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**టెక్ కంపెనీల కపట బుద్ధి**

గతంలో పొగాకు కంపెనీలు తమ ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలను దాచిపెట్టి ఎలాగైతే కబడ్లు ఆడాయో, నేటి టెక్ కంపెనీలు కూడా అదే దారిలో నడుస్తున్నాయి. పిల్లలకు సోషల్ మీడియాను నిరాకరించడం వారి సమాచార హక్కును కాలరాయడమేనని, హానిపై ఆధారాలు బలహీనంగా ఉన్నాయని వాదించడం ఈ కంపెనీల కపటత్వానికి నిదర్శనం. బాధ్యతను పూర్తిగా తల్లిదండ్రులపైకి నెట్టేస్తూ లాభాల వేటలో పడ్డాయి.

అమెరికా కోర్టుల్లో బయటపడిన ఆధారాల ప్రకారం, తమ ప్లాట్‌ఫారమ్‌ల వల్ల బాలికలు లైంగిక హింసకు, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిసి కూడా 'మెటా' వంటి సంస్థలు మౌనంగా ఉన్నాయి. వయస్సు నిర్ధారణ (Age Verification) విషయంలో ఈ సంస్థల నిర్లక్ష్యం ఎంతలా ఉందంటే, అమెరికాలో 8–12 ఏళ్ల వయస్సున్న పిల్లల్లో 40 శాతం మంది నిబంధనలకు విరుద్ధంగా ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వాడుతున్నారు. అంటే 13 ఏళ్ల వయో పరిమితి అనేది కేవలం కాగితాలకే పరిమితమైందని స్పష్టమవుతోంది.

ఈ ముప్పును గుర్తించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం, 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. వయస్సు నిర్ధారణ బాధ్యతను పూర్తిగా కంపెనీలపైనే ఉంచింది. అమెరికా, యుకె, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు కూడా కఠిన చట్టాల దిశగా అడుగులు వేస్తున్నాయి, ఎందుకంటే గత దశాబ్దకాలంలో ఈ దేశాల్లో యువత మానసిక ఆరోగ్యం దారుణంగా క్షీణించింది.

భారతదేశంలో పరిస్థితి మరింత విషమంగా ఉంది. స్మార్ట్‌ఫోన్ల వ్యాప్తి వేగంగా పెరుగుతోంది. ASER–2024 నివేదిక ప్రకారం, గ్రామీణ భారతంలో సైతం 16 ఏళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. మన దేశ పాలకులు యువత గురించి, 'డెమోగ్రాఫిక్ డివిడెండ్ (Youth dividend) గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. కానీ, ఆ యువ సంపదను టెక్ కంపెనీల లాభాల కోసం బలి ఇవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నారు.

**కఠిన చర్యలే శరణ్యం**

టెక్ కంపెనీల తిజోరీలు నింపడానికి మన పిల్లల ప్రాణాలను బలి ఇవ్వలేం. మన విధానకర్తలు వెంటనే నిద్ర మేల్కొని ఆస్ట్రేలియా తరహాలో కఠినమైన నిషేధ చట్టాలను అమలు చేయాలి. కేవలం చట్టాలే కాకుండా, సమాజంలో కూడా అవగాహన పెరగాలి. పిల్లలకు ఆన్‌లైన్ లోకం కంటే నిజ జీవితంలోని మానవీయ సంబంధాలే ముఖ్యమని, వారితో సమయం గడపడం ద్వారా తెలియజెప్పాలి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి ఈ డిజిటల్ విషవలయం నుండి బాల్యాన్ని రక్షించకపోతే, రేపటితరం మానసిక సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడం ఖాయం. మన పిల్లల ప్రాణాలు టెక్ కంపెనీల లాభాల కంటే మిన్న అని చాటిచెప్పే సమయం ఆసన్నమైంది.



**వెంకగారి భూమయ్య,**
9848559863

## వెనిజులా, క్యూబాలో

# మన్రో సిద్ధాంతంతో ట్రంప్ నూతన వలసవాదం



**బుడ్డిగ జమీందార్**
ఆల్‌ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యవర్గ సభ్యుడు
9849491969

1823లో అమెరికా 5వ అధ్యక్షుడు మన్రో సిద్ధాంతం ప్రకారం లాటిన్ అమెరికాకు చెందుతుంది, పశ్చిమ భూగోళంలోకి యూరపు దేశాలు వలసలకు రాకూడదు, తూర్పు భూగోళంలో అమెరికా జోక్యం చేసుకోదు. దక్షిణ అమెరికా దేశాలు అమెరికాకు చెందినవని (బ్యాక్ యార్డ్) అర్థం. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సిద్ధాంతాన్ని నిస్సిగ్గుగా అమలు చేస్తున్నాడు. ఇందులో భాగంగానే ఒక సార్వభౌమాధికార వెనిజులా దేశ అధ్యక్షుడు మదురోను నిర్దాక్షిణ్యంగా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి కిడ్నాప్ చేసి వాషింగ్టన్‌కు ఎత్తుకుపోయి జైల్లో బంధించాడు. దీని నిమిత్తం అంతకు ముందు పెద్ద డ్రామా నడిపాడు ట్రంప్. వెనిజులా మాదకద్రవ్యాల సరఫరా చేస్తుందని, మాదకద్రవ్యాల ఉగ్రవాదంపై దాడి చేస్తున్నామని అమెరికా ప్రపంచాన్ని నమ్మ ప్రయత్నం చేసింది. ఒక దేశాన్ని ఉగ్రవాద దేశంగా ముద్ర వేయటం వల్ల అమెరికా సైన్యం జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని కూల్చటానికి కాంగ్రెస్ నుంచి విస్తృత అధికారాలు లభిస్తాయి. మాదకద్రవ్యాల ఉగ్రవాద ముద్రతో ఇప్పుడు వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూల్చిన తర్వాత, తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించే దిశగా అమెరికా ఉంది. దీనికిగల సన్నాహాలను గడిచిన కొన్ని నెలల నుంచి గ్రహిస్తే అమెరికా చరిత్రలో అతిపెద్ద మిలిటరీ ఖర్చు బిల్లును 2026 సంవత్సరానికి 90,100 కోట్ల డాలర్ల బడ్జెట్టుతో ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఆమోదించింది.



లాటిన్ అమెరికాలో సరికొత్త యుద్ధాలకు ట్రంప్ కాలు దువ్వుతున్న సమయాన ఈ వ్యయ బిల్లు ఆమోదం కోసం డెమోక్రాట్లు కూడా రిపబ్లికన్లతో కల్సి ఓటు వేశారు. 2025 జులై నెలలో కేటాయించిన 15,600 కోట్ల డాలర్ల అనుబంధ సైనిక వ్యయ బిల్లును కల్పితే 2026 సంవత్సరానికి మొత్తం లక్ష 5,700 కోట్ల డాలర్లను ప్రపంచంలో యుద్ధాల్ని ప్రోత్సహించటానికి అమెరికా కేటాయించింది. 2020–2024 మధ్య అమెరికా మిలిటరీ ఆయుధ పరిశ్రమలకు 2లక్షల 40వేల కోట్ల డాలర్లు ఇచ్చింది. అందులో మొదటి 5 కంపెనీలకు 77,100 కోట్ల డాలర్లు అందించింది. (ఈ 5 కంపెనీలు లోక్‌హీడ్ మార్టీన్ 31300 కోట్ల డాలర్లు, రేత్‌రోన్ (ఆర్‌టిఎ) 14,500 కోట్ల డాలర్లు, బోయింగ్ 11,500 కోట్ల డాలర్లు, జనరల్ మోటార్స్ 11,600 కోట్ల డాలర్లు, నార్త్‌రోప్ గ్రూమన్ 8100 కోట్ల డాలర్లు అందుకొని ఆయుధాలు సరఫరా చేశాయి.

గత మూడునెలల నుంచి వెనుజులాపై సైనిక చర్యకు 15 వేలకు పైగా సైనికులను, డజను యుద్ధ నౌకలను, డజన్ల కొద్దీ యుద్ధ విమానాలను కరేబిక్, తూర్పు అట్లాంటిక్‌లో ట్రంప్ మోహరించాడు. ఇందుకు అవసరమగు భారీ వ్యయం ఈ డ్జెట్టు సమకూర్చుతుంది. 'ఆపరేషన్ దక్షిణ గోళం'(మనోసిద్ధాంతం) పేరిట ఎఫ్35 స్టెల్త్ ఫైటర్లను కరేబియన్ ప్రాంతానికి ట్రంప్ తరలించారు. శత్రు వైమానిక రక్షణ వ్యవస్థలను అణచివేసే ఇఎ18జి వార్‌జెట్‌లు అమెరికా దీవి పోర్టోరీకోకి చేరుకున్నాయి. 1962 క్యూబన్ క్షిపణి సంక్షోభం తర్వాత ఈ కరేబియన్ సైనిక మోహరింపు అతి పెద్దది.

ప్రారంభంలో 'వెనిజులా అధ్యక్షుడు మదురో రోజులు దగ్గర పడ్డున్నాయి' అంటూ వెనిజులా భూభాగంలోకి అమెరికా సైనిక దళాలు కాలుపెట్టకుండానే క్షిపణులు, యుద్ధవిమానాలు డ్రోన్ల సహాయంతో యుద్ధం వ్యూహం ట్రంప్ చేశాడు. ముందుగా డ్రోన్ల దాడితో 87 మంది మత్స్యకారులను చంపాడు. రెండు పెద్ద ఆయిల్ ట్యాంకర్లను వశపర్చుకొని వెనిజులాను దిగ్బంధనం చేశాడు. ప్రభుత్వ మార్పిడి తప్పదని, ప్రపంచ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా శాంతి నోబెల్‌ప్రైజ్‌ను సిఫార్సులతో వశపర్చుకున్న వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మరియా కోరీనా మచాడో ముందుగానే చెప్పిం ది. వెనిజులాలో జోక్యం కేవలం అక్కడి ప్రపంచ 20% ముడి చమురు నిల్వలపై కన్నేసి ఉంచటమే. సౌదీ అరేబియా కంటే అగ్రస్థానంలో చమురు నిల్వలు ఈ చిన్న దక్షిణ అమెరికా దేశంలో ఉండడం, ఈ దేశం అమెరికా ఆయిల్ కంపెనీల జోక్యాన్ని తగ్గించుట కారణంగా వెనిజులాపై అమెరికా చట్టవిరుద్ధ జోక్యం చేసుకొంది.

1970 దశకంలో చమురు ధరలు విపరీతంగా పెరగడంతో దానిపై వచ్చిన విదేశీ ఆదాయం దేశంలోని సంపన్నులకు మాత్రమే అనుకూలమై ధనిక, పేదల మధ్య అంతరం పెరిగింది. అటువంటి ప్రైవేటురంగ చమురు పరిశ్రమలను విప్లవ అధ్యక్షుడు ఛావెజ్ జాతీయం చేశారు. జనవరి 2005లో భూ సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా పెద్ద భూస్వాములు, ఎస్టేట్‌దారుల నుంచి సామాన్య రైతాంగం విముక్తి పొందింది. ఇదే సంవత్సరంలో 13 లాటిన్ అమెరికా దేశాలు కలిసి వాణిజ్య సమాఖ్యగా ఏర్పడి స్వల్ప ధరలకే ముడిచమురును అమ్ముకునేలా అవగాహనకు వచ్చాయి. ఆగస్టు 2008లో బ్యాంకుల జాతీయకరణ చేయడంతోపాటు రష్యాతో ఆయిల్, గ్యాస్, నేవీ, ఆర్మీ ఒడంబడికలు చేసుకున్నారు. నవంబరు 2009లో అమెరికా తన మిత్రదేశమైన కొలంబియాను వెనిజులాపై ఉసికొల్పి పరాభవం పొందింది అమెరికా. ఇవన్నీ అమెరికాకు నచ్చని అంశాలు.

వెనిజులా రాజధాని కారకాస్‌కు నార్కో కార్టెల్స్‌తో సంబంధాలున్నాయనే వాదనను వెనుజులా అధ్యక్షుడు మదురో ఎప్పటికప్పుడు తిరస్కరించుతూనే ఉన్నాడు. వాషింగ్టన్ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార ముసుగులో తన ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెనిజులాకు పొరుగున ఉన్న కొలంబియా వామపక్ష అధ్యక్షుడు గుస్తావోపెట్రో ఈ కార్టెర్ ఉనికిని తిరస్కరించారు. వెనుజులాలో చాలాకాలంగా సన్నిహితంగా ఉన్న రష్యా మాత్రం వెనుజులాకు బహిరంగంగా మద్దతునిచ్చింది. పుతిన్ వెనిజులా ప్రజలతో సంఘీభావం వ్యక్తపరిచారు. విదేశీ వత్తిడికి వ్యతిరేకంగా జాతీయ ప్రయోజనాలను, సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవటంలో వెనిజులాకు మద్దతుగా ఉంటానని ప్రకటించాడు. చైనా కూడా ప్రకటనలకే పరిమితంగా ఉంది.

'వెనిజులా చమురుపైనున్న ఇంధనహక్కులను అమెరికా తిరిగి పొందుతుంది' అని డిసెంబరు 17నాడు ట్రంప్ అన్నాడు. చట్టవిరుద్ధంగా అమెరికా చమురు హక్కులను వెనిజులా స్వాధీనం చేసుకొందని ట్రంప్ ఆరోపించాడు. వెనిజులాలోని మా చమురును స్వాధీనం చేసుకొన్నారు అంటూ, కారకాస్ (రాజధాని) దొంగలించిన చమురును తిరిగి ఇవ్వాలని, వెనిజులాను ఉగ్రవాద సంస్థగా గుర్తించినట్లు ప్రకటించాడు. అంతర్జాతీయ చట్టం ప్రకారం దేశ సహజ సంపదపై సార్వభౌమత్వాన్ని, నౌకా రవాణా స్వేచ్ఛ, స్వేచ్ఛా వాణిజ్య హక్కును వెనిజులా కల్గి ఉంటుంది. కానీ, చమురుపై అమెరికాకు నిజంగా ఆ హక్కు ఉందా? 1970 దశకంలో చమురు నిల్వలను వెనిజులా జాతీయం చేసే వరకూ, చమురు క్షేత్రాలను అమెరికా అభివృద్ధి చేసి ఆ చమురును కారుచౌకగా దోచుకొన్నాయి. ఇప్పుడు వెనిజులానే అమెరికా చమురును దోచుకొని దేశంలో టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తుందని, దీనితో మాదకద్రవ్యాల్ని సరఫరా చేస్తుందని అమెరికా అబద్ధాలు చెబుతుంది.

### వెనిజులా ముడిచమురు వివరాలు

దేశ తూర్పు భాగంలో 55,000 చ॥కిలోమీటర్ల వైశాల్యంలో చమురు నిల్వలు విస్తరించి ఉన్నాయి. 20వ శతాబ్ది ప్రారంభంలో అమెరికా కంపెనీలు వెనిజులాలో తవ్వకాలు ప్రారంభించాయి. డచ్ షెల్ సంస్థ వాయువ్య ప్రాంతంలోని జూలియా రాష్ట్రంలోని మరాకైబో సరస్సులో భారీ పెట్రోలియం నిల్వలను తొలిసారిగా కనుగొంది. చమురు వెలికితీతలో అమెరికా తన పెట్టుబడులను పెంచింది. స్టాండర్డ్ ఆయిల్ వంటి కంపెనీలు రాయితీ ఒప్పందాల కింద అభివృద్ధి చేశాయి. ఆ సమయంలో వెనిజులా ప్రపంచంలో ముఖ్యంగా అమెరికాకు ఒక కీలక చమురు సరఫరాదారునిగా నిలబెట్టింది. 1960లో ఓపెక్ దేశాలలో సభ్యత్వం తీసుకొన్న వెనిజులా చమురు వనరులను నియంత్రించటానికి ప్రభుత్వ యాజమాన్యంలోని పెట్రోలియోస్ డి వెనుజులా సంస్థను స్థాపించింది. కొన్ని సంవత్సరాల పాటు అమెరికాకు ప్రధాన చమురు ఎగుమతిదారునిగా నిలిచింది. 1990 నుంచి 2000 ప్రారంభం వరకు రోజుకు 15 నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేసింది. 1998లో హ్యూగో ఛావెజ్ అధికారం చేపట్టిన తరువాత చమురు ఆస్తులను, విదేశీ యాజమాన్య ఆస్తులను జాతీయం చేశాడు. పిడివిఎస్‌ఏను పునరుద్ధరించి రాజకీయంగా చమురు దోపిడీదారుడైన అమెరికాపై దృష్టి కేంద్రీకరించాడు. దీనితో ఎగుమతులతోపాటు, పెట్టుబడులూ తగ్గాయి, ఉత్పత్తి క్షీణించింది. ఆర్థికవ్యవస్థ మాత్రం మందగించింది, కానీ అప్పనంగా దోచుకునే అమెరికా దోపిడీకి అడ్డుకట్ట వేయగల్గాడు.

**అమెరికా ఆంక్షలు :** 2005లో చమురు ఆస్తులను జాతీయం చేసినందుకు ప్రతీకారంగా తొలిసారిగా వెనిజులా చమురుపై అమెరికా ఆంక్షలు విధించింది. దీని ప్రకారం అమెరికాలోని వెనిజులా ఆస్తులు నిర్బంధానికి గురయ్యాయి. వెనిజులా వ్యక్తులుగానీ, కంపెనీలుగానీ అమెరికా బ్యాంకులతో లావాదేవీలు నడప వీలుకాలేదు. వారి ఆస్తిని అమ్మలేరు, తరలించలేరు. వెనిజులాలో వ్యాపారాలు నిర్వహించే అమెరికా కంపెనీలు, వ్యక్తులు జరిమానాకు లోనయ్యారు. నికోలస్ మదురో హయాంలో మరిన్ని ఆంక్షలు విధించింది అమెరికా. 2019 నాటికి ఆంక్షల్ని మళ్లీ కఠినతరం చేసింది. ఫలితంగా అమెరికాకు చమురు ఎగుమతులు దాదాపు ఆగిపోయాయి. వెనిజులా తన వాణిజ్యాన్ని చైనాకు మార్చింది. కొంతవరకూ మన దేశంతోనూ, క్యూబాతోనూ చేసింది. ముడిచమురు ఎగుమతుల ద్వారా ఒకప్పుడు సంపాదించిన ఆదాయంతో పోలిస్తే, కేవలం కొంతభాగాన్ని మాత్రమే వెనిజులా పొందింది. అబ్జర్వేటరీ ఆఫ్ ఎకనామిక్స్ కాంప్లెక్సిటీ (ఒఇసి) ప్రకారం, 2023 లో కేవలం 405 కోట్ల డాలర్ల విలువైన ముడిచమురును మాత్రమే ఎగుమతి చేసింది. ఇదే సంవత్సరంలో సౌది అరేబియా 18100 కోట్ల డాలర్లు, అమెరికా 12500 కోట్ల డాలర్లు, రష్యా 122 కోట్ల డాలర్లు విలువగల చమురును ఎగుమతి చేశాయి. ప్రపంచంలో అగ్రగామి నిల్వలున్న వెనిజులా ఎగుమతులు మాత్రం బహుస్వల్పం. హ్యూస్టన్‌కు చెందిన చెవ్రాన్ ఇప్పటికీ వెనిజులా తో పనిచేస్తున్న ఏకైక సంస్థగా మిగిలింది. యు.ఎస్. చమురు సంస్థ చెవ్రాన్ ఉమ్మడి ఉత్పత్తి కింద పిడివిఎస్ఎ కి ఉత్పత్తిలో కొంత శాతాన్ని వెనిజులాకు చెల్లిస్తుంది. వెనిజులా అధికారిక చమురు ఉత్పత్తిలో 5 వ శాతం ఉత్పత్తి చేస్తుంది. అమెరికాకు మధ్యవర్తి కంపెనీల ద్వారా చమురు ను చెవ్రాన్ అమ్ముతున్నది. 2022లో జో బైడెన్ ప్రత్యేక హక్కులు ఈ కంపెనీకి కల్పించాడు.చావెజ్, మదురో జాతీయం చేసిన కంపెనీల్లో ఎక్సాన్, కార్గిల్, హిల్టన్ వంటి విదేశీ కంపెనీలున్నాయి. ప్రస్తుతం వెనిజులా చమురుపై అమెరికా పట్టు సాధించటానికి తమ ఆయిల్ కంపెనీలు చమురును తోడాలని ట్రంప్ ఆదేశించాడు. 'సహజవనరులపై శాశ్వత సార్వభౌమాధికార సూత్రం (పిఎస్‌ఎన్‌ఆర్) ప్రకారం సార్వభౌమరాజ్యాలు తమ భూభాగాల్లో తమ స్వంత అభివృద్ధి కోసం సహజవనరులను కల్గి ఉంటాయని' అంతర్జాతీయ చట్టం స్పష్టంగా చెబుతుంది. 1945 తర్వాత పూర్వ యూరోపియన్ వలస రాజ్యాల నిర్మూలన సమయంలో పిఎస్‌ఆర్‌ఎన్ భావన ఉద్ఘాటించింది. 1962 లో ఐరాస దీన్ని పటిష్టపర్చింది. ఈ చట్టం ప్రకారం వెనిజులా దాని చమురును కల్గి ఉంది.

ప్రపంచ ఆధిపత్యం కోసం యుద్ధాలను ప్రోత్సహించే అమెరికా తన కార్పోరేట్ ఆయుధ కంపెనీలను కాపాడుకొంటూ, అత్యధిక లాభాలను ఆర్జించుటకోసం, సహజసంపదపై ఆజమాయిషీకై ఎక్కడోచోట ఏదో సాకుతో యుద్ధాన్ని చేస్తూనే, చేయిస్తూనే ఉంటుంది. 4 సంవత్సరాలకాలంలో ఉక్రెయిన్‌కు సుమారు 17000 కోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేయటమేగాక, గాజాపై యుద్ధాన్ని ప్రోత్సహించిన అమెరికా ఇజ్రాయిల్‌కు 2 సంవత్సరాల కాలంలో 16 బిలియన్ల డాలర్ల విలువచేసే ఆయుధసామాగ్రిని సరఫరా చేసింది. గాజాపై యుద్ధం కోసం 70శాతం ఖర్చు భరాయించిన అమెరికా పశ్చిమాసియాలో తన చమురు ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌ను తన అంగరక్షకునిగా ఉంచుకొని, ఇజ్రాయిల్‌కు 1946 నుంచి ఇప్పటివరకూ సుమారు 35,000కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించింది.

ఇలాఉండగా మదురో అపహరణ తర్వాత, మన్రో సిద్ధాంతంలో భాగంగా తాజాగా ట్రంప్ దృష్టి సోషలిస్టు క్యూబాపై పడింది. క్యూబాకు ఏ దేశమైనా చమురును సరఫరా చేస్తే, ఆ దేశంపై వాణిజ్య ఆంక్షలతో పాటు సుంకాలు పెంచుతానని ఇటీవల ట్రంప్ ప్రకటించాడు. ప్రస్తుతం క్యూబా తీవ్ర ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. రాజధాని హవానాలో రోజుకు10 నుంచి 5 గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

క్యూబా ఇంధన మనుగడకు రోజూ లక్షబ్యారెర్ల చమురు కావాలి. తను స్వంతగా 40శాతం మాత్రమే ఉత్పత్తి చేసుకోగలదు. మెక్సికో రోజుకూ 6 వేల నుంచి 12వేల బ్యారెర్లు మాత్రమే అతి కష్టం మీద పంపిస్తుంది. రష్యా, అల్జీరియాలు నామమాత్రంగా సరఫరా చేస్తున్నాయి. మరొక 10 రోజుల్లో తన దగ్గరి ఇంధన నిల్వలు అయిపోతాయని అంటున్నారు. క్యూబా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కొంది. ఇక ట్రంప్ దృష్టి వెనిజులా, క్యూబా తర్వాత నికరాగువా వైపు మళ్లుతుందంటున్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజాపోరాటాలు, లాటిన్ అమెరికా సంఘీభావ ఉద్యమాలతో కొంతవరకూ ట్రంప్ ఆపరేషన్ మన్రోన్ సిద్ధాంత దూకుడుకును ఎదుర్కోగలం. నేటి ప్రగతిశీలుర తక్షణ కర్తవ్యం మన్రో సిద్ధాంతాన్ని కూకటి వేళ్లతో లాగి, ప్రపంచ వలసవాద చరిత్రను పునరావృతం గాకుండా రక్షించు కోవటమే.

# రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

## వారం రోజుల్లో 21,713 కేసులు నమోదు : ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు భద్రత అనేది ట్రాఫిక్ పోలీసుల ప్రధాన ప్రాధాన్యత అని, నిత్యం ట్రాఫిక్ నియంత్రణ అమలుతో పాటు, నగర రహదారులను ప్రయాణికులకు సురక్షితంగా మార్చడం, రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే మరణాలను తగ్గించడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్ తెలిపారు. నగర రోడ్లపై రాంగ్ సైడ్ డ్రైవింగ్ అనేది సర్వసాధారణమైన, ప్రమాదకరమైన అలవాటుగా మారిందన్నారు. ఇది కేవలం ట్రాఫిక్ రద్దీకి కారణమవ్వడమే కాకుండా, ఉల్లంఘనదారులతో పాటు ఇతర రోడ్డు వినియోగదారుల భద్రతకు తీవ్ర ముప్పును కలిగిస్తోందని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలను నివారించడానికి, మొత్తం రోడ్డు క్రమశిక్షణను మెరుగుపరచడానికి, ట్రాఫిక్ ప్రవాహానికి వ్యతిరేక దిశలో ప్రయాణించే 'రాంగ్ సైడ్ డ్రైవింగ్' మోటారు వాహనదారులపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 21,713 రాంగ్ సైడ్ డ్రైవింగ్ వాహనదారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ఉల్లంఘనదారులకు మోటార్ వాహనాల (ఎంవి) చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానా విధించడం జరుగుతోందన్నారు.





ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వివిధ రకాల ట్రాఫిక్ విద్యా, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారని వివరించారు. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రవర్తనను పెంపొందించడానికి సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా పౌరులకు అవగాహన కల్పిస్తున్నామనీ, మోటారు వాహనదారులు రోడ్డుకు తప్పుడు దిశలో డ్రైవింగ్ చేయవద్దని జోయల్ డేవిస్ విజ్ఞప్తి చేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు
# నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు

### రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పిసిపిఎన్ డిటి చట్టాన్ని కఠినంగా అమలు చేస్తూ, అక్రమ లింగ నిర్ధారణ పరీక్షలను నివారించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. మంగళవారం శివరాంపల్లిలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో గర్భస్థ పిండ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అల్ట్రా సౌండ్,స్కాన్ కేంద్రాల పనితీరు, చట్టపరమైన నిబంధనల అమలుపై చర్చించారు. జిల్లాలో కొత్తగా అల్ట్రా సౌండ్ స్కాన్ కేంద్రాల కోసం వచ్చిన 15 దరఖాస్తులు పరిశీలించబడంతోపాటు ఇప్పటికే జిల్లాలో పనిచేస్తున్న 19స్కాన్ కేంద్రాలకు సంబంధించిన రెన్యూవల్ దరఖాస్తులు కమిటీ ముందు ప్రతిపాదించారు. అన్ని దరఖాస్తులు పిసిపిఎన్ డిటి చట్టంలోని నిబంధనల ప్రకారం పరిశీలించి అనుమతికి జిల్లా స్థాయి కాంపిటెంట్ అథారిటీకి నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రతిపాదనలు పంపారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ అనురాగిని, జిల్లా అధికారులు డాక్టర్ షీబా హయత్,డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డాక్టర్ వినోద్, ఎన్ జిఓ నుంచి డాక్టర్ కొమరయ్య, డిప్యూటీ డిఎంహెచ్ఓ లు, డెమో కె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




# నియమావళి ఉల్లంఘించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

### చర్య తీసుకోవాలని ప్రశాంత్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై ఎన్నికల ప్రధాన కమీషనర్, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల పరిశీలన పేరిట ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 100పడకల ప్రభుత్వ దవాఖానకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీశ్ రావు 37.50 కోట్లు మంజూరు చేశారని ఆయన గుర్తు చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుండి ఆక్టోపస్ వరకు రోడ్డు విస్తరణ కోసం 60 కోట్లు నాటి ఎంఎల్ఎ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంజూరు చేశారని, కమీషన్ల కోసమే రెండేళ్లుగా పనులు మొదలు పెట్టనివ్వనిది ఎవరో ఇబ్రహీంపట్నం ప్రజలకు తెలుసన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన ఎమ్మెల్యే కోడ్ ఉల్లంఘించి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యేపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఎన్నికల సంఘాన్ని, పోలీసు అధికారులను కోరారు.

## ఘనంగా సిఎం కప్ పోటీలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా స్థాయి సిఎం కప్2025–26 పోటీలు మంగళవారం సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియంలోరెండవ రోజు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ పోటీలలో వాలీబాల్,బాక్సింగ్ విభాగాలలో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు,పతకాలు ప్రదానం చేయబడినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీగల్ అండ్ ఎస్టేట్ ఆఫీసర్ పద్మావతి,జిల్లా యువజ సర్వీసుల శాఖ (డివైఎస్ఓ)ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు,అసోసియేషన్ కార్యదర్శులు రవి కుమార్,ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం రాఘవ రెడ్డి,ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామ చంద్రుడు,జిల్లా కోచ్‌లు,ఫిజికల్ డైరెక్టర్లు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు,క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాను ప్రాతినిధ్యం వహించనున్నారు.

**పోటీల ఫలితాలు...** వాలీబాల్ (బాలురు):విజేతలు కల్వకుర్తి నియోజకవర్గ జట్టు,రన్నర్స్ షాద్‌నగర్ నియోజకవర్గ జట్టు

వాలీబాల్ (బాలికలు):విజేతలు కల్వకుర్తి నియోజకవర్గ జట్టు,రన్నర్స్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు

ఈ జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ,ఆరోగ్యకరమైన సమాజనిర్మాణానికి దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

### చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం



**ప్రజాపక్షం/షాబాద్:** బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన్నట్లు చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం తెలిపారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఫరా కళాశాలలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులతో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల మున్సిపల్ డివిజన్‌లో మొత్తం 18 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నట్టు తెలిపారు. మొత్తం 5 జోన్‌లకు గాను 180 మంది ఎన్నికల అధికారులు పని చేస్తున్నట్లు వివరించారు. 37 పొలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి, అధికారులకు ఎన్నికల సామాగ్రి అందజేశారు. ఎన్నికల అధికారులకు బస్సు సౌకర్యం ద్వారా ఆయా పొలింగ్ కేంద్రాలకు పోలీస్ అధికారుల బందోబస్తు ఉర్పాటు చేసి అధికారులను తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ అధికారు రాఘవేందర్, అమరేందర్ రెడ్డి, సిఐ భూపాల్, శ్రీధర్ చేవెళ్ల, షాబాద్ పోలీస్ అధికారులు ఉన్నారు.

# 28 వార్డులకు 76 పోలింగ్ కేంద్రాలు

### 300మందికిపైగా ఎన్నికల సిబ్బంది..
### 200మందికి పైగా పోలీసులు
### ఏర్పాట్లను పరిశీలించిన ఎసిపి లక్ష్మీ నారాయణ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపల్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. స్థానిక మున్సిపల్ కమీషనర్, ఎన్నికల అధికారి సునీతారెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మున్సిపాలిటీలోని 28 వార్డులో ఏర్పాటు చేసిన 76 పోలింగ్ కేంద్రాల్లో 53403 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో 300మందికి పైగా ఎన్నికల సిబ్బంది పాల్గొనడంతోపాటు 200మందికి పైగా పోలీస్ సిబ్బంది బందోబస్తుగా విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ బ్యాలెట్ బాక్స్‌లు ఇచ్చే క్రమంలో ఏర్పాట్లను షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ పరిశీలించి పోలీస్ సిబ్బందిని తగిన సూచనలు, సలహాలు అంధించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. పోలింగ్ కేంద్రాల వారిగా సిబ్బందిని ఏర్పాటు చేసి తరలించడం జరిగిందని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు సైతం భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు వివరించారు. షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల అధికారి సునీతారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఓటర్లు ఉత్సాహంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓట్లు వేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. వార్డుల వారిగా పోలింగ్ స్లిప్‌లను సైతం ఓటర్లకు అంధించినట్లు వివరించారు. ఎసిపి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటిలోని 28వ వార్డులో ఉన్న సమస్యాత్మక వార్డులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆరు వార్డులను సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించామని, వారిపై నిఘా ఏర్పాటు చేయడమే కాకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.




# బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహణ

### రంగారెడ్డి జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు బాధ్యతగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు మయంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటికి సంబంధించి శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మయంక్ మిట్టల్ మాట్లాడుతూ బుధవారం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న పొరపాట్లు జరగకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ చెక్ లిస్ట్ ప్రకారం ఎన్నికల సామగ్రిని సరిచూసుకున్న తరువాతనే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి వెళ్లాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ విధులు బాధ్యతగా నిర్వహించాలన్నారు. 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. గడువు లోపు పోలింగ్ కేంద్రం లోనికి చేరుకున్న ఓటర్లకు సాయంత్రం 5.00 గంటలు దాటిన తరువాత కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు.



**లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా...** కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా,లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని ఆదేశించారు. సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా జరిగేలా అంకితభావంతో కృషి చేయాలని ఎన్నికల సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఎక్కడ కూడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా పక్కాగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ సందర్భంగా గోప్యతను కాపాడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటిరియల్ క్షుణ్ణంగా పరిశీలించి, అన్ని సరిగా ఉన్నాయని నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలు దేరాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని పేర్కొన్నారు. అనంతరం శేరిగూడలో మండల, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించడం జరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తామన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని డిసిపి కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ అనంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థి దశలోనే విజయాలు

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హయత నగర్ :** సృజనా సాధు సాధించిన విజయాలు రాష్ట్రానికే గర్వకారణమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీకి చెందిన నాగరాజ్ సాధు గౌరి సాధు దంపతుల కుమార్తె సృజనా సాధు 2026 సంవత్సరానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మక ఎన్‌సిసి రిపబ్లిక్ డే క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సుధీర్‌రెడ్డి వారిని శాలువతో సన్మానించారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సృజనా సాధు సాధించిన విజయాలు కుటుంబ సభ్యులకు, విద్యాసంస్థకు మాత్రమే కాకుండా రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెరుకు ప్రశాంత్ గౌడ్, సతీశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

## ఉమెన్స్ థీమ్ పార్కు ప్రారంభం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో మహిళాలకు ప్రత్యేక పార్కు ఏర్పాటు చేయడంపట్ల వారి వాకింగ్‌తో పాటు అనేక అవసరాలకు ఉపయోగపడే విధంగా పార్కును ఏర్పాటు చేయడం జరిగిందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్లోని సచివాలయ నగర్‌లో ఉమెన్స్ థీమ్స్ పార్కు, ఎన్జీవోస్ కాలనీలో సిసి రోడ్డు, రంగారెడ్డి కాలనీలో సిసి రోడ్డు అభివృద్ధి పనులను కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రావు, సోమయాజులు, పంపన వెంకటేశ్వర్లు, సాంబశివరావు, కూర్మారావు, వర్ధిని, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని సర్పంచ్ మస్కు అనిత శరణం అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ జరిగింది. ఈసందర్భంగా అమే మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కుమ్మరి గూడేం మంగ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సచివాలయ నగర్ కాలనీలో 64 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తున్నామని, కాలనీలకు అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పంగళి సంబశివరావు, బాలిరెడ్డి, ఆంజనేయులు, కూర్మారావు, హనుమంత్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, బాబు రావు, నరసింహా, హరీష్, శ్రీధర్ పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధే ధ్యేయం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కాలనీల అభివృద్ధియే ధ్యేయంగా పనిచేస్తున్నానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కమలానగర్‌లో సిసి రోడ్డు, పార్కు అబివృద్ధి పనులను కాలనీ సంక్షేమ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూఐదేళ్లుగా కాలనీలకు డ్రైనేజీ, రోడ్డు, పార్కులు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించడం ముందున్నానన్నారు. నిధులు సంక్షేమం కోసం తీసుకోచ్చి ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయడంతో పాటు మెరుగైన సదుపాయలు కల్పించామన్నారు. తమపై నమ్మకంతో నిలబడిన కాలనీ సంక్షేమ వాసులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు టివి రావు, మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు పుల్లమ్మ, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు ఉపేందర్, సభ్యులు సుబ్బారావు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ మాదాపూర్ ఎస్ఐ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో మరో అవినీతి తిమింగలం ఎసిబి అధికారులకు చిక్కింది. రంగారెడ్డి జిల్లా రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ వినయ్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ కేసు విషయంలో సహాయం చేస్తా అని బాధితుడి నుంచి రూ.50 వేలు లంచం ఎస్ఐ వినయ్ డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల పథకం ప్రకారం మాదాపూర్ ఎస్ఐ వినయ్ బాధితుల నుండి లంచం తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నారు. లంచం మొత్తం స్వాధీనం చేసుకొని, వినయ్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చెపట్టారు.



## ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం :** ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం 9వ ఫేజ్‌లో కొనసాగుతున్న పార్క్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ పురపాలకశాఖ మంత్రి కెటిఆర్‌ల నాయకత్వంలోనే ఈ పార్క్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కెపిహెచ్‌బి డివిజన్ పరిధిలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఈ పార్క్ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. పార్క్ పనులను వేగవంతంగా పూర్తిచేసి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హందా డిఇ జీవన్‌రెడ్డి, ఆర్కిటెక్ సౌజన్య, ఎఇ రాజీవ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేష్, పాతూరి గోపి, గంగూరి శ్రీనివాసరావు, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధి పథంలో ఉప్పల్ నియోజకవర్గం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రాజకీయాలతో సంబంధం లేకుండా నియోజకవర్గంలోని అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్లేందుకు కృషి చేస్తున్నానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మల్లాపూర్ డివిజన్‌లోని గోకుల్‌నగర్ ప్రాంతంలో రూ.కోటి ఐదు లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన కమ్యూనిటీ హాలును మంగళవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో కార్పొరేటర్‌గా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించానన్నారు. ఈ కార్యక్రమంలో గోకుల్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.మల్కయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, కంకణాల రాజు, మీసాల వెంకటరెడ్డి, వివిఎస్‌ఎన్ రెడ్డి, విజయ్, సీతారాంరెడ్డి, కిషన్, భిక్షపతి, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌గా రూ.72 కోట్ల అభివృద్ధి పనులు

గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత





**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో గత ఐదేళ్ల కాలంలో తాను కార్పొరేటర్‌గా రూ.72 కోట్ల రూపాయల పలు అభివృద్ధి పనులు చేపట్టానని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రోడ్లు, మంచి నీరు, డ్రైనేజి వంటి మౌలిక వసతులు కల్పించానన్నారు. మంగళవారం డివిజన్‌లోని మహేంద్రహిల్స్ ప్రాంతం లో రూ.14 కోట్ల 95 లక్షల వ్యయంతో 5 ఎంఎల్ రిజర్వాయర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. జిహెచ్‌ఎంసి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ కొత్త పనులకు ప్రతిపాదనలు తేవటంతో పాటు నిధులు మంజూరు చేయి స్తూ నాణ్యతతో పనులు జరిగాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ.4.30కోట్ల వ్యయంతో జ్యోతినగర్, హన్మాన్‌పేట వద్ద రైల్వే పట్టాల కింద నుండి మురికి కాలువ పనులు పూర్తి చేసామన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లు



**ప్రజాపక్షం/తాండూరు:** మున్సిపల్ పోరుకు అధికారులు స్వరం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు. తాండూరు మున్సిపల్‌లోని 36వార్డులకు గాను 117 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి పోలింగ్ కేంద్రానికి అదనంగా ఒకటి ఏర్పాటు చేశారు. 585మంది సిబ్బందిని నియామకం చేశామన్నారు. తాండూరు పట్టణంలోని సెంట్ మార్క్స్ స్కూల్ ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఎన్నికల సమాగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. 117కేంద్రాలకు గాను 117మంది పిఒలు, 117మంది ఎపిఒలతో పాటు అదనంగా మరో ముగ్గురు సిబ్బందిని ఏర్పాటు చేశారు. 117 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతి సమస్యాత్మక కేంద్రాలు 19, సమస్యాత్మక కేంద్రాలు 31 గుర్తించిట్లు అధికారులు తెలిపారు.

## మీడియేషన్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మీడియేషన్ డ్రైవ్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్‌రావు అన్నారు. సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లాలోని అన్ని కోర్టు న్యాయస్థానాలలో 2 తేదీ నుండి మీడియేషన్ డ్రైవ్ 2.0 నిర్వహించబడుతుందని తెలిపారు. కక్షిదారులు పెండింగ్‌లో ఉన్న కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

## యువతి అదృశ్యం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువతి అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని మౌలాలీ హెచ్‌బి కాలనీ ఇంద్రానగర్ కాలనీలో నివాసముండే రేణుక కుమార్తె ఎస్ పావని(19) సోమవారం ఉద్యోగానికి వెళ్లి సాయంత్రం 6 గంటలకు తల్లికి ఫోన్ చేసి ఇంటికి ఆలస్యంగా వస్తానని చెప్పింది. 8 గంటలకు తల్లి ఫోన్ చేయగా బస్‌స్టాప్‌లో ఉన్నానని వస్తున్నానని తెలిపింది. మళ్లీ కాసేపటికి ఫోన్‌చేస్తే ఫోన్ స్విచాఫ్ అయింది. బంధువులను ఇతర ప్రదేశాలలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై
# కార్మికులందరూ ఉద్యమించాలి

జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ ఎఐటియుసి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ బోస్ పిలుపు



**ప్రజాపక్షం/కాప్రా:** ఈ నెల 12న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ బోస్ పిలుపిచ్చారు. కార్మికులందరూ సంఘటితమై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ఉద్యమించాలన్నారు. నాచారం చౌరాస్తాలో మంగళవారం ట్రేడ్ యూనియన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య నేతగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాచే విధంగా అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ ఆస్తులు, అవసరమైన ప్రజా సేవల ప్రయివేటీకరణ కోసం కేంద్ర ప్రభుత్వ లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీరని నష్టం వాటిల్లుతుందని, పోరాడి సాధించుకొన్న కార్మి క హక్కులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్మిక సంఘాలను బలహీనపరుస్తూ పెట్టుబడిదారులకు సహకరించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. లేబర్‌కోడ్‌ల వల్ల ఉద్యోగ భద్రత, న్యాయపరమైన వేతనాలు, సురక్షితమైన పనిచేసే పరిస్థితులను హరిస్తాయన్నారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర నాయకులు వీరయ్య తో పాటు వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

## కబ్జాలతో కుంచించుకుపోతున్న చింతలకుంట






**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మండల పరిధిలో కబ్జాలు ఆగడంలేదు, కుంటలు, చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైడ్రా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న స్థానిక అధికారుల తీరుతో నిర్మాణాలు జరుగుతున్నాయి. దుండిగల్ గండిమైసమ్మ పరిధిలోని లేక ఐడి 2833 డి.పి పల్లి చింతలకుంట చెరువు విస్తీర్ణం 15 ఎకరాలు వాటర్ స్ప్రెడ్ ఏరియా 10.500 ఎకరాలుగా 2013, ఆగస్టు 20వ తేదీన ఇరిగేషన్ అధికారులు తేల్చారు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించారు. గత రెండు సంవత్సరాలుగా చింతలకుంట చెరువు కబ్జాకు అడ్డుకట్టపడిందన్న తరుణంలో ప్రస్తుత అధికార పార్టీ నాయకుని అండతో చింతలకుంట చెరువు ఎఫ్.టి.ఎల్‌లో రోడ్డు నిర్మాణం, బఫర్ జోన్‌లో బెస్మెట్ నిర్మిస్తున్నారు. స్థానిక అధికారుల అండతోనే చింతలకుంట చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదులు అందినా జాయింట్ సర్వే పేరుతో ఇరిగేషన్, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారులు కాలయాపన చేస్తుండం పలు అనుమానాలకు తావిస్తుంది. గతంలో చింతలకుంట చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ రెండు ఎకరాలకు పైగా ఆక్రమించి ఫ్రీ కాస్ట్ వాల్ నిర్మించడంతో పెద్ద ఎత్తున విమర్శలు వినిపించాయి. పలు వార్తాకథనాలు, ఫిర్యాదులు అందడంతో తేరుకున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఫ్రీ కాస్ట్ వాల్‌ను తొలగించి అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. హైడ్రా రాకతో గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడింది. ఇటీవలే అధికారపార్టీ నాయకుడు నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్.టి.ఎల్ లో రోడ్డు, బఫర్ జోన్‌లో యధేచ్ఛగా బెస్మెట్ నిర్మాణాలు కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చింతలకుంట చెరువు అక్రమ నిర్మాణాలపై ఇరిగేషన్ డిఇ జైపాల్ ను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ఫీల్డ్ విజిట్ కోసం ఎఇ ను పంపించామని జాయింట్ సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలు తొలగిస్తామన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కిడ్నీ మార్పిడి చికిత్సకు బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద చొరవతో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4లక్షలు ఆర్థిక సహా యం మంజూరైంది. 128 చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన రామలక్ష్మి తనయు డు రామ శ్రీహరి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, కిడ్నీ మార్పిడి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యేను సంప్రదించారు. బాధిత కుటుంబ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వివేకానంద వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తల్లికి రూ.2లక్షలు, కుమారుడికి రూ. 2లక్షలు ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ రఫీక్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని అన్నా రు. అవసరంలో ఉన్న ప్రతీ ఒక్కరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శేఖర్‌రావు, సాంబయ్య, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

**సాంప్రదాయాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి**



**నిజాంపేట్‌లో:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం, బాలయ్యనగర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి లు వేర్వేరుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రార్థనా మందిరాలు, దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ఐక్యతా భావాన్ని పెంపొందించడంలో దేవాలయా లు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆ ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్, సాయిలు, గోకుల్ ప్రసాద్, గంగయ్య, సునీల్ కుమార్ వర్మ, పార్వతి, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎఐ, ఆధునిక సాంకేతికత పాత్ర కీలకం

సిఎస్ఐ ఎఐ100కె కన్వీనర్ డాక్టర్ కళ్యాణ్ కుమార్ సర్వేపల్లి




**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నేటి సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు(ఎఐ), ఆధునిక సాంకేతికతలు విద్యార్థుల భవిష్యత్ సవాళ్లకు కీలక పాత్ర పోషిస్తాయని సిఎస్ఐ ఎఐ100కె కన్వీనర్ డాక్టర్ కళ్యాణ్ కుమార్ సర్వేపల్లి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లిలోని బివిఆర్ ఐటి హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ), హైదరాబాద్ చాప్టర్ సహకారంతో సిఎస్ఐ ఎఐ100కె అనే ప్రతిష్టాత్మక అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఎస్ఐ ఎఐ100కె కన్వీనర్, ఇన్ఫోసిస్ సంస్థ డేటా అనలిటిక్స్, ఎఐ అండ్ ఎంఎల్ విభాగం ప్రధాన కన్సల్టెంట్ డాక్టర్ కళ్యాన్ కుమార్ సర్వేపల్లి విచ్చేసి మాట్లాడుతూ ఇన్ఫోసిస్ పరిశ్రమ అనుభవాలను విద్యార్థులకు పంచుకున్నారు. ఎఐ ప్రాధాన్యత, దాని వాస్తవ ప్రపంచ వినియోగాలు, భవిష్యత్‌లో ఎఐ ఆధారిత సాంకేతికతలు పరిశ్రమలపై చూపే ప్రభావాలను ఆయన వివరించారు. వనరుల వ్యక్తిగా పాల్గొన్న దాదా భాషా ఎఐ నేర్చుకునే విధానాలు, అవరసమైన నైపుణ్యాలు మరియు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం ప్రాముఖ్యతపై విద్యార్థులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సిఎస్ఐ హైదరాబాద్ ఇమిడియేట్ పాస్ట్ చైర్మన్ సి. సుధాకర్ పరిశ్రమవిద్యా సంస్థల మధ్య సమన్వయం ఎంత అవసరమో వివరిస్తూ, విద్యార్థులు తమ విద్యా దశలోనే పరిశ్రమ కు సిద్ధంగా మారాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎన్ సునీత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమా లు విద్యార్థులకు కేవలం సాంకేతిక జ్ఞానం మాత్రమే కాకుండా భవిష్యత్ వృత్తి జీవితాని కి అవసరమైన ధృక్పథాన్ని సైతం అందిస్తాయని తెలిపారు. పరిశ్రమ నిపుణుల మార్గనిర్దేశం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అరుణ రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సజావుగా ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఎన్నికలు సజావుగా ఎన్నికలు నిర్వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మేరినాట్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డిస్టిబ్యూషన్ సెంటర్ లను, మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. సమాగ్రిని బ్యాలెట్ పేపర్లను పోలింగ్ బాక్స్‌లను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ,ఉదయం అల్పాహారం,మధ్యాహ్నం భోజనం కల్పించాలని ,విద్యుత్ అంతరాయం లేకుండా 24గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైన లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని,త్రాగునీరు,లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, వచ్చిపోయేదారులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రూట్ల వారీగా బస్సులు బయలుదేరే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తాండూరులో :** మంగళవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని సేంట్ మార్క్స్ జూబ్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సమాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. బుదవారం జరగనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిల పర్యటించి ఎన్నికల సమాగ్రి పంపిణీని పరిశీలించారు. తాండూరు మున్సిపాల్‌లోని 36వార్డులకు గాను 117 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్దంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్స్‌లు, జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని సూచించారు. ఎక్కడ కూడా డబుల్ ఓటింగ్ జరుగకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. రు. కలెక్టర్ వెంట డిఆర్ఓ మంగీలాల్, మున్సిపల్ కమీషనర్ మదుసూధన్‌రెడ్డి, తహసిల్దార్ తారాసింగ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

**అధికారుల తప్పిదంతో పోలింగ్ బూతు తారుమారు**

మున్సిపల్ ఎన్నికల్లో అధికారుల తప్పిదంతో 9వవార్డు బుత్ బుర్గుపల్లిలో ఉండవల్సిన బూత్ , వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గంగారంలో ఏర్పాటు చేశారు. గంగారంలో ఉన్న ఓటర్లు బుర్గుపల్లిలో ఓటు వినియోగించుకోవాలి, 9వందలకు పైగా ఉన్న బుర్గుపల్లి వికారాబాద్‌లోని గంగారంలో ఓటు వినియోగించుకోవాలి, 4వందలకు పైగా ఉన్న ఓటర్లు బుర్గుపల్లిలో ఓటును వినియోగించు కోవాలి అదే విషయంపై అధికారులు,ప్రతిపక్ష పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అది సాధ్యం కాదు అని తెలపడంతో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు. తప్పుచేసిన అధికారులను వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ కలెక్టర్‌తో మాట్లాడిన ఫలితం లేకుండా పోయిందని విమర్శించారు. ఓటు వేయడానికి వృద్ధులకు, తదితరులు ఇబ్బందులు కలుగడం జరుగుతుందన్నారు. ఓటు వేయడానికి ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు.



## కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా జరిగే కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ, దేవాదయ శాఖ కమిషనర్ హరీష్‌తో కలసి ఆలయ ట్రస్టు చైర్మన్ తటాకం వెంకటేష్, ఇఒ సుధాకర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలసి ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించి ఆహ్వాన పత్రికను అందజేశారు.



## చెరువు గట్టు వ్యాపారుల సమస్యను పరిష్కరిస్తా : కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రగతినగర్ చెరువు గట్టు వ్యాపారుల సమస్యను తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రగతినగర్ చెరువు గట్టులో చిరు వ్యాపారులందరు కొలను హన్మంత రెడ్డిని కలిసి సమస్యను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కొలను హన్మంత రెడ్డి మాట్లాడుతూ ప్రగతినగర్ చెరువు గట్టు ప్రాంతంలో చిరు వ్యాపారులను ఇటీవల హైడ్రా అధికారులు ఖాళీ చేయించి ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించిన విషయం తెలిసిందేనని, అయితే అట్టి స్థలంలో కొందరు వ్యక్తులు వివాదాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. ఇట్టి సమస్యను జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ అధికారులతో మాట్లాడి చిరు వ్యాపారులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. పేద కుటుంబాలకు చిరు వ్యాపారమే ఏకైక ఉపాధి మార్గమని, వారి సమస్యను పరిష్కరించడంతో పాటు రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు సైతం ఎంతో అవసరమని చెప్పారు. రెండు అంశాలను సమతుల్యంగా పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని పేర్కొన్నారు.



## శాశ్వత పరిష్కార దిశగా ‘బాక్స్ డ్రైన్’ పనులు : ఎమ్మెల్యే మర్రి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా ఆల్వాల్ డివిజన్‌లో బాక్స్ డ్రైన్ పనులను చేపట్టినట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. దీనివల్ల వర్షాకాలంలో పరిసర కాలనీల్లో ఎక్కడా నీరు నిలబడకుండా ఉంటుందన్నారు. రూ.2.23 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్, సిసి రోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాసరెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్ కల్సి ప్రారంభించారు. వెంకటాపురం లాస్ట్ బస్‌స్టాప్ సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు, ఓల్డ్ వెంకటాపురం, మారుతినగర్ కాలనీల్లో రూ.23 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులు చేపట్టామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించటానికి ప్రాధాన్యత ఇస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనులను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఆల్వాల్ సర్కిల్ డిఇ ప్రశాంతి, ఎఇ అరుణ్, బిఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.




## సత్యసాయి గ్రూప్ పాఠశాలలో ఘనంగా ‘కళా-క్రీడా ఉత్సవం’

**ప్రజాపక్షం/ఉప్పల్ :** సత్యసాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాక్రీడా ఉత్సవం విద్యార్థుల ఉత్సాహం, క్రీడా స్ఫూర్తితో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ అదనపు డిసిపి నర్సింగ్, బిజెపి మల్కాజిగిరి కన్వీనర్ సుధాకర్ హాజరై వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆగమ్మ 7 వ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్ అదనపు డిసిపి నర్సింగ్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకు దూరం కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చదువుపై నిర్లక్ష్యం చూపితే పిల్లలు చెడు అలవాట్లు, వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు.ఈ సందర్భంగా సత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ ద్వారా పాఠశాల నుంచి 450 మంది క్రీడాకారులను, 88 మంది క్యాపిటల్స్‌ను తయారు చేయగలిగామని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ముందుకు రావాలని, క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## పాఠశాలకు ప్రింటర్ అందజేత

**ప్రజాపక్షం/బంట్వారం :** తొర్‌మామిడి గ్రామంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో 202526 విద్యా సంవత్సరంలో పాఠశాలలో 91 మంది విద్యార్థులు అడ్మిషన్లు చేరడంతో తాను అదే పాఠశాలలో చదువుకొని, చదువుకున్న పాఠశాలకే ఉపాధ్యాయురాలుగా వచ్చిన ఎం. సాయికీర్తన పాఠశాలకు ప్రింటర్ ను అందజేశారు. ఉపాధ్యాయురాలు సాయికీర్తన ను అమె తండ్రి లలిత్ కూమార్ ను ఉపాధ్యాయ బృందం ఘనంగా శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా పాఠశాలకు సౌండ్ సిస్టం మరియు రెండు కంప్యూటర్లు దాతలు అందించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు దేవ్యా నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఉమామహేశ్వరి, రేష్మ, రాధ, సుగుణమ్మ, విద్యార్థులు ఉన్నారు.

# టీ20 ప్రపంచ కప్..
# యుఎస్‌ఎపై గెలిచిన పాకిస్థాన్



**కొలంబో:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా యుఎస్ఎతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 32 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో యుఎస్ఎ 158/8 స్కోరుకు పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో శుభమ్ రంజన్ (51; 30 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ శతకం బాదాడు. ఓపెనర్ షాయన్ జహంగీర్ (49; 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. మిలింద్ కుమార్ (29), ఆండ్రీస్ గౌస్ (13) పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో ఉస్మాన్ తారిఖ్ 3, షాదాబ్ ఖాన్ 2, అబ్రార్ అహ్మద్, మహ్మద్ నవాజ్, షాహీన్ అఫ్రిది ఒక్కో వికెట్ పడగొట్టారు. వరుసగా రెండో విజయం అందుకున్న పాక్.. గ్రూప్‌ఏలో అగ్రస్థానానికి చేరింది. తొలుత పాక్ బ్యాటర్లలో ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ (73; 41 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. బాబర్ అజామ్ (46; 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. సైమ్ అయూబ్ (19) పరుగులు చేయగా.. కెప్టెన్ సల్మాన్ అఘా (1) సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగాడు. చివర్లో షాదాబ్ ఖాన్ (30; 12 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. యుఎస్ఎ బౌలర్లలో వాన్ షాల్క్‌విక్ (4/25) ఆకట్టుకున్నాడు. సౌరభ్ నేత్రావల్కర్, మహ్మద్ మోసిన్, హర్మీత్ సింగ్ తలో వికెట్ తీశారు.

## ఇండో–పాక్ మ్యాచ్ జోష్..

### ఒక్కసారిగా పెరిగిన విమాన టికెట్ ఛార్జీలు



**కొలంబో:** టి–20 వరల్డ్ కప్‌లో ఆదివారం భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ ఆ మ్యాచ్‌పై ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే.. కొలంబోకు వెళ్లే విమానాలకు టికెట్ ధరలను అమాంతం పెంచేశారు. ముంబై–కొలంబో మధ్య ఒక్కసారిగా టికెట్ ధరపై పది వేలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన ఈ మ్యాచ్ జరగనున్నది. అయితే తాజా రిపోర్ట్స్ ప్రకారం ముంబై–కొలంబో ముంబై మధ్య విమాన టికెట్ ఛార్జీ రూ.60 వేలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇండో–పాక్ సమరానికి తగ్గ రీతిలో విమాన ఛార్జీలు కూడా పెరిగినట్లు కొన్ని రిపోర్ట్సులు వెల్లడిస్తున్నాయి. ఆన్‌లైన్ బుకింగ్ వివరాల ప్రకారం.. చండీఘడ్ నుంచి కొలంబోకు ఎయిర్ ఇండియా రౌండ్ ట్రిప్ సుమారు రూ.63 వేలు ఉన్నది. ఇక ఇండిగో విమాన ఛార్జీలు సుమారు రూ.70 నుంచి రూ.74 వేలు ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ–కొలంబో మధ్య ఈ తేదీల్లో విమాన ఛార్జీలు రూ.45 వేలుగా ఉన్నట్లు బుకింగ్ డిటేల్స్ ద్వారా స్పష్టమవుతోంది.

# పది వికెట్లతో యుఎఇని ఓడించిన న్యూజిలాండ్!

వరల్డ్ కప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు చేతిలో చావుదెబ్బ తిన్న న్యూజిలాండ్ మెగా టోర్నీలో జూలు విదుల్చుతోంది. తొలిపోరులో అఫ్గనిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన కివీస్.. ఈసారి యుఎఇ భరతం పట్టింది. 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) మంచుముక్కలా కరిగించారు. హైలెట్స్ చూస్తున్నామా? అన్నట్టుగా రెండో ఓవర్ నుంచి దూకుడే మంత్రగా యుఎఇ బౌలర్లపై ఈ ద్వయం విరుచుకుపడింది. అర్ధ శతకాల అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై జాలి, దయ లేకుండా ఆడడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే మట్టికరిపించింది.

టి–20 వరల్డ్ కప్‌లో సంచలనం సృష్టించాలనుకున్న యుఎఇ కలలు కల్లలయ్యాయి. పటిష్టమైన న్యూజిలాండ్‌పై భారీ స్కోర్‌తో విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ జట్టుపై ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) పిడుగల్లే విరుచుకుపడ్డారు. 174 పరుగుల ఛేదనలో నువ్వా నేనా అనట్టు ఇద్దరూ పోటీపడి బౌండరీల పండుగ చేసుకున్నారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ 3 ఫోర్లు, ఒక సిక్సర్తో 20 రన్స్ రాబట్టగా.. పవర్ ప్లేలోనే 80కి చేరువైంది కివీస్. ఈ జోడీని విడదీసేందుకు యుఎఇ సారథి వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. దాంతో.. చూస్తుండగానే లక్ష్యం చిన్నదైపోయింది. రోహిద్ వేసిన 16 వ ఓవర్ రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్గా మలవగా బ్లాక్ క్యాప్స్ 10 వికెట్లతో జయభేరి మోగించింది. వరుసగా రెండో విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్ డీలో అగ్రస్థానానికి ఎగబాకింది.



**వసీం, షరాఫు దంచేయగా...**

చెన్నైలో పటిష్టమైన న్యూజిలాండ్‌లో మొదట యుఎఇ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్ ముహమ్మద్ వసీం(64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టగా.. అలీషన్ షరాఫు(55) హాఫ్ సెంచరీతోచెలరేగాడు. కివీస్ పేస్, స్పిన్ దళాన్ని ఉతికారేసిన ఈ ద్వయం విధ్వంసంతో 15 ఓవర్లకే స్కోర్ 120 దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్(21) దంచేశాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనకున్న ప్రత్యర్థికి షాకిస్తూ మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో యూఏఈ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.

## మహిళ

# 'సైన్స్ అండ్ టెక్నాలజీ'లో వెనుకంజ!

### (నేడు సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం)


నేటి అత్యాధునిక డిజిటల్‌ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్త పుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చివేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్‌టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు, బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగవలసిన ప్రగతి నమోదు కావడం లేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్‌టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేరీ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి బాలికలు, యువతులను సైన్స్ వైపు ఆకర్షించడానికి ఐరాసయూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు, తల్లి తండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు, యువతుల దృష్టిని స్టెమ్ ఎస్‌టిఇఎం సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. సైన్స్‌టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం నిర్వహిస్తున్నారు. 2026 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా 'సైన్స్‌టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి ప్రణాళికలు ప్రభావం చూపడం : స్టెమ్ విద్యలో లింగ అసమానతల తగ్గింపు' అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు.



మేరీ క్యూరీ

1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి. నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్‌టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం. సైన్స్‌టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్‌షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం.

## గుర్తింపు లేని ఆవిష్కరణ





అమెరికాకు చెందిన ఐనైస్ న్యూటన్ ఫుటె 1856లో చేసిన ప్రయోగం, తద్వారా జరిగిన ఆవిష్కరణ చాలాకాలం గుర్తింపునకు నోచుకోలేదు. తర్వాతి కాలంలో ప్రాధాన్యతను సంతరించుకున్నప్పటికీ, ఆవిష్కర్తగా న్యూటన్ ఫుటెకు దక్కాల్సిన గౌరవం లభించలేదు. వివరాల్లోకి వెళితే, వివిధ రకాల ప్రయోగాలు చేయడంలో ఆసక్తి ఉన్న ఫుటె ఒకసారి సాదాసీదా ప్రయోగం చేసింది. ఆమె గాజు గొట్టాల్లో వేరువేరు వాయువులను ఉంచి, సూర్యకాంతిలో వాటి వేడి పెరుగుదలని కొలిచింది. సాధారణ గాలి కంటే, కార్బర్ డైయాక్సైడ్ ($CO_2$), నీటి ఆవిరి ఎక్కువ వేడిని నిల్వ చేయగలగడాన్ని ఆమె గుర్తించింది. ఇవే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌కి కారణమని, ఇది వాతావరణ మార్పులకు దారి తీస్తుందని ఆమె ఆ రోజుల్లోనే వివరించింది. కానీ, 'అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్' సమావేశంలో, ఆమె స్వయంగా తన పరిశోధనను ప్రదర్శించలేకపోయింది. ఆ కాలంలో మహిళలకు అలాంటి అవకాశం లేదు. అందుకే, ఆమె పత్రాన్ని ఒక పురుష శాస్త్రవేత్త చదివాడు, అతను ఫుట్ ప్రస్తావించలేదు. ఫలితంగా పేరు రికార్డుల్లో నమోదు కాలేదు. ఆమె ఈ ప్రయోగం చేసిన మూడు సంవత్సరాల తర్వాత, జాన్ టిండాల్ కూడా అలాంటి ప్రయోగమే చేశాడు. అప్పటి నుంచి అతని పేరు గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌తో జత కలిసింది. ఫుటె పేరు మాత్రం అనామకంగా ఉండియపోయింది. పురుషాధిక్యతకు ఇదొక నిదర్శనం. చాలా సంవత్సరాలు ఫుట్ పేరును అంతా మరచిపోయినా, ఇటీవలి కాలంలో ఆమె పరిశోధనలు బయటపడ్డాయి. దీనితో ఆమెకు గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌ను మొదటిసారి గుర్తించిన శాస్త్రవేత్తగా గుర్తింపు లభించింది. 1819 జులై 17న జన్మించిన ఫుట్ 1888లో తుదిశ్వాస విడిచింది. సెప్టెంబర్ 29 లేదా 30వ తేదీ ఆమె మరణించి ఉంటుందని అంటున్నారు. తేదీ ఖచ్చితంగా నమోదు కాలేదు. చివరికి మరణం తేదీని ఖరారు చేసే విషయంలోనూ ఆమెకు అన్యాయమే జరిగింది.

# సార్వత్రిక సమ్మెకు సన్నద్ధంకండి

## కార్మిక సమ్మెకు మంత్రి మద్దతు



**ప్రజాపక్షం/ధర్మపురి :** కార్మిక సంఘాలు ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి.ముక్రమ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహ కూడలిలో మంగళవారం వివిధ కార్మిక సంఘాల నాయకులతో కలిసి దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులు హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. విద్యుత్ సవరణ చట్టం 2025, విబి జి రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్‌ఐసిలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం ఉపసంహరించాలని పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు 12న ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ హమాలీ కార్మిక సంఘాల నాయకులు ముదుగం రాజలింగం, బడుగు లచ్చయ్య, దూడ గంగయ్య, ముదుసుల సత్తయ్య, రవి, రాజు, మొయినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మిక సంఘాలు పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల రవాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొన్నాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోదాడ బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యుసి గోదాములలో పనిచేస్తున్న హమాలీలతో కలిసి గోదాం మేనేజర్ సంపత్‌కుమార్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాన్ని తిరోగమన వైపు తీసుకువెళ్తుందని, కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కొత్త లేబర్ చట్టాలతో హరిస్తూ, పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నాడని ఆరోపించారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయని, ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు విధిగా సమ్మెలో పాల్గొన్నాలని, ఆటో, ఆర్టీసీ, బ్యాంకింగ్, ఎల్‌ఐసి, ఇండ్రస్టియల్, ఆశా, అంగన్‌వాడీ, ఎఎన్‌ఎంలు పాల్గొంటారని, గ్రామీణ రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కంపాటి నాగయ్య, సైదా, టి.శ్రీను, పాలిక మహేష్, జగ్గాని వెంకన్న, సైదులు, ఉప్పల రమేష్, ఈదుల వెంకన్న పాల్గొన్నారు.

## విజయవంతానికి కార్మిక సంఘాల పిలుపు

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవతం చేయాలని సిపిఐ ఎల్బీనగర్ సమితి పిలుపునిచ్చింది. ఎల్బీనగర్‌లో సమ్మెకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్రచారి పాల్గొని పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాములు గౌడ్, మనసురాబాద్ డివిజన్ కార్యదర్శి కందుల సుధాకర్, మున్సిపల్ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి మద్దిలేటి, నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, మర్రి శోభన్, శీను, సామెల్, వీరస్వామి, బాలరాజు, వెంకట్, చంటి, రమేష్, బొడ్డుపల్లి అశోక్, గూని శోభ, చాందిని, కె.శీను తదితరులు పాల్గొన్నారు.




జడ్చర్ల

**జడ్చర్ల :** 12న జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా జడ్చర్ల పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికులకు దేశవ్యాప్త సమ్మె కరపత్రం ఆవిష్కరించి, సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భాగి కృష్ణయ్య సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, తెలుగు సత్తయ్య, మున్సిపల్ సంఘం జడ్చర్ల పట్టణ నాయకులు, కృష్ణ, మహేష్, అరుణ్ కుమార్, ప్రవీణ్, ఇందిరా, అంజమ్మ, దేవయ్య పాల్గొన్నారు.



నెక్కొండ

**నెక్కొండ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాల నిర్వీర్యత, పెరుగుతున్న ధరలు నిరుద్యోగానికి వ్యతిరేకంగా 12న జరగనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు పిలుపునిచ్చారు. మంగళవారం నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు తోట వెంకన్న, మనుబోతుల యాకాంబరం, తోట రవి, కూస వెంకన్న, తోట మహేందర్, కొమ్ముల చిన్నారి, ఉసిల్ల నర్సయ్య, దాసరి సురేందర్, గోసుల భద్రయ్య, తోట దుర్గయ్య, సంతోష్, మనుబోతుల శ్రీను, సదిరం స్వామి పాల్గొన్నారు.



పెద్దపల్లి

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జెఎసి నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 11 వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్‌లో మడ్డి ఎల్లాగౌడ్, టి.రాజిరెడ్డి, కచ్చకాయల సదానందం, మాదాసు రాంమూర్తి, ఈదునూరి నరేశ్, ఆరెల్లి పోషం, నాయిని శంకర్, గొడిశల నరేష్,నూనె కొంరయ్య, వడ్డెపల్లి శంకర్ పాల్గొన్నారు.

**కొండమల్లేపల్లి;** ఫిబ్రవరి 12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హమాలీలతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించాకార్యక్రమంలో అలమోని మల్లయ్య, వెంకటయ్య, బాలు, రామస్వామి, సోమ్లా, నాను, శంకర్, శ్రీను, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ మండల పరిధిలో భవాని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 12న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎఐటియుసి మేడ్చల్ జిల్ల కార్యదర్శి వి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవాని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బాలాజీ, సంఘం నాయకులు ముసలయ్య, సామేల్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి..హయత్‌నగర్



కొండమల్లేపల్లి..



కుత్బుల్లాపూర్..

# పాండరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

### నివాళులర్పించిన పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** కనగల్ మండలం కురంపల్లి గ్రామానికి చెందిన సిపిఐ కనగల్ మండల సహాయ కార్యదర్శి దోటి పాండరి(74) మంగళవారం నల్లగొండలో తుదిశ్వాస విడిచారు. పాండరీ తండ్రి దోటి అక్కలయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాంకు వ్యతిరేక ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో దున్నేవారికే భూమి నినాదంతో భూస్వామ్య దోపిడీ, రజాకార్ల దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. తల్లి దోటి మల్లమ్మ కూడా భర్తకు తోడుగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ పాండరీ గత ఐదు దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో, ప్రజా సంఘాల ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. సిపిఐ కనగల్ మండల సహాయ కార్యదర్శిగా, గీత పనివారల మండల సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. గ్రామంలో జరిగిన సంఘ వ్యతిరేక ఘర్షణల కేసుల్లో అక్రమంగా ఇరికించిన కేసుల కారణంగా రెండు సంవత్సరాలు జైలుజీవితం గడిపిన పాండరీ, కేసుల నుంచి విముక్తి పొందారు. సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉంటూ, గీత వృత్తి, కొద్దిపాటి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించిన పాండరీకి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.



### నిబద్ధత కలిగిన నాయకుడు

ఉద్యమ వారసత్వంగా వచ్చిన అమరజీవి దోటి పాండరి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి నిబద్ధతతో సిపిఐ బలోపేతానికి పని చేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పాండరి స్వగ్రామమైన కురంపల్లిలో పాండరి మృతదేహానికి ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పాండరి కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం, సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కనగల్ మండల ప్రాంతంలో సిపిఐ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నిరంతరం పాటుపడేవాడని గుర్తుచేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, పబ్బు వీరస్వామి, జిల్లా సహాయకార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, మండల కార్యదర్శి సత్యనారాయణ, శాంతిసంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, న్యాయవాది గుర్రం వెంకట్‌రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, గాదెపాక రమేష్, కస్తాల సర్పంచ్ ఎల్ సత్యనారాయణ, కర్నాటి వెంకటేష్, దశరథతో పార్టీ శ్రేణులు ఉన్నారు.

### బొమ్మగాని ప్రభాకర్ సంతాపం

**హైదరాబాద్ :** కనగల్ మండల సిపిఐ సహాయకార్యదర్శి దోటి పాండరి మృతికి రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాండరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## పల్లె గోపాల్ రెడ్డికి సిపిఐ నివాళులు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో పల్లె గోపాల్ రెడ్డి అకస్మిక మరణంపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవసాయ క్షేత్రంలో గోపాల్ రెడ్డి పార్థివ దేహంపై సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోపాల్ రెడ్డి గ్రామ సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేసేవారని, ఆయన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కురిమిద్దె శ్రీనివాస్, పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చిలివేరు అంజయ్య, పట్టణ కార్యదర్శి, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేశిడి నరేందర్ రెడ్డి, పట్టణ సిపిఐ సహాయ కార్యదర్శులు సింగపంగ మల్లయ్య పాల్గొన్నారు.

## మార్చి నాటికి లక్ష గృహ ప్రవేశాలు

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి విపి గౌతమ్



ప్రజాపక్షం/చిట్యాల: మార్చి నెలాఖరు వరకు రాష్ట్రంలో 1 లక్ష ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేయించి గృహ ప్రవేశాలను గావిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి విపి గౌతమ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేసిన రూ. 5 లక్షల వ్యయం లోపే ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. స్థానిక మేస్త్రీల ద్వారా సాధ్యమైనంతమేర నిర్మాణ ఖర్చు తగ్గించి ఇంటి నిర్మాణం చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ కమిటీలతో సమావేశం నిర్వహించి లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలని స్థానిక సర్పంచ్ కాటం వెంకటేశంకు సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మొత్తంతో పాటుగా ఉపాధి హామీ కింద మంజూరైన ఇండ్ల వివరాలను ఆయ అడిగి తెలుసుకున్నారు. స్లాబ్, రైప్ స్థాయికి వచ్చిన వెంటనే వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి దరఖాస్తు చేయించాలని అధికారులకు గౌతమ్ సూచించారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన కొలతల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వారి వెంట జిల్లా పిడి రాజ్‌కుమార్, ఎంపిడివో జయలక్ష్మి, ఏఈ ప్రీతి, సర్పంచ్ కాటం వెంకటేశం తదితరులున్నారు.

## నిష్పక్షపాతంగా మున్సిపల్ ఎన్నికలు

సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మున్సిపల్ ఎన్నికలను నిస్పక్షపాతంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీ 48 వార్డుల్లో 144 పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఇతర పోలింగ్ ఆఫీసర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో సమన్వయంతో పోలింగ్ ఎవరితోనూ వాగ్వివాదానికి దిగొద్దని ఆయన హితవు చేశా రు. ఎవరైనా ఏమైనా సృష్టించడానికి యత్నిస్తే చట్టపర చర్యలు తీసుకునేందుకు పోలీస్ యంత్రాంగం ఉంటుందని ఆయన అన్నారు. మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు 93,020 ఓటర్లకు 144 పోలింగ్ కేంద్రాలు, పీవోలు 144, ఏపీవోలు 144, అదర్ పోలింగ్ ఆఫీసర్లు 432 మంది, రిజర్వ్‌లో 58 మందిని నియమించామని కమీషనర్ జి.శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ, వంశీధర్, మాస్టర్ ట్రైనర్స్ బాలు, కోటయ్యలు ఉన్నారు.

## ఎన్నికల బందోబస్తు విధుల్లో సిబ్బంది అప్రమత్తం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ




ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బంది బందోబస్తు విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ నందు విధుల నిర్వహణపై పోలీసు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసు సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలి, అనుమతి లేని వ్యక్తులను ఓటరు కాని వారిని పరిసరాల్లో రానివ్వొద్దు, 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఓటర్లు సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తెస్తున్నారా అనేదానిపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సిఐలు వెంకటయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్‌బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు, ఐఏఎస్, అదనపు కలెక్టర్ భాస్కర రావు ఐఏఎస్ మరియు భువనగిరి ఆర్డీఓలతో కలిసి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ రామ కృష్ణ మరియు ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ (ఎఫ్‌ఎస్‌సి) ఆర్‌బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల 2026 పోస్టర్లను విడుదల చేశారు.

## సూర్యాపేట జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో

# కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల ముగుస్తుందని తెలిపారు. ఈనెల 11న ఎన్నికల జరుగనున్న సందర్భంగా పోలింగ్ బూతుల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చే సమయంలో గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి అనగా ఓటర్ కార్డు, ఫోటోతో కూడిన పోస్టు ఆఫీసు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాసుపోర్టుతో జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు అలాగే అధికారిక గుర్తింపు కార్డులు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని సూచించారు. ఓటర్లు ఓటు హక్కును నూరు శాతం వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పాటును అందించాలన్నారు. జిల్లాలోని 5 మున్సిపాలిటిల్లో 141 వార్డుల్లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 446 పోలింగ్ అధికారులు, 446 ఏపిఓ, 1340 ఓపిఓలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సజావు నిర్వహణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు నియమించామన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు 10 ఎస్ఎస్‌టి, 15 ఎఫ్ఎస్‌టి, 7 వివిటి, ఏటి 7 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీదారుల వ్యయ నియంత్రణకు 5గురు ఏఇఓలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. 55 మంది మైక్రోఅబ్జర్వార్లను నియమించినట్లు అన్నారు. ఎన్నికల సామాగ్రి పోలింగ్ కేంద్రాలకు, తిరిగి పోలింగ్ కేంద్రాల నుండి స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుకు 46 బస్సులను సిద్ధం చేసినట్లు, పోలీసు ఎస్కార్టుతో బందోబస్తుకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు జనరల్ అబ్జర్వర్ పాండదాస్‌తో కలిసి ఎస్‌వి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వీరి వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ భద్రత

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్‌పి శరత్‌చంద్రపవార్



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, నిస్పక్షపాతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మంగళవారం పట్టణంలో మున్సిపల్ ఎన్నికల డీఆర్సీ పోలీస్ అధికారుల, సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని మున్సిపల్ ఎన్నికల భద్రత ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో చట్టవ్యవస్థ పరిరక్షణే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని, ఉల్లంఘించిన వారిపై ఎలాంటి మినహాయిపు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా సాగేలా పోలీస్ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందన్నారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున సున్నిత ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రత్యేక భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అనుమానస్పద వ్యక్తులు, గుంపులపై కఠిన నిఘా పెట్టాలని, అక్రమ మద్యం, నగదు, ఇతర ప్రలోబాలకు సంబంధించిన చర్యలను అడ్డుకునేందుక ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలింగ్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారిలో విశ్వాసం కలిగింప విధంగా విదులు నిర్వహించాలన్నారు. ఎలాంటి చిన్న సంఘటన జరిగినా ఆలస్యం చేయకుండా వెంటనే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.రమేష్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, పీఎన్‌డీ.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో అత్యుత్తమ ఓటింగ్ శాతం నమోదుకు కృషి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : నేడు జిల్లాలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఓటింగ్ శాతం నమోదుకు ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు. పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా పోలింగ్ సామాగ్రి పంపిణీ, ఎన్నికల అధికారుల కేటాయింపు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి పోలింగ్ సమయంలో అనుసరించాల్సిన విధులను ఆయన అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఆరు మున్సిపాలిటీలలో ఎలక్షన్ ప్రక్రియ సజావుగా సాగుతుందని పేర్కొన్నారు. దాదాపు 2000 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. గ్రామాలలో 100 శాతం ఓటింగ్ నమోదు దిశగా ఓటింగ్లో పాల్గొంటున్నారని పట్టణాలలో ఓటింగ్ శాతం నమోదు తక్కువగా ఉంటుందని నిజమైన ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఉ గం 7 నుంచి సా.5 గంటల వరకు ఓటింగ్ వేయవచ్చని వెల్లడించారు. ఓటింగ్ వేయడానికి వచ్చిన ఓటర్లకు సహాయం అందించడానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోకూడదని సూచించారు. ప్రజాస్వామ్యయుతంగా ఓటర్లు స్వేచ్ఛగా తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోచంపల్లి మున్సిపాలిటీలో 13 వార్డులకు గాను 26 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోచంపల్లి మున్సిపాలిటీలో పురుషులు 7799 మంది, స్త్రీలు 8028 మంది మొత్తం 15827 ఓటర్లు ఓట్లు వేయనున్నట్లు తెలిపారు. పిఓ 26, ఏపిఓ 26, ఓపిఓస్ 52, మొత్తం104. అసిస్టెంట్ సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వరరావు, రాపర్తి భాస్కర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఆయన వెంట ఉన్నారు.



## మత్తుకు బానిసలైతే జీవితం అంధకారం

మాదకద్రవ్యాల చట్టాలు అతి కఠినం: వి. మాధవిలత

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : విద్యార్థులు మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వి. మాధవిలత పిలుపునిచ్చారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (యాదాద్రి భువనగిరి), జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, యాదాద్రి బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'మాదక ద్రవ్య నిషేధ చట్టాలు చెడు ప్రభావాలు' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవిలత మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు శూన్యమవుతాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిషేధ చట్టం (ఎన్‌డిపిఎస్ యాక్ట్) దేశంలో అత్యంత పగడ్బందీగా అమలు అవుతోందని, ఇందులో ప్రతి నేరం తీవ్రమైనదిగా పరిగణించబడుతుందని తెలిపారు. ఎక్సైజ్ ఎస్పీ విష్ణుమూర్తి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ మత్తు పదార్థాల వాడకం సమాజంలో చాపకింద నీరులా విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. .బార్ అసోసియేషన్ యాదాద్రి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీహరి, పెంట రమేష్, మీడియేషన్ న్యాయవాది యం. రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అప్రమత్తంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. చెడు దారి పడితే తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయడమే కాకుండా భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని హితవు పలికారు.
డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బొమ్మ వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన బాధితులందరికీ తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. అవసరమైన వారు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులందరితో న్యాయమూర్తి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు రాధా కృష్ణ, దీపిక, వేణుకుమార్, ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి ఉపేందర్, లెక్చరర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో రూ. 4.50 లక్షలు చోరీ



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: మండలంలోని చౌడంపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు తో పాటు బంగారంను దొంగతనం చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చౌడంపల్లి గ్రామానికి చెందిన బొల్లు వెంకటరెడ్డి తన కుమారుని పెళ్లి ఖర్చులకై రూ.4.50 లక్షల నగదు ఇంట్లోని బీరువాలో పెట్టి కుటుంబ సభ్యులతో తాళం వేసి పని మీద బయటకు వెళ్లి,తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి చూడగా ఇంటి బయట మెయిన్ డోర్ తాళం ని ఇనుప రాడ్డు తో విరగొట్టి ఇంట్లోనే బీరువాలో గల నాలుగు లక్షల 50 వేల రూపాయలు, రెండు తులాల బంగారు నల్లపూసల గొలుసును గుర్తు తెలియని దొంగలు దొంగలించుకుని వెళ్ళినట్లు పోలీసులు తెలిపారు.భాధితుడు బొల్లు వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్ పల్లి ఎస్ ఇ విష్ణు మూర్తి తెలిపారు.దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని సీఐ కే.నాగరాజు,ఎస్ఐ విష్ణు మూర్తి లు పరిశీలించి క్లూస్ టీం తో ఆధారాలను సేకరిస్తున్నారు.

## ఎన్నికల సన్నాహాల పరిశీలన



ప్రజాపక్షం/నందికొండ: మున్సిపాలిటీలో నేడు జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లను సమీంచేందుకు రాష్ట్ర పరిశీలకులు రమేష్ డీఆర్సీ కేంద్రాన్ని సందర్శించారు.ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లు,ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను వారు పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా,ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. పోలింగ్ సిబ్బంది సమన్వయం,స్ట్రాంగ్ రూమ్ భద్రత,లాజిస్టిక్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత ఆయన భోజన ఏర్పాట్లను పరిశీలించి స్వయంగా ఏర్పాటను పరిశీలించారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.ఎన్నికలు సజావుగా జరిగేలా పూర్తి స్థాయి సన్నద్ధతతో పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నల్లగొండ జిల్లాలో ఒక కార్పొరేషన్

# ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు

473 పోలింగ్ కేంద్రాలలో
3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు
ఎన్నికల నిర్వహణకు 2,855 మంది సిబ్బంది
హాలియాలో10 వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం మిగతా
161 వార్డుల్లో 649 మంది అభ్యర్థుల పోటీ
సమస్యాత్మకు 60 పోలింగ్ కేంద్రాలు









ప్రజాపక్షం/నల్లగొండ : జిల్లాలో నేటి ఉదయం నుంచి మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుంది.జిల్లాలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మిర్యాలగూడ, నందికొండ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి.ఈఎన్నికలో మొత్తం 161 వార్డులకు గాను 649 మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ రాజకీయ భవితవ్యాన్ని ఓటర్ల చేతిలో ఉంచారు.ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది.అభ్యర్థుల వారీగా చూస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి 158 మంది,బిఆర్ఎస్ నుంచి 152 మంది, బీజేపీ నుంచి 131 మంది,సీపీఎం నుంచి 10 మంది, సీపీఐ నుంచి ఒకరు,జనసేన నుంచి 12 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.అదనంగా స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు.ఇదిలా ఉండగా హాలియా మున్సిపాలిటీలో పద వ వార్డు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషంగా మారింది.161 వార్డులకు సంబంధించి 473 పోలింగ్ కేంద్రాలలో 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొనున్నారు.ఇందుకుగాను ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు, ఇప్పటికే ఓటర్లు ఓటు వేసేందుకు ఓటరు చీటీలను పంపిణీ చేశారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సవ్యంగా నిర్వహించేందుకు సిబ్బందిని నియమించడంతోపాటు,ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం జరిగింది.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను మొత్తం 475 పోలింగ్ కేంద్రాలలో 20 రిజర్వ్ కలుపుకొని పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేయడం జరిగింది. 571 మంది పీవోలు, 571 మంది ఏపీవోలు,1713 మంది ఓపిఓలు మొత్తం 2855 మంది సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ లో పోలింగ్ విధులను కేటాయించారు.గత మున్సిపల్ ఎన్నికల్లో 79.5 ఓట్లు పోల్ కాగా,ఇటీవలి గ్రామపంచాయతీ ఎన్నికల్లో 89 ఓట్ల పోలయ్యాయని, పోలింగ్ ను పెంచేందుకు గాను అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారు.

**పోలింగ్ సామగ్రి పంపిణీ** : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.మంగళవారం ఆయన జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములో ఏర్పాటుచేసిన మున్సిపల్ కార్పొరేషన్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ రోజున ఉదయం 6:45 గంటలకు ఏజెంట్ల ఎదురుగా బ్యాలెట్ బాక్స్ ను తెరవడం చేయాలన్నారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు స్ట్రైకింగ్ ఫోర్స్ తో పాటు,స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సును, ఇతర పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు.మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 60 పోలింగ్ కేంద్రాలను సమస్యత్మకు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ను దృష్టిలో ఉంచుకొని 400 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ,ప్రస్తుతం పరిస్థితి తమ కంట్రోల్ లో ఉన్నట్లు తెలిపారు.ఎన్నికల సందర్భంగా జిల్లాలో సోమవారం నాలుగన్నర కేజీల సిల్వర్ ను, 120 లీటర్ల ఆల్కహాల్ ను సీజ్ చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు.స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఇతర అధికారులు ఉన్నారు .

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



ప్రజాపక్షం/వెల్దండ : కల్వకుర్తి మున్సిపాలిటీలో జరిగే ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షురాలు వడ్త్యావత్ భాగ్యమ్మపూల్‌సింగ్‌లు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలో నల్లమలప్రాంత ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో మున్సిపాలిటీకి నిధులవరద వస్తుందని, పట్టణప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిసేవచేసే భాగ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంబూలశ్రీకాంత్, శ్రీశైలం, దేశ్యనాయక్, చంద్యానాయక్, పూల్‌సింగ్, రంజిత్‌నాయక్, డాక్యనాయక్ పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే జిల్లాల రద్దు ప్రకటన



ప్రజాపక్షం/వెల్దండ : మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలను పునర్విభజన చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని మండల బిఆర్ఎస్‌పార్టీ యువనాయకులు పోలేఅశోక్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన పార్టీనాయకులతో కలిసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలరద్దు, కొత్త జిల్లాల ఏర్పాటు ఉండదని చెబుతూనే అవసరమైతే అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పడం రెండు నాల్కలధోరణి విధానానికి నిదర్శనమన్నారు. పునర్విభజనలేదని తేల్చేసిన తర్వాత అసెంబ్లీలో చర్చ అవసరం ఏంటని ప్రశ్నించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే జిల్లాల ప్రకటనపై స్పష్టమైన వైఖరినితెలిపి కల్వకుర్తిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సిఎం అస్పష్టమైన ప్రకటనలుచేసి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు.

## ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. ఎన్నికల గుర్తులు పట్టుకొని, ఎవరూ గుంపులు గుంపులుగా తిరగరాదని, ఇట్టి విషయాన్ని గమనించి మున్సిపాలిటీ 12 వార్డులలో పోటీలో ఉన్న కౌన్సిలర్ అభ్యర్థులు గాని, వీరి అనుచరులు గాని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అట్టి వారిపై కేసు నమోదు చేస్తామని ఇతర ప్రాంతాల వారు సొంత ఊర్లకు వెళ్లవలసిందిగా పోలీసులు తెలిపారు.



## ప్రెస్‌క్లబ్ సభ్యులకు సన్మానం

ప్రజాపక్షం/శ్రీరంగాపురం : పత్రికా రంగానికి సేవలందిస్తున్న నూతన ప్రెస్ క్లబ్ ను సాహితీ కళావేదిక కళాకారులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడు అంశాలను ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర అమూల్యమన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాల్గవ స్థంభంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానించడం గర్వకారణమని తెలిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ కళాకారులు, సాహితీవేత్తలు జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా నిలవడం ఆనందకరమన్నారు., భవిష్యత్తులో సమాజహిత కార్యక్రమాల్లో సాహితీ కళావేదికతో కలిసి పనిచేస్తామని తెలిపారు. అనంతరం సాహితీ కళా వేదిక కళాకారులు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో శిలవు నీవే శిల్పివీ నీవే పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కవి జనజ్వాల,సినారె అవార్డు గ్రహీత సత్తార్, వాక్యత బైరోజు చంద్రశేఖర్, బాలస్వామి, స్వామి, రాములు, ఉప సర్పంచ్ కళ్యాణికారి ఖాజా, మాజీ వార్డు సభ్యులు సంపత్ నాయుడు, జర్నలిస్టులు రంగస్వామి నాయులు, వేణుగోపాల్, కిట్టు స్వామి, శివసాగర్, నరేష్ గౌడ్, హరీష్ గౌడ్, నారాయణ, పెండెం నరేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా మండలకేంద్రంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపిపి ప్రధాన అనుచరులు బోల్గంబాల్‌రాజు, బోల్గం నవీన్ మంగళవారం మాజీ ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీసర్పంచ్ పగిడాల చిన్నయ్య, సర్పంచ్ లోకినేని లక్ష్మణరావు, రాకేష్, ఇంద్రకంటి వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.

# తెలంగాణలోనే అగ్రగామిగా మహబూబ్‌నగర్

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామినా నిలబెడతానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మహబూబ్ నగర్ పట్టణంలోని తూర్పు కమాన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, సిఎంఆర్ మీదుగా గడియారం చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించగా, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మెట్టుగడ్డ, ఆసుపత్రి ప్రాంతం న్యూటౌన్ మీదుగా గడియారం చౌరస్తా చేరుకున్నారు. అనంతరం గడియారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీకి అధికారం ఇస్తే ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి నీళ్లపాలు చేశారని, కానీ లక్ష రూపాయలు ఖర్చు చేసి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కూర్చోవడానికి బెంచీలు ఇవ్వలేదని, కనీసం ఆడపిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మాంచలేకపోయారని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి మహబూబ్‌నగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిండమే కాకుండా, మన మహబూబ్‌నగర్ పిల్లలు ఇక్కడే ఉన్నత చదువులు చదువుకోవాలని ఐఐఐటి కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలతో పాటుగాలా కళాశాలను ముఖ్యమంత్రి ఆశీస్సులతో తెచ్చామని ఆయన చెప్పారు. ప్రతి కాలనీలో సిసి రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, మల్టీపర్పస్ షెడ్లు నిర్మించామని, మన మహబూబ్ నగర్ ప్రజల ఆకాంక్ష అయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ రూ.603కోట్లతో నిర్మించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి తన స్వహస్తాలతో శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, కంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హన్మంతరావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ఉపాధ్యక్షులు ఉన్నారు.

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల కలెక్టర్ విజయేందిర బోయి సందర్శన



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో, భూత్పూర్‌లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, దేవరకద్రలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్‌లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్వో, స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్.డి.ఓ. నవీన్, మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు సజావుగా ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా బుధవారం జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటిల్లో ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికతో జిల్లాయంత్రాంగం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందన్నారు. మూడు మున్సిపాలిటిల్లోని 65వార్డులకుగాను మొత్తం 243 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకోసం 629మంది పిఓలు, ఓపిఓలతోపాటు వివిధ బాధ్యతలతో 2వేలమందికిపైగా ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. మూడువిడతల ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు పూర్తయ్యిందని పేర్కొన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు , స్టేజ్2 రిటర్నింగ్ అధికారులకు మూడువిడతలలో శిక్షణ అందించామని, పోలింగ్ కేంద్రాల్లో సిటింగ్ ఏర్పాట్లు, సీక్రేట్ ఓటింగ్ కంపార్టుమెంట్లు నిబంధనల ప్రకారం ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటిలకు సంబంధించి 131మంది పిఓలు, ఓపివోలు, రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

**మున్సిపాలిటిలు పోలింగ్ మండలాలవారిగా ఓటర్ల వివరాలు :**
నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి పరిధిలో 24వార్డులు, 49 పోలింగ్‌కేంద్రాలు పురుష ఓటర్లు 17,460, మహిళా ఓటర్లు 17,918 మొత్తం 35,918 , కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని 22వార్డులు, 44 పోలింగ్‌కేంద్రాలు. పురుష ఓటర్లు 12,981, మహిళా ఓటర్లు 13,053 మొత్తం 26,034, కొల్లాపూర్ మున్సిపాలిటిపరిధిలో 19వార్డులు, 38 పోలింగ్ కేంద్రాలు, పురుష ఓటర్లు 9663, మహిళా ఓటర్లు 9807 మొత్తం 19470 ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాపరిధిలోని మూడు మున్సిపాలిటిల్లో బుధవారం జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 80,882మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వీరిలో 40,104మంది పురుష ఓటర్లు, 40,778మంది మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకోసం 35మంది మైక్రో అబ్జర్వర్లను నియమించి, ప్రతిపోలింగ్‌కేంద్రంలో వెబ్‌క్యాస్టింగ్ ప్రక్రియను అమలుచేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

## ముగ్గురు క్రీడాకారులు అండర్ 17 రాష్ట్రస్థాయికి ఎంపిక





ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని డివైస్ ఓ శెట్టి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బి.మనీవర్థన్ తండ్రి అంజన్ కుమార్ మక్తల్, అర్ఫాన్, అనిల్ ఎంపిక కావడం జిల్లాకే గర్వకారమని ఆయన అన్నారు. అండర్ 17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మక్తల్ కి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపినట్లు ఆయన తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాటు

### వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరావు



ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి జిల్లా పరిధిలో జరుగుతున్న వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం రోజు జిల్లా కేంద్రంలోని ఆర్‌జి ఫంక్షన్ హాలులో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా క్రమశిక్షణతో పనిచేయాలని డీఎస్పీ ఆదేశించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు చేరుకుని, ఓటర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధించబడిందని, అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనిస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పికెటింగ్ , స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామాగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం అనుమతించబడదని స్పష్టం చేశారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలని ఎన్నికల సమయంలో ఉద్రిక్తత సృష్టించడం, గుంపులు గుమికూడడం, ఓటర్లపై ఒత్తిడి చేయడం వంటి చర్యలు జరిగితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం, డబ్బుల పంపిణీ చేసినా, ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగించిన ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇతర ప్రసార మాధ్యమాలలో వ్యక్తులను గాని, రాజకీయ పార్టీలను గాని కించపరిచేలా తప్పుడు ప్రచారాలు చేసినా అట్టి వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్ ఎన్నికల విధులకు వెళుతున్న అధికారులు ఎస్సైలు మహిళా కానిస్టేబుళ్ళు, హోంగార్డు సిబ్బంది ఉన్నారు.

# పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి



ప్రజాపక్షం/గద్వాల రూరల్ : మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు అధికారులు, ఇతర సిబ్బంది పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ తెలిపారు. గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గద్వాల మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని 77 వార్డుల్లో 189 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అధికారులకు సహకరించేందుకు రిటర్నింగ్, జోనల్ అధికారులు, మున్సిపల్, పోలీస్ యంత్రాంగం ఇతర సిబ్బంది కలిసి సుమారు 2000 మంది విధులు నిర్వర్తిస్తున్నారన్నారన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలోనే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియను ఏర్పాటు చేసిన నాలుగు హాల్స్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎస్పీ మొగిలయ్య, మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ మల్లికార్జున్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కష్టపడి చదవాలి

### ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### ఐఓబీ బ్యాంక్ మేనేజర్ రఘునందన్ గుప్తా

ప్రజాపక్షం/వీపనగండ్ల : విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణను అలవర్చుకొని, కష్టపడి చదువుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్య నేర్పిన గురువులకు, కన్న తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) మేనేజర్ రఘునందన్ గుప్తా పిలుపునిచ్చారు. బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని తూముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని, చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా ఉన్నత స్థాయికి చేరిన అనేక మంది ఉన్నారని గుర్తు చేశారు. సమాజాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని, సేవాభావంతోనే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు పలుస రామన్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలి

### ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్

### మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మంగళవారం రోజు శ్రేయ అపార్ట్‌మెంట్లో మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.తిరుమలరెడ్డి అధ్యక్షతను జరిగింది. దీనికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వి.రాజేశ్వర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కలమంద రామదాసు, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.కిష్టయ్య, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.విజయవర్ధన్‌రాజు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవికుమార్,బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, సిఐటియు సీనియర్ నాయకులు కిళ్ళే గోపాల్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కమరలి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, తెలంగాణ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రమాదకరమైన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రదు చేయాలని, ఉపాధి కూలీలకు వరమైన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యపరిచే విబిజీ రాంజీ చట్టాన్ని ఉపసంహరించాలని, ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ పెట్టుబడులను 100 % ఆహ్వానించడం నిలిపివేయాలని, రైతాంగానికి వ్యతిరేకమైన మోటార్లకు మీటర్లు పెట్టే విద్యుత్తు చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని, విదేశీ బహుళ జాతి కంపెనీలకు లాభాలు చేకూర్చే, రైతులను దివాలా తీసే రైతులను దివాలా తీసే రైతు విత్తన సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, బ్యాంకులను కుదించే ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీయ అపార్ట్మెంట్లో మధ్యతరగతి ఉద్యోగుల రౌండ్ టేండ్ సమావేశం పలు తీర్మానాలు చేసింది, 12వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి మహా ప్రదర్శన జరుగుతుందని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ప్రజాతంత్ర వాదులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో కర్ణాకర్ గౌడ్, శ్రీనివాసులు, ప్రశాంత్, సత్యనారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కురుమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల మున్సిపాలిటీ పాత బజార్‌కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కురుమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలై చికిత్స పొందిన విషయం తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యుడు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేడు వారి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా కురుమూర్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, త్వరలో పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన అన్నివిధాల సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

> రాజశ్యామల బ్యానర్‌పై సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో మధు కాలిపు నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం మహేంద్రగిరి వారాహి. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశాన్ని ఆధారంగా చేసుకుని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

రీల్

# శివ, మిత్రతో యాక్టింగ్ వెరీ ఇంట్రెస్టింగ్

## ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో హీరో సంతోష్ శోభన్



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొ మాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటై న్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాను ప్యాషనేట్ ప్రొ డ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా టై టిల్ మార్చమని సెన్సార్ వారు అడిగారు. హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా ట్రైలర్ రిలీజ్ అయ్యాక చాలా పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది. సంతోష్ శోభన్ ఈ మూవీ కో సం పడిన కష్టం మీకు మూవీలో కనిపిస్తుంది. ధీరజ్ గారు మా టీమ్ లోకి వచ్చాక చాలా ఎనర్జీ వచ్చింది. హీరో సం తోష్ శోభన్ మాట్లాడుతూ 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీకి ప్రతి ఒక్కరూ తమ సపోర్ట్ అ ందిస్తున్నారు. రీసెంట్ గా మేము చేసిన ప్రమోషనల్ టూర్ కు మ ంచి రెస్పాన్స్ వచ్చింది. నాకు సక్సెస్ రావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారన్నారు.

# అనిల్ రావిపూడి శిష్యుడు డైరెక్టర్‌గా ' హై '



అనిల్ రావిపూడి దగ్గర అసోసియేషన్ గా పని చేసి అతని చిత్రాలకు సహ రచయితగా పని చేసిన ఎస్ కృష్ణ 'హై' అనే సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రచయిత, నటుడు , సహ నిర్మాతగా కూడా పనిచేస్తున్నారు. ఇమేజ్ స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ పై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనన్య శర్మ, ఎస్ కృష్ణ, పల్లవి దొర, కృష్ణ కమల్, సాయి కృష్ణ, రేవంత్ (బుల్లిరాజు) ఈ చిత్రంలో ప్రధాన తారాగణం. ఈ చిత్ర టీజర్‌ను హీరో వెంకటేష్ లాంచ్ చేశారు.టీజర్ లాంచ్ ఈవెంట్ లో అనిల్ రావిపూడి మాట్లాడుతూసాయి ఈ సిని మా కోసం చాలా కష్టపడ్డాడు. నా సినిమాలకు పనిచేస్తూ గ్యాప్ లో ఈ షూటింగ్ చేసేవాడు. ఒక బెస్ట్ ఫ్రెండ్ గా నా విషెస్ ఎప్పుడు తనకు ఉంటాయి. తను మంచి టెక్నీషియన్ గా ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీలో ఉండాలని కోరుకుంటున్నాను. తను యాక్టర్‌గా కూడా సక్సెస్‌ఫుల్ అ య్యా డు. మంచి జడ్జిమెంట్ ఉన్న టె క్నీషియన్. ఒక కొత్త జానర్ లో డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో తీసిన సినిమా ఇది. సినిమా డబుల్ పాజిటివ్ చూశాను. ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ స్క్రిప్ట్ విషయంలో సినిమా విషయంలో అనిల్ తో ఫైట్ చేసే కెపాసిటీ ఉన్న వ్యక్తి సాయి. ఇంత మందిని ఇంట్రడ్యూస్ చేయడం అనేది రియల్లీ హాట్సాఫ్. ఈ సినిమా అందరికీ హై రావాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ యాక్టర్ రైటర్ ప్రొడ్యూసర్ నాలుగు పాత్రలతో పరిచయం అవుతున్న సాయికి మరోసారి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ప్రొడ్యూసర్ సురేష్ బాబు మాట్లాడుతూ అనిల్ రియల్ ట్రూ ఫ్రెండ్స్. వెంకటేష్ తో సినిమా చేస్తున్నప్పుడు వాళ్ళ వర్కింగ్ స్టైల్ చూశాను. సాయి చాలా పాషన్ పర్సన్. యాక్టర్ డైరెక్టర్ ప్రొడ్యూసర్ ఎస్ కృష్ణ మాట్లాడుతూఈ సినిమా చూసే వాళ్ళకి మంచి హై ఇస్తుంది ఇందులో పనిచేసిన ప్రతి ఆర్టిస్ట్ వాళ్ళ కెరీర్‌లో రెండేళ్లు నాకు ఇచ్చారు. ఈ సినిమా తీయడానికి నాకు రెండేళ్లు పట్టింది. వికాస్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. టీజర్ చూస్తున్నప్పుడు చాలా ఆన ందంగా అనిపించింది. ఒక డిఫరెంట్ స్క్రీన్ ప్లే తో ఇంట్రెస్టింగ్ గా ఉండే మూవీ ఇది. ఈ సినిమాలో పనిచేసిన ఆర్టిస్టులు అందరికీ ఈ సినిమా మంచి ఫలితాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. నిర్మాత హరీష్ పెద్ది కూడా పాల్గొన్నారు.

# 'నువ్వేలే' సాంగ్స్ లాంఛ్



అదోనై పిక్చర్స్ క్రియేషన్స్ సమర్పణలో ప్రముఖ కొరియో గ్రాఫర్ సత్య మాస్టర్ దర్శకత్వంలో అంకిత జాదవ్, రోహిత్ భోగ హీరో హీరోయిన్స్ గా నటించిన నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పేరుతో రెండు సాంగ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ పాటలకు కెకె రెడ్డి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. జయంత్ ఆర్యన్ సంగీతాన్ని సమకూర్చిన 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పాటలకు రాంబాబు గోసాల సాహిత్యాన్ని అందించారు. సింగర్స్ లిప్సిక, అదితి భావరాజు పాడారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సాయి రాజేశ్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, ఆషురెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్, డైరెక్టర్ సత్య మాస్టర్ మాట్లాడుతూ నేను ఒక ఈవెంట్ కోసం యూఎస్‌కు వెళ్లినప్పుడు ప్రొడ్యూసర్ కేకే రెడ్డితో పరిచయం ఏర్పడింది. అప్పటికే ఈ సాంగ్స్ హిందీ వెర్షన్ రెడీగా ఉన్నాయి. తెలుగులో చేయాలనే ఆలోచనను వారు నాతో షేర్ చేసుకున్నారు. అలా 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' సాంగ్స్ ను తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం ప్రారంభించాం. నిర్మాత కేకే రెడ్డి మాట్లాడుతూ మా 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' సాంగ్స్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. హీరోయిన్ అంకిత జాదవ్ మాట్లాడుతూ నేను బాలీవుడ్ నుంచి వచ్చాను. అక్కడ మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తుంటాను. నేను చేసిన బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ ఇది. 'నువ్వే ఉండిపో ఇలా', 'నువ్వేలే' పాటలను న్యూయార్క్, చికాగోలో షూటింగ్ చేశాం. సత్య మాస్టర్ డైరెక్షన్ లో ఈ సాంగ్స్ చేయడం సంతోషంగా ఉంది. మ్యూజిక్ డైరెక్టర్ జయంత్ ఆర్యన్ మాట్లాడుతూ ఈ సాంగ్స్ ను మేము హిందీలో చేశాం అన్నారు. నటి ఆషురెడ్డి లిరిసిస్ట్ రాంబాబు గోసాల, సింగర్ లిప్సిక, డైరెక్టర్ సాయి రాజేశ్, డైరెక్టర్ శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పాల్గొన్నారు.

# 'శివోహం' పాటలో తనికెళ్ల భరణి



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాశివుడిని పూజిస్తూ రూపొందిన 'శివోహం' పాట ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో ఘనంగా జరిగింది. ఈ పాటను ప్రొడ్యూసర్ సమర్పణలో పొత్తపు కేశవరెడ్డి నిర్మించారు. దాములూరి దర్శకత్వం వహించారు. యశోకృష్ణ సంగీతాన్ని అందించిన శివోహం పాటను ప్రసిద్ధ మలయాళ గాయకుడు మధు బాలకృష్ణన్ పాడారు. ఈ పాట తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కీర్తన టీవీలో అందుబాటులో ఉండనుంది. శివోహం పాట ఆవిష్కరణ కార్యక్రమానికి శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు, విద్యాశంకర భారతీ మహాస్వామివారు, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, నటుడు గౌతమ్ రాజు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు యశోకృష్ణ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శివోహం పాటను విడుదల చేయడం, ఈ పాటకు సంగీతాన్ని అందించే అదృష్టం నాకు దక్కింది. ప్రముఖ నటులు తనికెళ్ల భరణి మాట్లాడుతూ నేను పాతికేళ్ల క్రితం ఆటగదరా శివ అనే పుస్తకం రాశాను. అప్పటి నుంచి ఎక్కడ మహాశివుడి గురించి కార్యక్రమం జరిగినా నన్ను అతిథిగా పిలుస్తున్నారు. శివోహం పాటలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ పాటను ఈషా ఫౌండేషన్ ప్రాంగణంలో చిత్రీకరించే అవకాశం కలిగింది. ఈషా శైలితో మాట్లాడి నేనే పర్మిషన్ ఇప్పించాను. యశోకృష్ణ బాగా కంపోజ్ చేశారు. ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ నాతో శివ పాట రాయించిన వారు తనికెళ్ల భరణి. ఆయన ప్రోత్సాహం లేకుంటే నేను ఇండస్ట్రీకి రాకపోయేవాడిని. ఆయన సమక్షంలో, శంకరభారతి స్వామివారి సమక్షంలో శివోహం పాట ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది. అర్ధనారీశ్వరుడిలా మనకు శివుడు ఎందుకు దర్శనమిస్తాడంటే భార్య భర్త ఎలా కలిసి ఉండాలో చెప్పేందుకు. ఇలాంటి గొప్ప సందేశం శివుడు మనకు అందిస్తాడు. ఈ పాట నేను రాసిన తర్వాత యశోకృష్ణ స్వరపర్చాడు. ఇలాంటి ఒక మంచి భక్తి గీతాన్ని మీరంతా విని ఆనందించాలని కోరుకుంటున్నా. అన్నారు.

# 'గాయపడ్డ సింహం'టైటిల్‌కు ఫిదా



డిఫరెంట్ ఎంటర్టైనర్స్ తో అలరిస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి మరో యూనిక్ మూవీతో రాబోతున్నారు. 'గాయపడ్డ సింహం' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియావర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ నిర్మించారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఆసక్తికరమైన టైటిల్ పోస్టర్‌తో ఫన్ ఫిల్డ్ టీజర్ విడుదల చేశారు. చిన్నప్పటి నుండి అమెరికాకు వెళ్లాలని కలలు కనే ఒక యువకుడి కథ ఇది. అతని కోరిక చివరికి నెరవేరుతుంది, ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్తాడు. కానీ అతని ఆనందం ఎక్కువ కాలం నిలవదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అకస్మాత్తుగా అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డిపోర్టేషన్ ఆపరేషన్‌ను ప్రకటిస్తాడు. ఈ కష్టాన్ని హీరో ఎలా ఎదుర్కొంటాడు, మనుగడ కోసం ఎలా పోరాడతాడు అనేది కథ ప్రధానాంశం. తరుణ్ భాస్కర్ తన కామెడీ టైమింగ్ అలరించారు. ఫరియా అబ్దుల్లా,శుభలేఖ సుధాకర్ కథను కేజీఎఫ్ తరహాలో వివరించ నవ్వులని పంచింది. మానస చౌదరి తరుణ్ లవర్ పాత్రలో నటిస్తుంది. విష్ణు ఓయ్ అతని స్నేహితుడిగా కనిపించారు. విద్యా సాగర్ చింత సినిమాటోగ్రఫీ, స్వీకర్ అగస్తి సంగీతం సినిమా మూడ్‌ను అద్భుతంగా ఎలివేట్ చేశాయి. విప్లవ్ నైషధం ఎడిటర్, చంద్రిక గొర్రెపాటి ప్రొడక్షన్ డిజైనర్, కథను సూర్య ప్రకాష్ జ్యోసుల రాశారు. ఈ సినిమా వేసవిలో సినిమా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ లాంచ్ సందర్భంగా హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. కొంతమందికి అమెరికా వెళ్లాలని లక్ష్యం ఉంటుంది. ఆ యూనిక్ ట్రీట్మెంట్ కి ఫిదా అయిపోయాను. ఆడియన్స్ కూడా ఫిదా అవుతారని నమ్మకం ఉంది.కశ్యప్ చాలా యూనిక్ వాయిస్ ఉన్న డైరెక్టర్. తన సెన్సాఫ్ హ్యూమర్ చాలా యూనిక్‌గా ఉంటుంది. తనకి ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది. స్క్రీన్ లో చూసినప్పుడు నవ్వుతూనే ఉంటారు. హీరోయిన్ ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. సినిమాని ఒక ఆడియన్ గా విన్నాను. చాలా ఫన్నీగా ఉంటుంది. చాలా అద్భుతమైన కథ ఇది. డైరెక్టర్ చాలా చక్కగా తీశారు. తరుణ్ తో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా ఈ సినిమా మీరందరూ ఎంజాయ్ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కశ్యప్, నిర్మాత విజయ్ కృష్ణ , సహ నిర్మాత భాను కిరణ్ పాల్గొన్నారు.

# సిఎంకు బండి సంజయ్ బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పదవీ విరమణ చేసినా ప్రయోజనాలు అందక 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని, వారి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. వెంటనే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకపోతే హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేస్తానని బండి సంజయ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# నెట్‌వర్క్ ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారించుకోవాలని భాటికి సుప్రీంకోర్టు సూచించింది. సీనియర్ న్యాయవాది అపర్ణ భట్ మాట్లాడుతూ కేంద్రం చొరవ తీసుకుని అన్ని రాష్ట్రాలకు డేటాను అందించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అనేక రాష్ట్రాలలో జాడ తెలియకుండా పెరిగిపోతున్న పిల్లల సంఖ్యను ఎత్తిచూపుతూ ఒక ఎన్‌జిఒ 'గురియా స్వయం సేవి సంస్థాన్' దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తప్పిపోయిన పిల్లలకు సంబంధించి ఆరు సంవత్సరాలకు సంబంధిత జాతీయస్థాయి డేటాను సమర్పించాలని డిసెంబరు 9న అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. అలాంటి డేటాను సంకలనం చేయడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సమర్థవంతంగా సమన్వయం చేసుకునేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక అంకితభావంతో కూడిన అధికారిని నియమించాలని కోరింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి అంకితభావంతో కూడిన నోడల్ అధికారులను నియమించడం, దానికి సంబంధించిన వివరాలను మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న పోర్టల్‌లో తక్షణమే అప్‌లోడ్ చేయాలని గతంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దేశంలో ప్రతీ 8 నిమిషాల వ్యవధిలో ఒక చిన్నారి అదృశ్యం అవుతుందని గత ఏడాది నవంబరు 18న వచ్చిన వార్తలపై అత్యున్నత న్యాయస్థానం తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసిందని, దానిని తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. దేశంలో ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, దీనిపై ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది. దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాలలో తప్పిపోయిన పిల్లలను గుర్తించే పనిని అప్పగించిన అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని ధర్మాసనం ఎత్తిచూపింది. ఈ పోర్టల్‌లో ప్రతీ రాష్ట్రం నుంచి ఒక అధికారిని నియమించి సమాచారాన్ని వ్యాప్తి చేయడంతో పాటు, తప్పిపోయిన పిల్లల కేసుల ఫిర్యాదులను పరిష్కరించగలరని పేర్కొంది. గత ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో మైనర్ బాలురు, బాలికలను కిడ్నాప్ చేసి వారిని మధ్యవర్తుల నెట్‌వర్క్ ద్వారా జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేశారని ఆరోపిస్తూ ఐదు కేసులు నమోదు అయ్యాయని పిటిషన్ వివరించింది.

# బొటానికల్ గార్డెన్‌లో 'ఉచిత లైబ్రరీ', స్టోరీ బోర్డ్ ప్రారంభం

## అటవీ శాఖ సేవలపై అవగాహన పెంపొందించే వినూత్న ప్రయత్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరవాసులకు ప్రకృతి ఒడిలో విజ్ఞానాన్ని అందించడంతో పాటు, అటవీ సంరక్షణలో అటవీ శాఖ చేస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మంగళవారం కొండాపూర్‌లోని హైదరాబాద్ బొటానికల్ గార్డెన్‌లో 'ఉచిత లైబ్రరీ'తో పాటు 'ది లెసర్ నోన్ ఖాకీ' పేరుతో ప్రత్యేక స్టోరీ బోర్డ్‌ను తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, వైస్ చైర్మ, మేనేజింగ్ డైరెక్టర్ సునీత ఎం.భగవత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ, ప్రజలకు అటవీ శాఖకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అన్నారు. బొటానికల్ గార్డెన్‌ను కేవలం సందర్శక కేంద్రంగా కాకుండా, ఒక విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎకో టూరిజం) ఎల్.రంజిత్ నాయక్, సిజిఎం డి. వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ డాక్టర్ జి.స్కైలాబ్, సీనియర్ డివిజనల్ మేనేజర్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎకో టూరిజం) శిరీష, ఫైనాన్షియల్ కంట్రోలర్ కిరణ్ కుమార్, పిఎం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

# క్యూబాలో చమురు సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

నుండి క్యూబాకు సబ్సిడీ ధరలపై చమురు రవాణా అయ్యేది. కానీ జనవరి మొదటివారంలో వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆయన సతీమణిని కిడ్నాప్‌చేసి న్యూయార్క్ జై లులో బంధించిన ట్రంప్ బెదిరించి వెనిజులాలో తనకు విధేయంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో క్యూబాకు చమురు రవాణా నిలిచిపోయింది. మొన్నటివరకూ మెక్సికో కూడా సానుభూతితో చమురు రవాణా చేస్తోంది. మెక్సికో, రష్యా దేశాలు సరఫనా చేస్తున్న చమురు క్యూబా అవసరాలకు సరిపోవడంలేదు. క్యూబాకు రోజుకు 70వేల బ్యారల్స్ చమురు అవసరం అవుతుంది. 'ట్రంప్‌కు ఇష్టం లేకపోతే క్యూబాతో వ్యాపారం చేయడం మానేయాలి, క్యూబాపై ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు లేదు, క్యూబా సార్వభౌమాధికారాన్ని ట్రంప్ ఉల్లంఘిస్తున్నారు, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు, క్యూబాపై అక్రమంగా ఆంక్షలు విధించారు' అని విశ్లేషకులు మండిపడుతున్నారు. క్యూబాను లొంగదీసుకుని అమెరికాను అనుకూలంగా మార్చుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారు. క్యూబా తమతో చర్చలకు రావాలని ఆయన షరతు విధించారు. దీనికి క్యూబా కూడా సానుకూలంగా స్పందించింది. న్యాయబద్ధమైన, పరస్పర మర్యాదపూర్వకమైన, పరస్పర సమాన గౌరవంతో కూడిన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని కొద్దిరోజుల క్రితం క్యూబాప్రకటించింది.

## సంక్లిష్ట దశలో క్యూబా... కానీ ఒంటరి కాదు : కానెల్

క్యూబా సంక్లిష్ట దశలో ఉందని రిపబ్లిక్ ఆఫ్ క్యూబా అధ్యక్షుడు, కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమి టీ మొదటి ప్రధాన కార్యదర్శి మిగ్యుల్ డియాజ్–కానెల్ బెర్ముడెజ్ అన్నారు. దేశంలో చమురు సంక్షోభం ముదడంతో ఆయన ఈనెల ఆరో తేదీన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, వెనిజులా చుట్టూ అమెరికా నౌకలను మోహరించి రాకపోకలను నిలిపివేసిన తర్వాత నుండి క్యూబాలో చమురు సంక్షోభం ప్రారంభమైందన్నారు. క్యూబాపై అపవాదులు, విద్వేష ప్రచారం, మానసిక యు ద్ధం, తీవ్రమైన మీడియా ప్రచారంతో దేశ ప్రజల్లో ఆందోళనలు నెలకున్నాయన్నారు. ప్రజలు సమైక్యంగా ఉన్నారని, ఇంధన సమస్య పరిష్కారానికి మంత్రిమండలి తీవ్రంగా మార్గాన్వేషణకు ఆలోచిస్తోందన్నారు. 67 సంవత్సరాల క్యూబా విప్లవ జీ వితంలో అనేక తరాలు అమెరికా విధించిన ఆంక్షల మధ్యే జన్మించారని, ఆ ఆంక్షల్లోనే వారి జీవితాలు కొనసాగుతున్నాయని, ఇంత సుదీర్ఘంగా ప్రపంచంలో ఏ దేశంపైనా ఆంక్షలను ఎవరూ అమలు చేయలేదన్నారు. 'మేం కష్ట సమయాన్ని అనుభవించబోతున్నాం, గతంలో కూడా అనుభవించాం, ముఖ్యంగా క్యూబా స్త్రీలు, పురుషులూ సృజనాత్మకమైన ప్రతిఘటనతో ఈ కష్ట సమయాన్ని అధిగమించబోతున్నాం' అన్నారు. ఛావెజ్ బొలివేరియన్ విప్లవానికి నాయకత్వం వహించినప్పటి నుండీ గడచిన పాతిక సంవత్సరాలుగా రెండు దేశాలమధ్యా సహకారం వృద్ధి చెందింది, ఈ సహకాన్ని రెండు దేశాలు సద్వినియోగం చేసుకున్నాయి, వెనిజులాతో సంబంధాన్ని ఆ దేశంపై ఆధారపడటంగా వర్గీకరించలేం, అలా చెబితే ''వారు'' వస్తు సేవల మార్పిడిని మరింత తగ్గించే ప్రయత్నం చేస్తారు, ఆహారం, ఇంధనం, కేడర్ శిక్షణ, సాంస్కృతిక రంగాల మార్పిడి, ఉన్నతవిద్య, మైనింగ్, పరిశ్రమలు వంటి అనేక అంశాల్లో రెండు దేశాలమధ్యా సంబంధాలు కొనసాగుతున్నాయి, కానీ వెనిజులాను చుట్టుముట్టిన తర్వాత క్యూబాపై ఆంక్షలు విధిస్తూ, టారిఫ్ బెదిరింపులు చేస్తూ ఇటీవల ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు జారీ చేసింది, చైనా, రష్యా నాయకులు సహా అనేక దేశాల నాయకులతో టెలిఫోన్ సంభాషణలు చేశాం, క్యూబాకు మార్గాలన్నీ తెరచుకునే ఉన్నాయి, క్యూబా ఒంటరి దేశం కాదు'' అని కానెల్ చెప్పారు.

# ఆశ్రయించిన సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)


చర్యలకు బాధ్యుణ్ణి చేసేందుకు, ముఖ్యమంత్రి ప్రవర్తనపై స్వతంత్రంగా, నిష్పాక్షకంగా దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టుకు పార్టీ విజ్ఞప్తి చేసింది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా న్యాయపరంగా ఉన్న నిర్దేశిత చట్టాలకు అనుగుణంగా కేసులు రిజిస్టర్ చేసేందుకు న్యాయస్థానం భరోసా ఇవ్వాలని కోరింది. ఈ కేసుల దర్యాప్తులో ప్రభుత్వం తన ప్రభావం చూపించకుండా, అధికారాన్ని ఉపయోగించకుండా, బహిరంగ వేదికల ద్వారా ప్రజలమధ్య శత్రుత్వం పెంచే ప్రసంగాలు చేయకుండా నివారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరింది. రాష్ట్రంలో ప్రజలందరికీ చట్టబద్ధమైన సమాన రక్షణ కల్పిస్తామని,ప్రజల విశ్వాసాలకు, వారి స్వేచ్ఛకు పూర్తి భరోసా ఇస్తామని, రాజ్యాంగ విలువలను కాపాడతానని ముఖ్యమంత్రిగా చేసిన ప్రమాణాన్ని ఇలాంటి చర్యల ద్వారా ఆయన బాహాటంగా ఉల్లంఘించడమే అవుతుందని కూడా సిపిఐ కోర్టు దృష్టికి తీసుకువచ్చింది. హిమంత బిశ్వశర్మ చేస్తున్న వ్యాఖ్యలు అసోంలో ప్రజలమధ్య సామరస్య వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయని, ఆయన ప్రసంగాలు సైద్ధాంతిక తీవ్రతవైపు నెట్టి సమాజాన్ని రెండు శత్రుశిబిరాలుగా మార్చే ప్రమాదం తీసుకువస్తున్నారని, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం వంటి దేశ రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్నాయని ఈ పిటిషన్‌లో సిపిఐ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకంగా పక్షపాత ధోరణిని, శత్రుత్వాన్ని ఎలాంటి విచారణలూ లేకుండానే ముందస్తు తీర్పుల ద్వారా చట్టబద్ధం చేయడానికి ప్రభుత్వ అధికారాన్ని ప్రమాదకరస్థాయిలో ఆయన దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుకు తెలియజేసింది. ఈ విషయాలను బహిర్గతంచేసే పలు ఉదాహరణలను సిపిఐ ఈ పిటిషన్ ద్వారా న్యాయస్థానం ముందుంచింది. మైనారిటీలు సమాజానికి పెద్ద బెడదగా, అపాయంగా చిత్రీకరిస్తూ వారి బహిష్కరణను సాధారణాంశంగా మార్చి, మైనారిటీ వర్గాలను ఒంటరి చేసేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి అధికారిక రాజకీయ సందేశాలు, బహిరంగ ప్రకటనలను కోర్టు దృష్టికి తీసుకువెళ్ళింది. కాగా అధికారిక రాజకీయ వేదికల నుండి వ్యాప్తిచేసిన, ప్రస్తుతం పూర్తిగా చలామణీలో లేకుండా తొలగించిన వీడియో ప్రమాదకరంగా మారిందని, ఈ వీడియో ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తిచేసి, హింసను పురిగొల్పడానికి, విస్తరింపజేయడానికి ఒక కొత్త సాధనంగా ఇప్పటివరకూ ఉపయోగపడిందని, ఒక రాష్ట్రానికి మొదటి పౌరుడుగా, ఉన్నత కార్యనిర్వాహకస్థానంలో ఉన్న వ్యక్తి ఈ విధంగా ప్రవర్తించడం, రాష్ట్రంలో సాంఘిక వాతావరణాన్ని మతోన్మాదానికి నిలయంగా మార్చడానికి దోహదం చేయడం ద్వారా మైనారిటీలకు వ్యతిరేకంగా వివక్షను వ్యవస్థాగతం చేయడాన్ని ప్రోత్సహించడానికి యత్నిస్తున్నారని, దీనివల్ల మైనారిటీ వర్గాలలో అభద్రతాభావం పెరుగుతుందని, సమాన పౌరసత్వ భద్రత క్షీణించిపోతుందని సుప్రీంకోర్టుకు సిపిఐ తెలియజేసింది. అదేవిధంగా రాజ్యాంగం ప్రభుత్వబాధ్యతల్లో ఉన్నవారు విద్వేషాన్ని జాతి ప్రధాన స్రవంతిలో వ్యాప్తిచేయడానికి రాజ్యాంగం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించదని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ బాధ్యతలు నిర్వహించేవారు ఎవరైనాగానీ, ఎంత ఉన్నతస్థానాల్లో ఉన్నాగానీ చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేశారు. లౌకికవాదం అనేది కేవలం రాజకీయ అవసరాల కోసం ఉపయోగించేకునే విషయం కాదని,దేశంలోని పౌరులందరికీ ఉన్న గౌరవ మర్యాదలను, స్వేచ్ఛావిశ్వాసాలను, సమానత్వాన్ని సంరక్షించే రాజ్యాంగ మౌలిక సూత్రమని ఆమె స్పష్టం చేశారు.

దేశ లౌకికతత్వానికి, ప్రనజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు భారత కమ్యూనిస్టుపార్టీ పునరుద్ఘాటించింది. మతంపేరుతో ప్రజలను విభజించే శక్తులు, ఆ ధోరణులపై రాజకీయ,సామాజిక, న్యాయ వేదికలద్వారా కమ్యూనిస్టుపార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, రాజ్యాంగం ఇచ్చిన న్యాయం,స్వేచ్ఛ,సమానత్వం, సౌభ్రాతృత్వ వాగ్దానాలను పరిరక్షించడంకోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న అన్ని మార్గాలను పార్టీ అనుసరిస్తుందని సిపిఐ తన ప్రకటనలో స్పష్టం చేసింది.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com